మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)
70వ జయంతి సందర్భంగా...

మానవతామూర్తులు

(కొద్దిమంది స్ఫూర్తి ప్రదాతల పరిచయం)

మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)

గౌరవ్

ఏడుగుర్రాడ
రాజమహేంద్రవరం

మానవతా మూర్తులు

(కొద్దిమంది స్ఫూర్తి ప్రదాతల పరిచయం)

గౌరవ్

ప్రచురణ :

రాజమహేంద్రవరం

ది.4-12-2025,

మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)

70వ జయంతి సందర్భంగా

మూల్యం: అమూల్యం

© కాపీ లెఫ్ట్ సర్వహక్కులు సమాజానివి

వివరాలకు :

gouravmeka@gmail.com

విషయసూచిక

1.	మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మారక వేదిక	4
2.	మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మృతి చిహ్నంగా ఇప్పటివరకూ ప్రచురించిన పుస్తకాలు :	6
3.	అంకితం	8
4.	ప్రేమించడమే జీవించడానికి పరంపర కావాలి	9
5.	మహామనిషి మామిడి వెంకయ్య	12
6.	తెలుగు సాహితీ సారధి – 'శారద'	16
7.	విస్మృత అక్షర కిరణం	21
8.	మరుగునపడ్డ మహామేధావి	26
9.	అద్వితీయ చిత్రకళా మహాతపస్వి	30
10.	అచంచల అక్షర చైతన్యం – అన్నపూర్ణాదేవి !	35
11.	మహానుభావుడు మానవల్లి రామకృష్ణకవి	40
12.	జనహృదయాధీశుడు	46
13.	విస్మృత జీవన ఋషి	50
14.	తెలుగు వెలుగు డా. గురుకుల మిత్ర	56
15.	మానవీయ సాహిత్యశీలి కోడూరి	60
16.	విస్మృత బౌద్ధ మేధావి	65
17.	తొలి ప్రజాపక్ష పాత్రికేయ యోధుడు !	69
18.	ఆధ్యాత్మిక సామ్యవాద స్వాప్నికుడు.	73
19.	అనగనగా....ఓ పగటికల – గిజుభాయ్ !	78
20.	ప్రత్యామ్నాయ రంగస్థల ప్రవక్త	80
21.	సత్యాన్వేషణే సామ్యవాదం:శరద్ పాటిల్!	85
22.	ప్రత్యామ్నాయ సాంస్కృతిక సేనాని ! ఆంటోనియో గ్రాంస్కీ	91
23.	ఒక ప్రయాణం – భిన్న సందర్భాలు (లక్నో–కాన్పూర్–కాకోరీ స్మృతులు)	97
24.	ఇక కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభ.	99
25.	సత్యానంద్ స్టాక్స్: ఒక అన్వేషి జీవితం	117
26	ముగింపు	115

మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మారక వేదిక

ఒక జర్నలిస్టు స్మృతిలో స్థాపించిన సంస్థ ఇది.కాకినాడ జిల్లా పిఠాపురం కేంద్రంగా ఏర్పడిన 'బాంబు స్మారక సమితి' ఈనాటి వరకూ 15 విలువైన అమూల్య పుస్తకాలను ప్రచురించి, ఉచితంగా ప్రజానీకానికి అందించింది. అవన్నీ Internet Archives లో అందుబాటులో ఉన్నాయి. ఔత్సాహికులు, అన్వేషకులు

ఆసక్తి మేరకు అధ్యయనం చేయొచ్చు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందించవచ్చు. విమర్శలకు ఆహ్వానం.

విలక్షణ పాత్రికేయుడిగా, ప్రజాపక్ష బుద్ధిజీవిగా,ప్రత్యామ్నాయ యోచనా పరుడిగా, సామాజిక కార్యకర్తగా, రాజకీయ నేతగా, అడపదడపా సూటైన ఘాటు రచయితగా, పర్యావరణ వేత్తగా, పర్యాటకుడిగా, కళాకారుడిగా అన్నిటికీ మించి ఒక హృదయమున్న మనిషిగా ఎన్నో రకాల క్లిష్టమైన సంక్షోభాలకు సమాధానంగా నిరంతర మానవీయ సౌందర్య ప్రవాహంగా సాగిన అరుదైన జీవితం మేకా సత్యనారాయణ శాస్త్రి @ బాంబు గారిది.

జీవితాన్ని విలువల వెలుగులోనూ, సంస్కార సొబగులోనూ తప్ప యాంత్రిక మూసలోను, సంపాదనా చట్రాలలోనూ చూడని ఆయన జీవితం ఒక సంవేదనా భరిత సందేశం. న్యాయశాస్త్రం మీద సాధికారకమైన పట్టు ఉండి కూడా పట్టా పొందని పట్టభద్రుడు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులతో సంబంధాలు ఉండి కూడా వ్యకిగత స్వార్థానికి లొంగని నిబద్ధుడు. ఆయన జీవితం ఒక జనబాహుళ్య మమేకతా సోపానం.

మేకా సత్యనారాయణ శాస్త్రి @ బాంబు 70 వ జయంతి సందర్భంగా తీసుకొస్తున్న ఈ ప్రచురణ, అరుదైన వ్యక్తుల్ని వారి అసామాన్య కృషిని తెలియజేస్తూ అనేక సందర్భాల్లో రాసిన వ్యాసాల సమాహారం. వెలుగుచూడని వివిధ స్రవంతులకు చెందిన మేధావులను, వారి అనన్య సామాన్యమైన జీవితాలను క్లుప్తంగా బేరీజు వేసిన విలక్షణ కృతి. ప్రజాహితం కోసం బతుకుని వెచ్చించిన గొప్ప మనుషుల స్ఫూర్తిని పునర్నిర్మించుకోవడమే లక్ష్యంగా చేసుకొని వెలువడు తున్న మరో కెరటం. ఇతి శివమ్.

బాంబు స్మారక సమితి

పిఠాపురం

ఇది మా సంస్థ 16 వ ప్రచురణ.

మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) స్మృతి చిహ్నంగా ఇప్పటివరకూ ప్రచురించిన పుస్తకాలు :

1. ఒకే వ్యక్తి – అనేక జీవితాలు: రాహుల్ సాంకృత్యాయన్ (వ్యాస సంకలనం)
2. పర్యావరణ పరిరక్షణ : శాంతికీ, సంతోషానికి, సంతృప్తికీ మార్గం. (సుందర్లాల్ బహుగుణ జపాన్ ప్రసంగం)
3. మన కర్తవ్య మార్గం : మానవీయ, రాజకీయ, సామాజిక, ఆర్థిక జీవన పాశ్వాలు – (గదర్ బాబా సోహన్ సింగ్ భాక్నా విశిష్ట రచన)
4. సైన్స్ అంటే ఏమిటి ? పిల్లల కోసం విజ్ఞాన శాస్త్రం కథ వినోద్ రైనా, డి.పి. సింగ్.
5. పిఠాపురం మహారాజా శ్రీ ఆర్.వి.కె. ఎమ్. సూర్యారావు బహదూర్ ఐ.వి. చలపతిరావు
6. మహాత్మాగాంధీ : డా. సచ్చిదానంద సిన్హా
7. ప్రజాపక్ష మేధావి – ప్రత్యామ్నాయ చరిత్రకారుడు డి. డి. కొశాంబి : అరవింద్ గుప్తా
8. కాకినాడలో ఒక సాంఘిక సంస్కరణ : యలమంచిలి వెంకటప్పయ్య (పునర్ముద్రణ)

9. నాకో భార్య కావాలి :
   జడీ బ్రాడీ (50 ఏళ్ల నాటి సంచలన రచన అనువాదం)

10. ప్రజల కోసం పాత్రికేయం:
    ప్రమాణాలు ప్రభావాలు (వ్యాస సంకలనం)

11. ఏకవ్యక్తి సైన్యం
    మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు)

12. పితాపురానికి వెలుగురేఖలు:
    ముగ్గురు మహనీయుల శతజయంత్యుత్సవ పరిచయం.

13. ఇరువురు ఏక వ్యక్తి సైన్యాలు
    (విశిష్ట భావోద్యమ దంపతుల పరిచయం)

14. వాక్కులు – వాక్యాలు
    (పది ప్రసంగ వ్యాసాలు)

15. శతస్సుమాలు
    (శతాధిక పుస్తకాల పరిచయాలు.)

అంకితం



మహనీయుడు సంత్ కబీర్ దాస్ స్మృతిలో ఎన్నటి నుంచో ఒక సమగ్ర ప్రాజెక్ట్ తీసుకు వద్దామనే ఆలోచన ఉంది. సంత్ కబీర్ దాస్ జన్మించిన, అంతిమంగా శయనించిన ప్రదేశాలతో సహా కబీర్ పంత్ ఉన్న ప్రాంతాలు తిరిగాను. ' హద్ అనహద్ ' ఎంతో స్ఫూర్తినిచ్చిన డాక్యుమెంటరీ. కబీర్ దాస్ కోసం ఈసరికే ఎన్నో భాషల్లో ఎన్నెన్నో అధ్యయనాలు జరిగాయి. ఇంకా జరగాల్సి ఉన్నాయి.

వ్యక్తిగతంగా కబీర్ దోహాలు నాకు ఎంతో ఇష్టం.' ఏవీ ఏవి సేన్ నా...', ' సాధో రే...' వంటివి నా నోట్లో ఎప్పుడూ ఆడుతూనే ఉంటాయి. షబ్నం వీరమని మొదలు ప్రొఫెసర్ సాయిబాబా కబీర్ జైలు కవితల వరకు, తెలుగులో కూడా అనేక ప్రయత్నాలు జరిగాయి. ఎన్నడో పదిహేనేళ్ల క్రితం ' బేగంపుర ' కోసం మొదలెట్టి ఆపేసిన పరిశోధన సాక్షిగా కబీర్ ఓ వెల్లువెత్తిన జ్వాల.

అలాంటి మహోన్నత వ్యక్తి కృషి కోసం ఒక వర్క్ ఎన్నాళ్ళ నుండో అనుకుంటున్నా అవ్వడం లేదు.ఎన్నోవనుల్లానే అదీ నెరవేరని కలగానే మిగిలిపోయింది. అందుకే, కొద్దిమంది స్ఫూర్తి ప్రదాతల కోసం ఉద్దేశించిన ఈ పుస్తకాన్ని, సత్యాన్వేషణలో జీవితాన్ని త్యజించిన సంత్ కబీర్ దాస్ స్మృతికి అర్పించడం అర్థవంతంగా అనిపించింది. అందుకే, ఈ కృతి ఇలా...

ప్రేమించడమే జీవించడానికి పరంపర కావాలి

మనిషి జీవితానికి దిక్సూచిగా భావించే వ్యక్తులు ఎప్పుడూ కొందరుంటారు. వాళ్ళ జీవితం, కృషి, కాలం ఎంతగా మరుగు పరిచినా త్యాగం ప్రకాశిస్తూనే ఉంటుంది. చరిత్ర మర్చిపోయినా, భవిత గుర్తిస్తూనే ఉంటుంది. జీవించడానికి ప్రతీకలుగా నిలిచే ఆయా వ్యక్తుల జీవితాలే నిజానికి మానవతకు నిదర్శనాలు. అందుకే, అవే మానవీయ పరంపర.

అలాంటి మహనీయుల్ని వారి జీవితాదర్శాలను అయినంతలో అధ్యయనం చేయడం, పరిచయం చేయడం పనిగా పెట్టుకుని పరిమితుల్లో రచనా వ్యాసంగం చేస్తున్నాను. అందులో భాగంగా, కొన్నాళ్లుగా సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో రాసిన వ్యాసాలివి. ఆయా సందర్భాల్లో చేసిన విశ్లేషణలు ఇవి. దాదాపుగా అన్నీ పత్రికల్లో ప్రచురితాలే.

వ్యక్తిగత, సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక సంక్షోభాల సుడిగుండాల్లో నేటి యువత ఉంది. వారిని నిరంతరం మభ్యపెట్టేందుకు ఎన్నెన్నో దురాకర్షణలు సిద్ధమై ఉంటాయి. పుస్తకాలు చదవడం మానవాతీత వ్యవహారంగా చూసేవారు, లేదా సామాజిక హితం అనగానే మతి చెడినట్లు భావించేవారు ఉన్నారు. అందువల్ల సహజంగానే ఇవి కొరుకుడు పడవు.

డబ్బు, హోదా, స్థాయి, పలుకుబడి మాత్రమే చెలామణి అయ్యే లోకంలో జ్ఞానానికి విలువ ఉండదు. ఆధిపత్యం మాత్రమే అమలయ్యే సమాజంలో విలువలకు స్థానం కానరాదు. అసమానతలు మాత్రమే అజమాయిషీ చేసే

వ్యవస్థలో ఆత్మాభిమానం నిత్యం సంఘర్షించక తప్పదు. మనకి అక్షరం కూడా అమ్మకపు సరుకే.

అందుకే ఇక్కడ మనిషి జీవితానికి ఆర్థికతే ప్రమాణం. ఆస్తిపాస్తులే అన్నింటికి ఆధారం. అయినవాళ్లు, కానివాళ్ళూ కూడా అక్కడే ఆగిపోతారు. అంతకు మించి ఆలోచించే ధైర్యం చేయలేరు. ఎందుకంటే వాళ్ళు ఈసరికే మూస బానిసత్వానికి కట్టు బానిసలు. వ్యవస్థీకృత సంకుచితత్వానికి ప్రేరేపిత పదనిసలు. ఇంతకుమించి ఎదగరు, ఎదగాలని అనుకోరు.

మనిషి జీవితానికి అర్థం మనిషి కావడమే. ఏకాకి గా జనించిన వ్యక్తి సమూహంతో కలిసి సమష్టిగా సమాజంలో భాగం అవుతాడు. అతడు అనుసరించిన సన్మార్గమే అంతిమంగా అతడికో స్థానం సమకూరుస్తుంది. ఆద్యంత రహిత గతిలో ఆ స్థితిని అత్యున్నతంగా మల్చుకోవడమే మనిషి చేయాల్సిన పని. అదే, మనిషి తన తదనంతరం మిగిల్చే వారసత్వం.

ఇవి ప్రత్యేకంగా ఓ ప్రణాళిక ప్రకారం రాసినవి కాదు కాన, ముందస్తుగా పూనుకుని ప్రచురించ లేదు. ఆ పని ఇప్పటికి తీరింది. ఈ జీవితాలు ఈనాటి యువతకు ఏ మాత్రం స్ఫూర్తిని ప్రసాదించినా అంతకు మించిన సార్థకత ఈ కార్యానికి ఇంకేదీ లేదు. జనహితమే ఈ కృతి ప్రధాన అభిమతం. అదే మనిషి ఏ కాలంలో నైనా అనుసరించాల్సిన సిసలైన మతం.

సరిగ్గా వందేళ్ల కిందట విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ను కలిసి చాలా సేపు చర్చించారు. తర్వాత బెర్లిన్ లోని మాంచెస్టర్ గార్డియన్ అనే పత్రికలో తాను ఎప్పుడూ ఫాసిజాన్ని సమర్థించనని ప్రకటించారు. మరుసటి రోజే ముస్సోలీనీ పత్రిక ' పోపోలో డి ఇటాలియా ' ఠాగూర్ పై తిట్లతో తీవ్రంగా విరుచుకుపడింది.

తెచ్చిపెట్టుకున్న గౌరవాన్ని, కపట ప్రేమను చూపిస్తూ టాగూర్ పరివారాన్ని స్వాగతించిన ముస్సోలీని తన అసలురంగుని ఆ విధంగా బయటపెట్టాడు. నిజానికి ప్రపంచంలో ఉన్మాదం, అది ఏ రూపంలో ఉన్నా, ఏం పేరుతో చెలామణి అయినా

అది చేసే పని మాత్రం ఒక్కటే. మనుషుల్ని ద్వేషం ప్రాతిపాదికన వేరు చేయడం మాత్రమే.

అందుకనే ఆ ప్రమాదాన్ని గుర్తించిన విశ్వకవి, తర్వాత లోకంలోని ద్వేషాన్నంతటికి సరిపోయే సమాధానంగా 1926, నవంబర్ 8 న హంగేరిలో పర్యటిస్తూ అనారోగ్యం నుండి కోలుకునీ, అక్కడ ప్రసిద్ధ బాల్టన్ లేక్ వద్ద ఆహ్లాదకరమైన ప్రదేశంలో, ఒక మొక్కను నాటి అక్కడున్న అతిథి పుస్తకంలో నాలుగు అర్థవంతమైన మానవీయ మహా వాక్యాలు రాశారు.

When I am not longer on this earth, my tree

Let the ever renewed leaves of thy spring

Murmer to the wayfarers

The Poet did Love While he Lived

'నేను ఈ భూమి మీద లేనప్పుడు కూడా ఓ వృక్షరాజమా, దారిన పోయే బాటసారులకు వసంతంలో చిగురించే నీ ఆకుల సవ్వడితో మృదువైన ఈ మాటలు వినిపించు' " కవి జీవించినప్పుడు ప్రేమించాడు"

ఠాగూర్ శతజయంతి సందర్భంగా (1861 – 1961) సాహిత్య అకాడమీ మహామహుల వ్యాసాలతో ప్రచురించిన ఐదొందల పుటల గ్రంథంలో నెహ్రూతో పాటు ముందుమాట రాసిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉటంకించిన వాక్యాలివి. చదివాక నాకో వాక్యం తట్టింది.

"మనిషి జీవించడమంటే ప్రేమించడమే !"

– గౌరవ్

మహామనిషి మామిడి వెంకయ్య

మామిడి వెంకటార్యగా ప్రసిద్ధి చెందిన మామిడి వెంకయ్య స్వస్థలం పాలకొల్లు. నేటికి రెండు శతాబ్దాల క్రితం యావత్ భారతదేశంలోనే మొట్టమొదటి అకారాది తెలుగు నిఘంటువుని రూపొందించిన మహావ్యక్తి వెంకయ్య. ఆంధ్రదీపిక పేరిట వెంకయ్య కూర్చిన ఈ నిఘంటువును ఆ రోజుల్లో వెయ్యి వరహాలిచ్చి చెన్నై కళాశాల తరపున బ్రిటీష్ వారు తీసుకున్నారని ఆరుద్ర గారు సమగ్రాంధ్ర సాహిత్యంలో రాసారు. స్వయంగా సంస్కృతాంధ్ర పండితుడూ, పండితరాయ, బాలమర, సాహిత్యరత్న మొదలగు బిరుదులు కలిగిన మామిడి వెంకయ్య భాషావేత్త మాత్రమే కాదు, దేశంలోనే తొలితరం భావోద్యమ చింతనాపరుల్లో ఒకరనే విషయం చాలా మందికి తెలియదు. ఆ రోజుల్లో బ్రాహ్మణులకు మాత్రమే కలదనే యాజకత్వ పౌరోహిత్యం హక్కులను ప్రశ్నిస్తూ స్వయంగా వేదవేదాంగ ఉపనిషత్తుల్ని

అధ్యయనం చేశారు. కొడుకు ఉపనయనం తానే శాస్త్రోక్తంగా జరిపించడమే కాదు అందువల్ల ఎదురైన పర్యావసానాల్ని కూడా ధైర్యంగా ఎదుర్కొన్నాడు. జిల్లా కోర్టుల సంగతలా ఉంచితే, రెండొందల ఏళ్ళ క్రితమే ఏకంగా ఇంగ్లాండు ప్రివీకౌన్సిల్ వరకూ వెళ్ళి తన పోరాటం చేసిన ప్రజాపక్ష బుద్ధిజీవి మామిడి వెంకయ్య.

తెలుగునాట తిరుగులేని హేతువాదిగా ఖ్యాతినొందిన కీ.శే. రావిపూడి వెంకటాద్రి గారు మూడు దశాబ్దాల క్రితం కొద్దిమంది భావోద్యమ కారుల్ని పరిచయం చేస్తూ "అడుగుజాడలు" అనే పుస్తకం రాసారు. అందులో మొట్టమొదటి ప్రకరణాన్నే, "మామిడి వెంకయ్య మానవ హక్కుల పోరాటం" అని పేర్కొన్నారు. అందులో "పురోహితవర్గం మీద ఈ దేశంలో ఆధునిక యుగంలో జరిగిన తొలితిరుగుబాటు చేసిన వారు వైశ్యులు. వారికి నాయకత్వం వహించిన పండితుడు మామిడి వెంకయ్య" అంటారు.

అంతేకాదు, "మనుషులు కులాలుగా విభజించబడి, హక్కులు కులాల ప్రకారం విభజించబడి, అందుకు భిన్నంగా నడవడానికి అవకాశమివ్వని సమాజ వ్యవస్థలో కులాలపేర జరిగిన పోరాటాలు హక్కుల పోరాటాలే కాని, కులపోరాటాలు కావు." అంటారు వెంకటాద్రి. అఖిల భారత హేతువాద సంఘానికి చైర్మాన్‌గా సుదీర్ఘ కాలం ఉన్న ప్రముఖ భావోద్యమ నేత వెంకయ్య గారికి సమర్పించిన సగౌరవ నివాళి అది. ఆ రకంగా మామిడి వెంకయ్య గారిది దేశంలోనే తొలి మానవ హక్కుల పోరాటాల్లో ఒకటి.

ఆ మాటకొస్తే ప్రపంచంలోనే విశిష్టమైన మానవ హక్కుల పత్రంగా పేరొందిన థామస్ పెయినే Rights of Man (1791) కానీ, కార్ల్‌మార్క్స్, ఏంగిల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళిక (1848) కానీ మామిడి వెంకయ్య పోరాటం నాటికి ఇంకా వెలువడలేదు. ఆధిపత్యాన్ని నిరసించిన మామిడి వెంకయ్య మరణించిన వంద సంవత్సరాలకి డా. బి. ఆర్. అంబేద్కర్ 'కుల నిర్మూలన' (1935) వెలువడింది. ఆయన జీవితాంతం సకల న్యాయస్థానాల్లోనూ చేసిన సుదీర్ఘమైన పోరు కూడా ఆయన బతికుండగా ముగియలేదు. మరణించిన దశాబ్దం తరువాత ప్రివీ కౌన్సిల్ బ్రాహ్మణులకు అనుకూలంగా తన తీర్పు ప్రకటించింది. ఈ దేశంలోని

కులాహంకారాన్ని ఎదిరించడానికి ఆధిపత్య వర్గాలతో తలపడి చట్టబద్ధమైన ఉద్యమాన్ని ఏకవ్యక్తి సైన్యంగా చేసిన మామిడి వెంకయ్య కృషి మాత్రం మరుగున తదాదిగా పడిపోయింది. భాషావ్యాకరణాది అంశాల్లో ఆయన అసాధారణ కృషికి తగిన గుర్తింపు లభించింది కానీ, ఉద్యమశీలిగా వెంకయ్యను గుర్తించడం జరగలేదు. బ్రౌన్ వంటి మహా పరిశోధకుడే మామిడి వెంకయ్య చేసిన కృషి తనకి ఎంతో ఉపకరించిందని ప్రకటించాడంటే వెంకయ్యగారి ప్రతిభాపాటవం ఎంతటిదో ఊహించవచ్చు.

అయితే, భావోద్యమశీలిగా వెంకయ్యను గుర్తించిన తెలుగు వారు అరుదు. ఈరోజు కూడా ఆయన్ని భాషా సంస్కర్తగానే ఎక్కువ మంది పరిగణిస్తున్నారు. కుమారునికి ఉపనయనం చేసి ఆరోజుల్లో బ్రాహ్మణుల మీద ధిక్కారం ప్రకటించిన వెంకయ్యకి సరైన మద్దతు లభించని కారణంగానే తర్వాత కాలంలో ఆయన మచిలీపట్నం వెళ్ళి స్థిరపడ్డారు. అక్కడే ఆయన కృషికి గుర్తింపు లభించింది. తెలుగు భాషా ఉద్ధారకుడైన సి. పి. బ్రౌన్ వంటి ఎందరో ఔత్సాహిక పరిశోధకులకి తదనంతరం మామిడి వెంకయ్య గారు చేసిన కృషి, వేసిన అడుగులే మార్గదర్శకమయ్యాయని వారే స్వయంగా చెప్పుకున్నారు. బళ్ళారి కలెక్టరుగా పనిచేసి, “A Grammar of the Telugu Language” అనే విశిష్ట వ్యాకరణ గ్రంథం రచించిన క్యాంప్‌బెల్ పండితుడు ఆ పుస్తకం పీఠికలో వెంకయ్య కృషిని పేర్కొంటూ, ”Mamidi Vencaya, the author of the Andhra Depica, an excellent dictionary of Telugu has in the preface to this work, introduced a consice analysis of the language.” అంటారు. అందుకనే 1965లో మచిలీపట్నం నుండి ముద్రించిన ‘ఆంధ్రదీపిక’ మలిప్రచురణ కు ముందుమాట రాసిన శుద్ధ చైతన్యస్వామి, “అన్ని నిఘంటువులకూ ఆంధ్ర దీపిక తల్లి యనవలెను” అన్నారని పేర్కొంటారు డా. జి. వి. పూర్ణచందుగారు ‘ఆంధ్ర దీపిక ప్రశస్తి ‘అనే పరిశోధనాత్మక వ్యాసంలో.

ఇంతటి ప్రతిభాశాలి కనుకనే వెంకయ్య గారు యాజ్ఞవల్క్యుని పరాసర సంహితను తెలుగులో అనువదించడమే కాదు,ఆంధ్రలక్షణం, పర్యాయ పదాల రత్నమాల, శకట రేఫ లక్షణం, విశేష లబ్ధ చింతామణి, తెలుగు వ్యాకరణం వంటి

అనేక విశిష్టమైన గ్రంథాల్ని రచించారు. దురదృష్టవశాత్తు భాషాభిమానులు, వ్యాకరణవేత్తలే తప్పా భావోద్యమ సంస్థలేవీ వెంకయ్యగారి జీవితం, కృషి కోసం పరిశోధన చేయలేదు. ఆ కారణంగా ప్రస్తుతం లభిస్తున్న వివరాలు పరిమితమైనవే.

గ్రంధి వెంకట సుబ్బారాయ శర్మ (గుప్తా) 1930 లోనూ, పి. లక్ష్మీకాంతం శ్రేష్ఠి 60 వ దశకంలోను రచించిన చిరు పొత్తాలే కానీ ఔత్సాహికులు ఎవరూ పూనుకుని సమగ్ర శోధన చేసినట్టు లేదు. ఆయన జీవించిన కాలం నాటికి (1764 – 1834) అసలు దేశంలోని భావోద్యమాలేవీ ప్రారంభమే కాలేదు. రాజారామ్మోహన్ రాయ్, జోతిరావు ఫూలేలు ఇంకా రంగప్రవేశం చేయలేదు సరికదా దయానందులు పుట్టనే లేదంటారు రావిపూడి వెంకటాద్రి గారు. తెలుగు నేల మీద రెండు వందల సంవత్సరాల క్రితం కులాధిక్యతను ప్రశ్నించిన పోరాటం ఎందుకనో విస్మరణకు లోనై వెలుగులోకి రాలేదు.

మానవాళి మనుగడకి భావన ప్రజాతంత్ర వారధైతే, భాష సాంస్కృతిక సారధి. ఆధునిక మానవుడి చరిత్రకి భావోద్యమాలు ప్రాణమైతే, వాటి విస్తృతికి భాష అర్ధవంతమైన పునాది. అలాంటి వాడుక భాషలోని ఎన్నో పదాల్ని రేయింబవళ్ళు కష్టపడి చదువరులకి సులువుగా అందేలా కూర్చిన ఘనత మామిడి వెంకయ్యది. అలాగే, భావోద్యమశీలిగా కూడా ఎదిగిన ఆయన జనన మరణ వివరాల్లో ఎన్నో వివాదాలు ఉన్నప్పటికీ, ఆధునికాంధ్ర జగత్తులో నవోదయానికి నాంది పలుకుతూ ఆయన రూపొందించిన 'ఆంధ్రదీపిక' నిఘంటువు నాటి నుండి ఎందరెందరికో దారి దీపమై ప్రవర్థిల్లుతోంది. యావత్ దేశంలోనే తొలి నిఘంటుకర్తగా భాసించిన మామిడి వెంకటాచార్య స్ఫూర్తిని అరుదైన భావోద్యమ కారుడిగా కూడా గుర్తించడం సబబు. జాతి ఉన్నతి కోసం ఉద్యమించిన ప్రతి స్వరాన్నీ అదే తరంలోనైనా ఆ మేరకు గుర్తించి గౌరవించడమే మామిడి వెంకయ్య వంటి ధీరోదాత్తులకు మనం ఇవ్వదగిన కనీస నివాళి.

తెలుగు సాహితీ సారథి - 'శారద'



తెలుగు సాహిత్యంలో చెరగని మహోన్నత చరిత్ర శారద. సరిగ్గా వంద సంవత్సరాల క్రితం తెలీని తేదీన తమిళనాడులోని పుదుకోట్టెలో పుట్టిన ఎస్. నటరాజన్ 88 ఏళ్ళ క్రితం 1937లో ఒక చలికాలం ఉదయం కడుపు చేత పట్టుకుని తెనాలిలో కాలుమోపాడు. అప్పటికే ఆంధ్రా ప్యారిస్‌గా ప్రసిద్ధి చెందిన తెనాలి శారదకి కూడా హోటల్ పనివాడిగా ఓ దారి చూపింది. ఆసక్తితో తెలుగు నేర్చుకున్నాడు. అనురక్తితో అభ్యుదయ సాహిత్యం చదూకున్నాడు. అలా ఎందరో మిత్రుల్ని అక్కున చేర్చుకున్నాడు. స్వశక్తితో కలం పట్టి సగటు మనిషి పక్షం చేరాడు. ప్రజాపక్ష రచయితగా వందకి పైబడి కథలు, పదుల సంఖ్యలో నవలలు రాసి

ప్రగతిశీల తెలుగు సాహిత్యానికి తిరుగులేని సారథిగా మారాడు శారద అనబడే ఎస్. నటరాజన్.

తమిళనాడు ప్రభావంతో తెనాలిలో అప్పుడప్పుడే వెలుస్తున్న కాఫీ హొటెళ్ళలో పనివాడిగా మొదలెట్టి అనేక అవతారాలు ఎత్తాడు. సర్వర్‌గా, వంట పనివాడిగా ప్రారంభించి ప్రెస్ వర్కర్‌గా, పత్రికలు,పుస్తకాలు అమ్మడం, గారెల దుకాణం, మజ్జిగ వ్యాపారం వరకూ ఎన్నో పనులు చేసాడు. అంతేనా, 'ప్రజావాణి' పత్రిక నుండి 'చంద్రిక' పత్రిక స్థాపన దాకా పాత్రికేయుడిగా సాహితీ ద్రష్టగా రూపొందాడు. అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతుల జీవిత ఆదర్శాలతో ఏకంగా సినిమాలు తీయాలని తపించాడు. మొట్టమొదటి హొటల్ వర్కర్ల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరయ్యాడు. కాంగ్రెస్‌తో మొదలై సోషలిస్టు, రాడికల్ హ్యూమనిస్టు ధోరణులను కూడా ప్రత్యక్షంగా చూసి స్వతంత్ర ఆలోచనా పరుడిగా కమ్యూనిజాన్ని ఎంచుకున్నాడు. తెలుగులో శ్రమజీవి వైపు నిల్చే రచనా వ్యాసంగాన్ని సృష్టించిన విశిష్టమైన దార్శనికుడిగా ఎదిగాడు.

రోజుకి పద్దెనిమిది గంటలు వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తూ శక్తిని హోటలు పనికే ధారపోసిన ఆ భావుకుడు,పుట్టిన తర్వాత సరైన తిండీ, గుడ్డా ఎరగనని రాసుకున్నాడు. స్వతంత్రం వచ్చాక ఇలాగ ఉండదని ఆశించానని వాపోయాడు. కాఫీలు, బీడిలతోనే బతికిన శారద చిట్టచివరి వరకూ తన శక్తినీ, రక్తాన్నీ తెలుగు సాహిత్యం కోసమే ధారపోసిన అవిశ్రాంత కృషీవలుడు. ఇంతా చేసి అతడు బతికింది ముప్పై సంవత్సరాలు మాత్రమే. అందులోనూ అతడి రచనా కాలం మొత్తం ఏడేళ్ళే. అంత చిన్న వయసులో ఒకవైపు నిత్యం బతకడానికి పోరాటం చేస్తూనే మరోవైపు తెలుగు భాషా సాహిత్య సారస్వతాల్ని శ్రామిక వర్గ దృక్పథంతో నిరంతరం సుసంపన్నం చేసిన రచయిత మరొకరు లేరు.

అప్పటికే పాత్రికేయుడిగా తండ్రి వారసత్వం, తమిళ నాట వెలువడిన ఆంగ్ల అనువాద ప్రగతిశీల సాహిత్య ప్రభావం శారద మీద ఉంది. జీవితం నేర్పిన అసంఖ్యాక చేదు అనుభవాలు ఉన్నాయి. అదీకాక చలం, కుటుంబరావు తదితర అభ్యుదయ రచయితల పుస్తకాలనీ చదివాడు. ఆ స్ఫూర్తితోనే 'ప్రపంచానికి జబ్బు

చేసింది' అనే తొలి రచనతో ప్రజాశక్తిలో కలాన్ని ఝుళిపించి తనదైన గొంతుకతో నినదించిన శారద తన శరీరాన్ని తొలిచేస్తున్న మూర్ఛ జబ్బుకి బలై పోయాడు. అభ్యుదయ రచయితల సంఘంలో "రచనకు తగిన పారితోషికం పొందడం రచయిత హక్కు" అంటూ బహుశా మొట్ట మొదటి సారిగా తీర్మానం పెట్టిన శారద అవే ఆర్థిక బాధలతో అస్తవ్యస్త సమాజంలో అసహాయంగా అశువులు బాసాడు.

"పత్రికలవారు కథలు రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛ రోగాన్ని నయం చేసుకోడానికన్నా సరిపోతాయేమోనని సంతోషించాను. అదీ వట్టిదై పోయింది. ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుణ్ణని భావించ లేకపోవడంలో నా తప్పేమీ లేదనుకుంటాను." అంటూ, సరిగ్గా 75 ఏళ్ళ క్రితం 1949 ఫిబ్రవరిలో 'తెలుగు స్వతంత్ర' పత్రికలో 'నాదైన సమస్యలు (శారద మనోగతం) పేరిట శారద రాసుకున్న చివరి వాక్యాలివి. అసలా వ్యాసమే "నాకు అనిపిస్తుంది అప్పుడప్పుడు. ఈ చాకిరీ చేస్తూ ఇట్లా ఆలోచనలు చేస్తే తొరగా చచ్చిపోతానని." అంటూ ప్రారంభిస్తాడు. చనిపోయే నాటికి నిండు గర్భవతియైన భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్న 'శారద' కి మరణించిన తర్వాత కూడా తెలుగు సాహిత్యం, పాలకులు ఏమేరకు సముచిత స్థానం ఇచ్చారనేది ప్రశ్నార్థకమే.

"జీవితంలో నా ప్రధాన శత్రువులు దరిద్రం, అనారోగ్యం. నూనుగు మీసాల నూత్న యవ్వనపు రోజుల్లో హాయిగా తిని సుఖం గా బతకవలసిన స్థితిలో ప్రతి పైసాకూ పరాధీనుణ్ణయ్యా ప్రతిక్షణమూ బాధపడ్డాను. తరతరాలుగా, యుగయుగాలుగా ఈదేశంలో కటిక దరిద్రంలో కడుపుకు తిండి,వంటికి బట్టా ఎరుగని కోట్లాది అభాగ్యజీవుల ఆకలిమంటల భుగభుగల్ని, వాటి తాలూకు క్రూరాతిక్రూరమైన అనుభూతినీ అత్యల్పంగానైనా అప్పుడే పొందగలిగాను." అంటూ ఆనాటి పరిస్థితుల్ని గురించి వివరిస్తారు శారద జీవిత చరిత్రను "సాహిత్య బాటసారి – శారద" పేరిట రాసిన మహా రచయిత శారదకి ఆప్తులు, సహచరులు, ఆలూరి భుజంగరావు గారు.అలాటి జీవితాన్ని చూసాడు కనుకనే శారద, "ప్రతివాడి జీవితమూ సమస్యల మయం. ఏదో నిరర్థకంగా బతుకుతున్నట్టుగా గాఢనైరాశ్యంలో జీవిస్తున్నారు వాళ్ళు. జీవితావసర వస్తువులు కొనుక్కునే

తాహతైనా లేదు అట్టేమందికి. మధ్యరకం మనుషులు బాధల్ని కప్పిపుచ్చుకుని పరువు కాపాడుకుంటూ తిరుగుతున్నారు. కర్మ సిద్ధాంతం పుణ్యమా అని తమ సమస్యల్నీ, బాధల్నీ ఏదో అగోచర కారణాలకి ముడెట్టి సంతృప్తి పడుతున్నారు. వాళ్ళ దగ్గర మెసిలే కొద్ది డబ్బునీ ఆశ చూపించి లాగేస్తూ ఇతరులు బాగుపడుతున్నారు. ఆశ ఉన్నంతకాలం మనిషికి జూదం మీద జోతిష్యం మీద ఆశ చావదు. ఇందువల్లే పజిళ్ళు, బ్రాకెట్లు విపరీతంగా వ్యాపించిపోతున్నాయి. బాగా విజృంభించి, లేని వాళ్ళకి ఆశలు రెచ్చగొట్టి వాళ్ళ రక్తాన్ని పీల్చేస్తున్నాయి..." అంటూ కళ్ళకి కట్టినట్లు సగటు మనిషి స్థితిని గురించి రాస్తాడు ఒక నవలలో.

వాస్తవ జీవనసమరంకావిస్తూ, దుర్భర దారిద్ర్యంతో సంఘర్షించాడు కనుకనే సమసమాజం కోసం స్వప్నించిన నిబద్ధత కలిగిన విప్లవస్వాప్నికుడు కాగలిగాడు శారద. అందుకే వ్యవస్థలోని ఆధిపత్య రూపాలన్నింటినీ రచనలుగా మల్చి మానవ సంబంధాల్లోని అసమానతల్ని అక్షరీకరించాడు. దైనందిన జీవితంలోని ఒడిదుడుకుల్ని, సామాన్యులకి ఎదురయ్యే సమస్యలను నిజాయితీగా చర్చించాడు. ఒకనాటి తెలుగు సాహిత్య సాంస్కృతిక రాజకీయార్థిక సమాజానికి ప్రతిబింబంగా నిలిచే ఎన్నో రచనలు చేసాడు. ఎడతెగని దోపిడీకి, అన్యాయమైన చాకిరీకి అనారోగ్యంపాలై అకాలమరణం చెందిన అక్షర హాలికుడు శారద. అతడి కృషిని స్మరించు కోవడం తెలుగు వారి కనీస కర్తవ్యం.

ప్రస్తుతం శారద సంతానం పెద్ద వాళ్ళయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆ మధ్య కొందరు ఔత్సాహికులు పూనుకుని శారద రచనలు ప్రచురించారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో శారద రచనలు విద్యార్థులకి పాఠ్యాంశంగా కూడా పెట్టారు. అయితే, తెలుగు భాషపై మక్కువతో తెలుగుసాహిత్యం మీద మమకారంతో తమిళ నాట పుట్టి మూడుపదులు వయసులోనే జీవన యవనిక నుంచి నిష్క్రమించిన ఒక యువ ఆలోచనాపరుడు, తత్వవేత్త, మేధావి, పాత్రికేయుడు, కథకుడు, రచయిత, వ్యాసకర్త, అన్నింటికి మించి తెలుగు భాషను గుండెల్లో పెట్టుకుని ప్రేమించిన నిష్కళంక శ్రమజీవిగానే శారదని గుర్తించడం సబబు. అంతకంటే ముఖ్యంగా, తెలుగు ప్రాంతంలో క్రియాశీల ఆరంభ సామ్యవాదుల్లో ఒకడిగా, కమ్యూనిస్టు

కార్యకర్తగా జీవితాన్ని మల్చుకునే క్రమంలో ఆచరణలోనే అక్షర కక్ష్యల్ని చేధించిన అరుదైన యోధుడిగా శారదని స్మరించుకోడమే సముచితం.

శారద పుట్టిన సంవత్సరం 1924 అనీ 1925 అనీ వాదనలు ఉన్నాయి. చనిపోయింది మాత్రం 1955 ఆగష్టులో. ఆలూరి భుజంగరావుగారు రచించిన శారద జీవితచరిత్ర, ఆయన కథలతో కలిపి 'స్మృతి శకలాలు' పేరిట మొదటి సారి 40 ఏళ్ళ క్రితం 1985లో, రెండోసారి పదిహేనేళ్ళ క్రితం 2009లో తెలుగులో వచ్చింది. ఆయన జీవితం, రచనల గురించి పరిశోధించి పట్టాలు పొందిన వాళ్ళు కూడా ఎందరో ఉన్నారు. అయినప్పటికీ అవిశ్రాంతంగా ఈనేల మీద ఉవ్వెత్తున ఎగసిన శారద అక్షర ప్రభంజనాన్ని అంచనా వేయాల్సిన బృహత్కార్యం ఇంకా మిగిలే ఉంది. ఎందరో సాహితీ మిత్రుల సాంగత్యంలో పలు ప్రవాహాలుగా సాగిన శారద జీవన ప్రస్థానాన్ని మదింపు వేయాల్సిన మహత్కార్యం భవిష్యత్తులో జరగాల్సే ఉంది. అదే, అలుపెరుగని అక్షరశిల్పిగా మసిలిన మహా రచయిత 'శారద'కి, ఆయన అజరామర ఆశయాలకి తెలుగు సాహితీ లోకం పూనుకుని కనీసంగానైనా సమర్పించాల్సిన చిరస్మరణీయ నివాళి.

(ఎన్. నటరాజన్ ఏ శారద శతజయంతి సందర్భంగా)

విస్మృత అక్షర కిరణం

తెలుగు నేల మీద విస్మరించబడిన మహావ్యక్తి గద్దెలింగయ్య. తొలితరం స్వాతంత్ర ఉద్యమకారుడు, సోషలిస్టు,కమ్యూనిస్టు. సహాయ నిరాకరనోద్యమంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రాజమండ్రి, కడలూరు తదితర కారాగారాల్లో శిక్షను అనుభవించిన వ్యక్తి. తెలుగు లో మొట్టమొదటసారిగా కమ్యూనిస్టు ప్రణాళిక

ప్రచురించిన వ్యక్తి. తొలి సామ్యవాద పత్రిక " ప్రభ", ' నవయుగ ' పత్రికల వ్యవస్థాపకులు. 1935 లోనే ఫ్రెంచ్ సామ్యవాద రచయిత యూజన్ పాటియార్ రాసిన అంతర్జాతయ శ్రామిక గీతానికి బాలాంత్రపు నలినీకాంతరావు తెనిగించగా ప్రభ పత్రికలో ప్రచురించినట్లు తెలుస్తోంది. ఉద్యమ ప్రచారోద్యమంలో భాగంగా ఆదర్శ గ్రంథ మండలి స్థాపించి క్రొవ్విడి లింగరాజు గారు తర్జుమా చేసిన మాక్సిం గోర్కీ అద్వితీయ నవల " అమ్మ " మొదలుకుని పదుల సంఖ్యలో స్ఫూర్తి దాయక విలువైన రచనలని ప్రచురించిన దార్సనికుడు లింగయ్య. శరత్ నుండి రాహుల్ సాంకృత్యాయన్ వరకూ ఎందరో మహనీయులను స్వయంగా అచ్చు తెలుగులో అనువదించి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి. ఉద్యమానికి భావజాల ప్రచారం ఎంత అవసరమో గుర్తించి బ్రిటిష్ వారి కంట పడకుండా ఏకంగా పడవల్లో అచ్చు యంత్రాలు అమర్చి కరపత్రాలు, పుస్తకాలు ముద్రించిన యోధుడు. ఇలా చెబితే ఇంకా ఎన్నో.

కృష్ణా జిల్లా ఎలామర్రులో రైతాంగ కుటుంబంలో పుట్టినాయన జీవితం నిరంతర చైతన్య ప్రవాహం. నిత్యం సాహిత్య సాంస్కృతిక వెల్లువ లోనే గడిపినాయన వారి గ్రామంలో ' దయానంద గ్రంథాలయం' స్థాపించారు. అలాగే ప్రభ పత్రిక మొదట ఎలామర్రులోనే స్థాపించి తర్వాత బందరు నుండి ప్రచురించే వారు. ఆయన రాసిన విప్లవ వీరులు, విప్లవ యుగం తదితర గ్రంథాల్ని ప్రభుత్వం నిషేధించింది. తొలి సామ్యవాద నాటకాల్లో ఒకటైన మునిమాణిక్యం నరింహారావు రాసిన " తిరుగు బాటు "ను ప్రచురించారు. మొదటి విప్లవ పాటల సంకలనం కూడా ఆయనే ' క్రాంతిగీతాలు' పేరిట ప్రచురించగా ప్రభుత్వం నిషేధించింది. నాలుగేళ్లపాటు లింగయ్య గారిని డిటెన్యూగా చేసి వేధించారు. ఐనా,ఆయన ఎక్కడా వెనకడుగువేయలేదు. నిత్యం జన సమూహాల మధ్యనే ఉంటూ నిర్మాణాత్మకంగా పనిచేశారు. కృష్ణాజిల్లా సోషలిస్టు పార్టీకి ప్రథమ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సమాజం లోని అట్టడుగు వర్గాల ఉన్నతి కోసం క్రియాశీలకంగా కృషి చేశారు.

ఇదంతా ఒకెత్తయితే, ఆదర్శ గ్రంథ మండలి స్థాపించి ఆయన చేసిన మహత్తరమైన సేవ ఒక్కటీ ఒకెత్తు.తెలుగులో ఏకైక గదర్ వీరుడు దరిసి చెంచయ్య

ఆత్మకథ " నేనూ, నా దేశం " మొదలుకుని అయ్యదేవర కాళేశ్వరరావు స్వీయ చరిత్ర " నా జీవిత కథ" వరకూ ఎన్నో అద్భుతమైన సంచలనాత్మక గ్రంథాలకు సంపాదకునిగా ఉండి లింగయ్యప్రచురించారు. "ప్రజాసామాన్యంలో ఎన్నో సిద్ధాంత గ్రంథాలు చేయలేని పనిని ' అమ్మ ' వంటి ఉత్తమ నవల సునాయాసంగా చేయగలుగుతుంది. అలాగే నాటకాలు, కథలూ, డక్కీ కథలూ, జంగం కథలు,ద్విపద కావ్యాలూ, తుమ్మెద పాటలు ఇదీ అదీ ఏమిటి అన్నీ సామ్య వాద భావాలతో కర్షక కార్మిక జీవిత సమస్యల తో నిండి వుండాలని నా ఆశయము. ఈ ఆశయాన్ని దృక్పధంలో ఉంచుకునే మేము గ్రంథ ప్రచురణలో ముందడుగు వేస్తున్నాము." అంటూ తిరుగుబాటు నాటకానికి రాసిన ముందు మాటలో చెప్పుకున్నాయన చివరి వరకూ అలా నమ్మిన సిద్ధాంతానికి నిబద్ధతతో కట్టుబడే ఉన్నారు.

పుస్తకప్రచురణని కాలక్షేపం కోసం చేసే వ్యవహారంగానో లాభార్జన వ్యాపారంగానో ఆయన చూడలేదు. అసమానతలతో నిండిన సమాజంలో ఆధిపత్యానికి వ్యతిరేకంగా చేసే బహుముఖ పోరాటంలో ఆయుధాలలాగే అక్షరాలని చూశారు. అందుకే అటు వంగ దేశంలోని శరత్ బాబు నుండీ ఉత్తరాది మహా మహుడైన రాహుల్జీ వరకూ తెలుగువారికి, ముఖ్యంగా పీడిత ప్రజలకి పరిచయం చేయడం కోసం అహర్నిశలూ తపించారు. కేవలం గ్రంథాలు అచ్చేయడంతోనే తన పని ఐపోయిందని సరిపెట్టు కోకుండా ఆ సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు ఎలా తీసుకెళ్ళాలో కూడా యోచించారు. విజయవాడ పుస్తకప్రచురణల సంఘానికి ఉపాధ్యక్షులుగా ఎన్నో నిర్మాణాత్మక నిర్ణయాలుతీసుకున్నారు. 1963, జనవరి 7 వ తేదీన ఏదో పనిమీద నెల్లూరు వెళ్లిన లింగయ్య గుండె పోటుతో యాభై రెండేళ్ల చిన్నవయసులోనేఅకస్మాత్తుగా మరణించారని నాటి పత్రికల ద్వారా తెలుస్తోంది. ఆయన హఠాత్ మరణానికి దిగ్భ్రాంతి చెందిన పుస్తక సంస్థల అధినేతలు సంతాప సూచకంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛందంగా వారి పుస్తకాల దుకాణాలు మూసే సారంటే లింగయ్య గారి పై ఉన్న గౌరవం ఎంతటిదో అర్థమౌతుంది.

లింగయ్య గారి తదనంతరం ఆయన పేరు మీద వారి సంతానం లింగయ్య

గ్రూప్ వ్యాపార సంస్థలతో పాటు హర్యానాలోని ఫరిదాబాద్ దగ్గర 'లింగయాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ & టెక్నాలజీ ' అనే విద్యాసంస్థ స్థాపించారు. అది ఇప్పుడు విశ్వవిద్యాలయంగా కూడా ప్రభుత్వం గుర్తించింది. దక్షిణాదికి చెందిన ఒక తెలుగు వ్యక్తి, భావోద్యమకారుడూ, కమ్యూనిస్టు స్మృతిలో ఆయన పేరుతో దేశరాజధాని నడి బొడ్డున అంతటి విద్యా సంస్థ, యూనివర్సిటీ ఉండటం అరుదైన విషయం.నిజానికి తెలుగు వారికి గర్వకారణం. ఐతే దురదృష్టవశాత్తూ గద్దె లింగయ్య గారి జీవితాన్ని గురించిన సమాచారం కానీ, ఆయన పాల్గొన్న ఉద్యమాలు, చేసిన రచనలు, మొత్తం అనువాదాలు, ప్రచురించిన గ్రంథాలు, ఏర్పాటుచేసిన పత్రికలు, సంస్థల వివరాలేవీ ఒక్కచోట సమగ్రంగా నమోదు చేయబడలేదు. కారణాలుతెలీదు కానీ వారి వారసత్వ సంస్థలు కూడా అటువంటి ప్రయత్నం చేసినట్టు లేదు. అంత కంటే భాధాకరమైన విషయం లింగయ్య భావోద్యమ వారసులుగా ఉన్నవారు సైతం భావజాల రంగంలో ఆయన చేసిన క్రియాశీలక కృషిని కొనసాగించినట్టు లేదు.

లింగయ్య గారి జన్మ సంవత్సరం 1910 అనీ 1911 అనీ వాదనలున్నాయి. ఎలా చూసుకున్నప్పటికీ ఇదాయన 115 వ జయంతి సంవత్సరం. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు అవుతోంది. ఆ సందర్భంగా వివిధ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. కాగా తెలుగు ప్రాంతాల్లో రమారమి తొంభై ఏళ్ళ క్రితం మొదట సామ్యవాద సంఘం ఏర్పడినట్లు తెలుస్తోంది. అందులో మొదటిసారిగా కమ్యూనిస్టు ప్రణాళిక నుండీ పదుల సంఖ్యలో అనేకానేక ప్రగతిశీల పుస్తక సాహిత్యాన్ని ప్రచురించడం జరిగింది. అలా తెలుగు నేల మీద సాంస్కృతిక భావజాల రంగాన్ని సుసంపన్నం చేసిన తొలితరం బుద్ధిజీవి గద్దె లింగయ్య వంటి వారి కృషిని గురించి ఈ సందర్భంలో ప్రస్థావించుకోవడం, గుర్తించి గౌరవించుకోవడం,అభ్యుదయ భావజాల స్రవంతికి అవసరం. ఈరోజు ఇరు తెలుగు రాష్ట్రాలలో వెల్లువగా వివిధ సంస్థల పుస్తక ప్రచురణ సాగుతోందంటే దానికి ఆద్యులుగా గద్దె లింగయ్య వంటి వారి మార్గదర్శకత్వం కూడా ఒక ప్రధాన కారణం.

నేడు విభిన్న కమ్యూనిస్టు పార్టీలు, ప్రగతిశీల సంఘాలు విలక్షణమైన ప్రయోగాలు చేస్తూ అనేకప్రచురణలు తీసుకు వస్తున్నాయి. ఎన్నోకొత్త తరహా కార్యక్రమాలు చేపడుతున్నాయి.వాటన్నిటిలో అంతర్లీనంగా ఒకనాడు ఏటికి ఎదురీదిన గద్దె లింగయ్య వంటి తొలితరం చింతనా శీలుల చిరస్మరణీయ చరిత్ర ఇమిడి ఉంది.నిత్య విద్యార్థిగా, నిరంతర ప్రవాహశీలిగా, ప్రజాపక్ష పత్రికా సంపాదకునిగా, అవిశ్రాంత రచయితగా, చారిత్రక అనువాదకునిగా, విశిష్టమైన ప్రచురణకర్తగా, స్వాతంత్ర సమరశీలిగా, సోషలిస్టు నేతగా, కమ్యూనిస్టు విప్లవ కారుడిగా, అన్నింటినీ మించి అచంచల మానవతావాదిగా జీవితాంతం మసిలిన గద్దె లింగయ్య గారి స్ఫూర్తిని భవిషత్తు తరాలకు పరిచయం చేయాల్సిన గురుతర బాధ్యత ఈరోజు మరింత ఎక్కువగా ఉంది. ఆ దిశగా మహోన్నతమైన ఆయన ఆశయ సాధనకు, అజరామరమైన ఆయన అక్షర సేద్యానికి మనస్ఫూర్తిగా జోహార్లు అర్పిస్తూ లింగయ్య గారు సూచించిన మార్గంలో ముందుకు వెళ్ళడమే ఆ మహనీయ మూర్తికి మనవంతు ప్రకటించే కనీస నివాళి.

(కమ్యూనిస్టుపార్టీ శతవార్షికోత్సవ సందర్భంగా తొలితరం తెలుగు భావోద్యమకారుడు గద్దె లింగయ్య గారి స్మృతిలో...)

మరుగునపడ్డ మహామేధావి

ఎం. వి. వి. కె. రంగాచారి భారతదేశంలోని తొలి ఆధునిక భావోద్యమకారుల్లో ఒకరు. 1889లో ముదునూరుపాడు అనే గ్రామంలో పుట్టిన ఆయన బాల్యంలోనే కుటుంబంలోని ఛాందస మతతత్వాన్ని చూసారు. సముద్రయానం చేసే వారి బంధువుల్ని తోటివారే వెలేయడం చూసి చలించిపోయారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి లా చేసినాయన 1910లో హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఎన్నో సామాజిక వివక్షల్ని, అసాంఘిక కట్టుబాట్లనూ కళ్ళారా చూసి స్వతంత్ర చింతనాశీలిగా మారి మూఢాచారాల్ని నిరసించారు. వందేళ్ళ క్రితం 1920 లోనే లండన్‌లోని రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్‌లో సభ్యుడవ్వడమే కాకుండా ఆ అంతర్జాతీయ హేతువాద సంఘానికి మద్రాసు

ప్రెసిడెన్సీలో గౌరవ కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు. ఇంకా సంస్కరణవాద ఛాయలే తెలుగు నేలని పూర్తిగా తాకని ఆనాటి వాతావరణంలో ఏకంగా ప్రపంచంలోనే విశిష్టమైన భావోద్యమ సంఘంలో భాగస్వామైన తొలి తెలుగు వ్యక్తుల్లో రంగాచారి ఒకరు.

అంతేకాదు, బొంబాయి కేంద్రంగా ఏర్పడిన భారతీయ హేతువాద సంఘం (రేషనలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) లో క్రియాశీల వ్యక్తి. ఆ సంస్థ నడిపే "రీజన్ రివోల్ట్" పత్రికలో ఎన్నో విలువైన రచనలు చేశారు. ఇండియన్ ఫిలాసఫికల్ కాంగ్రెస్‌లో సభ్యునిగా ఉండటమే కాదు, అలహాబాద్‌లో జరిగిన 14వ భారతీయ తాత్విక మహాసభలో "నైతికత – సాంఘిక తత్వం' అనే విభాగానికి అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. అమెరికాకి చెందిన ప్రముఖ హేతువాది మాక్స్ ఐసెన్‌బర్గ్, ఇంగ్లాండ్‌కి చెందిన విఖ్యాత భావోద్యమ నాయకుడైన చార్లెస్ బ్రాడ్లా కుమార్తె చార్లెస్ బ్రాడ్లా బోనర్ వంటి మహామహులు కూడా రంగాచారి సాహిత్య కృషిని ప్రశంసించారంటే ఆనాడు ఒంటిచేత్తో అక్షరాల్ని ఆసరాగా చేసుకుని ఆయన చేసిన భావోద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతటి ప్రభావం కలిగించాయో అర్థం అవుతుంది.

వివిధ రకాల తాత్విక, మత, వైజ్ఞానిక భావ ధారల్ని విశ్లేషిస్తూ Groundwork In Dialectics (How Thought and Things Ever Derive) అనే రెండొందల పుటల రచన చేసిన రంగాచారి ఆధునిక ఆలోచనాధారని పరిచయం చేస్తూ, 'ముకుందమాల' అనే గ్రంథం రాసారు. ప్రపంచ మతాల సమ్మేళనం (world congress of faiths) అంతర్జాతీయ మహాసభలు పారిస్, శ్రీలంక, తదితర దేశాల్లో జరిగినప్పుడు పరిశోధనాత్మక వ్యాసాల్ని సమర్పించారు. రాజారామ్మోహన్ రాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజారామ్మోహన్ రాయ్ ని 'నాస్తికుడు' గా విశ్లేషించడమే కాకుండా, చార్లెస్ బ్రాడ్లా, ఇంగర్‌సోల్ వంటి భావోద్యమకారులతో పోలుస్తూ అత్యద్భుతంగా ప్రసంగించారని ఆ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌లో ఉంది. రవీంద్రనాథ్ ఠాగూర్, ఎమ్మెన్ రాయ్ వంటి మహామహులతో సమానంగా ఒక తెలుగువాడు ప్రసంగించడం, రచనలు

చేయడం అసాధారణ విషయం.

ఐతే, దురదృష్టవశాత్తు ఇంతటి మహావ్యక్తి గురించి మనకి లభిస్తున్న సమాచారం చాలా తక్కువే. ఆయన సమకాలీకులు కానీ తదనంతరం కానీ రంగాచారి కోసం ఎక్కడా నమోదు చేయలేదు. హేతువాద,మానవవాద చరిత్రలో సైతం ఫలానా రంగాచారి అనే వ్యక్తి భావోద్యమ రచనలు చేస్తుండే వారనే వరకే ఉంది.మహాతాత్వికుడు నీషే మొదలుకుని బెర్ట్రాండ్ రస్సెల్ వరకూ ఆయన అత్యంత శక్తివంతమైన రీతిలో గొప్ప ఇంగ్లీషు భాషలో చేసిన రచనలు కొన్ని అంతర్జాలంలో లభిస్తున్నాయి. రంగాచారి కాకినాడ ఎందుకు వచ్చారో తెలీదు. తెలుగులో ఏవైనా రాసారేమో వివరం లేదు. ఆంగ్లంలో మాత్రం విస్తారమైన రచనా వ్యాసంగం కావించినట్లు తెలుస్తోంది. ఐతే, 1960 ఫిబ్రవరి నాటి 'ఇండియన్ లిబరిటేరియన్' పత్రికలో రంగాచారి కుమారుడు సత్యం 28 – 12 – 1959 న ఆయన మరణించినట్లు తెలియజేస్తూ రంగాచారి గారి కోసం రాసిన సంక్షిప్త పరిచయం మాత్రమే ఆయన గురించిన ఏకైక ఆధారం.

దానిప్రకారం సాంప్రదాయిక వైష్ణవడిగా పుట్టిన రంగాచారికి చిన్న వయసులోనే వివాహం జరిగిందనీ, ఆయనకి దేశదేశాల ఆలోచనా పరులు, భావోద్యమాలతో సంబంధాలు ఉన్నాయనీ, ఆయన చివరి రోజుల్లో పక్షవాతంతో బాధపడుతున్నప్పుడు కూడా సాహిత్య పఠనం, రచనా వ్యాసంగం విడనాడలేదనీ తెలుస్తుంది. చనిపోవడానికి వారం రోజుల ముందు కూడా (బెంగుళూరులో?) "World State" (విశ్వజనీన రాజ్యం) అనే రచనను ప్రచురణకి సిద్ధం చేసారనంటే ప్రజాపక్ష మేధావిగా, విస్తృత రచయితగా ఆయన నిబద్ధతకి అదో తిరుగులేని చిహ్నం. జీవితాంతం తండ్రిగా, గురువుగా, మార్గదర్శిగా రంగాచారి మసిలిన తీరును,ఆయనతోగల ఆప్యాయతను ఆ చిన్న నివాళి వ్యాసంలో కుమారుడుగా సత్యం వ్యక్తీకరించిన విధానం వారిద్దరి అనుబంధానికి చిహ్నం. ఐతే,తర్వాత కాలంలో ఆ పిల్లలు, వారి వివరాలు ఏమీ తెలియడం లేదు. కనీసం రంగాచారి పూర్తి రచనల జాబితా కూడా దొరకడం లేదు.

The basic spiritual truth in Indian philosophy is Man అన్న రంగాచారి,

"Humanity is the meeting ground of all religion, philosophy, politics, science and the art of life..." అంటారు ఓ చోట. మతాలయినా, రాజకీయ తత్వాలయినా, శాస్త్రీయ మార్గాలయినా మమేకం కావల్సింది మానవతతోనే అని ఆయన భావన. యావత్ తెలుగు నేల మీద తొలితరం భావోద్యమ ప్రచారకుల్లో ఒకరిగా ఎం. వి. వి. కే. రంగాచారి గారి గురించిన మరింత సమాచారం వెలికి తీయాల్సి ఉంది. ఎందుకంటే, ఆయన పట్టభద్రుడు మాత్రమే కాదు. ఉన్నత విద్యావంతుడిగా, భావోద్యమ నేతగా మత సామరస్యకునిగా, మానవోద్యమ కార్యకర్తగా, ప్రత్యామ్నాయ సాహితీవేత్తగా వెలిగిన వ్యక్తి. వేదవేదాంగ ఇతిహాసాలు, ఉపనిషత్తులు పురాణములు మొదలుకొని భక్తి ఉద్యమాలు, వివిధ వైజ్ఞానిక మార్గాల్ని లోతుగా అధ్యయనం చేసిన మేధావి. తెలుగునాట సగటు మనిషి కోసం కలం పట్టిన చింతనాపరుడు. పేరు కోసమో గుర్తింపు కోసమో కాకుండా తాను నమ్మిన దాన్ని నిజాయితీగా బహిరంగంగా అక్షరాల్లో స్పష్టంగా ప్రకటించిన ధైర్యశాలి. మరి, అలాంటి వ్యక్తి యొక్క చరిత్ర మరుగున పడటం అంటే అది మొత్తం భావోద్యమాల్లో కొనసాగుతున్న సంక్షోభానికి ప్రతీక.

మానవాళి ఆలోచనా సరళిని వికసింపజేసిన మహనీయుల చరిత్ర సమాజం పురోగతికి తోడ్పడుతుంది. వారి కృషిని విస్మరించిన వ్యవస్థ ప్రమాదకరమైన ధోరణులకు వంత పాడుతుంది. ఏ కాలంలోనైనా సరే, సంకుచితత్వాన్ని కాదని విశాల దృక్పథంతో ముందుకు సాగిన వారినే చరిత్ర గుర్తిస్తుంది. అందుకనే, మతతత్వ రాజకీయ ధోరణులు కొత్తరూపాలలో పేట్రేగిపోతున్న ప్రస్తుత కాలంలో తెలుగు నాట కులమతాలకు అతీతంగా భావోద్యమాల్ని తన అక్షరాలతో, ఆచరణతో బలోపేతం చేసిన ఎమ్. వి. వి. కే. రంగాచారి వంటి వారి మహత్తర కృషిని స్మరించుకోవడం సమాజంలో మానవత్వం ఇంకా పూర్తిగా మసకబార లేదన డానికి కనీస సంకేతం. అలా, ఆయన చూపిన మార్గంలో ఆలోచనోద్యమాల్ని నిర్మించుకోగలగడమే రంగాచారి గారి కృషికి మనం ఇవ్వదగ్గ నిజమైన మానవీయ నివాళి.

(డిసెంబరు 28 రంగాచారి 65 వ వర్ధంతి.)

అద్వితీయ చిత్రకళా మహాతపస్వి

తెలుగు జాతి సాంస్కృతిక పునరుజ్జీవనానికి అతి పిన్న వయసులో విశిష్టమైన కృషి చేసిన తొలి కళా తపస్వి దామెర్ల రామారావు. ప్రసిద్ధ నాటకరంగ చిత్రకారులు, ఇలాస్ట్రేటెడ్ వీక్లీ పత్రికా సంపాదకులుగా చేసిన ఏ.ఎస్.రామ్, అప్పటి రాజమహేంద్రవరం కళాశాల ప్రిన్సిపాల్ గా వచ్చిన బ్రిటిష్ కవి, రసజ్ఞుడు, చిత్రకారుడు ఆస్వాల్డ్ జె. కూల్డ్ ల ప్రభావంతో పద్నాలుగేళ్ల ప్రాయంలోనే

రామారావు, అసాధారణ కళాకారుడిగా ఎదిగారు. బాల్యం నుంచే చిత్రకళ పట్ల నెలకొన్న గాఢమైన అభినివేశం ఆయన్ని అవిశ్రాంత కళా పిపాసిగా చేసింది. 1897, మార్చి 8న లక్ష్మీదేవమ్మ, దామెర్ల వెంకటరమణ దంపతులకు జన్మించిన రామారావు రెండు పదుల వయసు నిండకుండానే ముంబైలోని జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో చేరి చిత్రకళలో నైపుణ్యం సంపాదించారు. చిన్న వయసులోనే "ఫైన్ ఆర్ట్స్ సొసైటీ" స్థాపించారు. దేశం అంతా విస్తృతంగా పర్యటించారు. కళ వికశించేది సమాజంలోనే కానీ నాలుగ్గోడల మధ్య కాదనే స్పృహతో అటు గుజరాత్ మొదలు ఇటు బెంగాల్ వరకూ నలుచెరుగులా కుంచెను కాలికి కట్టుకు తిరిగిన అరుదైన తొలి ఆధునిక సంచార యువ కళాన్వేషి దామెర్ల రామారావు రాజమండ్రి కళాశాలకు ప్రిన్సిపాల్ గా చేసిన ఆంగ్ల రచయిత ఆస్వాల్డ్ కూల్హెకి రామారావు అంటే ఎంత అభిమానమంటే ఆయన రాసిన ' సౌత్ ఇండియన్ హవర్స్ ' అనే గ్రంథాన్ని తెలుగులో గొప్ప చిత్రకారులైన కవికొండల వెంకటరావు, అడివి బాపిరాజు లతో బాటుగా దామెర్ల రామారావు గారికి కూడా అంకిత మిచ్చారు. దేశంలోని అజంతా, ఎల్లోరా, ఎలిఫెన్టా గుహల నుండీ భావనగర్, ద్వారక దాకా డిల్లీ, ఆగ్రాల నుంచీ పూరీ, భువనేశ్వర్ ల వరకూ వివిధ శిల్పకళా ప్రాంతాల్ని రామారావు దర్శించారు. భారతీయ ఏథెన్స్ గా పేరొందిన గుజరాత్ లోని కటియావాడ్ ప్రాంతాన్ని మనస్ఫూర్తిగా ప్రేమించారు. అక్కడ మట్టి పరిమళాలతో నిండిన మనుషుల్ని, మానవీయ సౌరభాలతో అలరారే మమతల్నీ సజీవంగా చిత్రీకరించారు. ఆ చిత్తరువులు ఎంత అందంగా ఉంటాయంటే బహుశా ఆ ప్రాంత ప్రజలు కూడా వారి జీవన సౌందర్యాన్ని అంత లోతుగా ఊహించుకోలేరేమో. ఎల్లలు లేని స్వచ్ఛమైన పల్లె పడుచుల సహజమైన సొబగులకు రామారావు తన చిత్రాలలో శాశ్వతంగా ప్రాణం పోసారనిపిస్తుంది.

అందుకే ప్రఖ్యాత కవి పండితులు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు, "జీవముల వోసి, బొమ్మల జేసెనొకడు / బొమ్మలు గీసి జీవమును వోసేనొకడు / రాముడాతడు, దామెర్ల రాము డితడు / లేవు కాలావధులు చిత్ర లీలలందు." అన్నారు. భావనగర్లో ఉండగానే రవీంద్రనాథ్ టాగోర్ ను కలిసారు.

కలిసిన పది నిమిషాల్లో విశ్వకవి చిత్రపటాన్ని గీసిచ్చిన రామారావు ప్రతిభకు ఆశ్చర్యపోయిన టాగోర్ "ప్రపంచంలోకెల్లా గొప్ప చిత్రకరుడివి కాగలవు" అని దీవించారట. టాగోర్ సంతకంతో ఉన్న ఆ చిత్రం ఇప్పటికీ గ్యాలరీలో ఉంది. ముంబయిలో జె. జె. కాలేజి డీన్ సేసిల్ బర్న్స్, సోలమన్ వంటి చిత్రకారులతో మెలిగిన రామారావు, బెంగాల్లోని విఖ్యాత చిత్రకారులైన అవనీంద్రనాథ్ టాగోర్, ప్రమోద్కుమార్ చటోపాద్యాయ, నందలాల్ బోస్ వంటి ఉత్తమ కళాకారుల సాంగత్యంలో గడిపారు. అప్పటి వైస్రాయ్ లార్డ్ రీడింగ్ రామారావు గారి ' తూర్పు కనుమల్లో గోదావరి ' చిత్రాన్ని చూసి ముగ్ధుడై అప్పటికప్పుడు ఆ చిత్రం కొనేయడమే కాక, " స్వదేశీ ఉద్యమం జరుగుతున్న సమయంలో నేను స్వదేశీ చిత్రాన్ని కొంటున్నాను చూడండి..' అని చమత్కరించారట. రామారావుగారి 'ఋష్య శృంగ భంగం ' అనే చిత్రానికి ' ఓరియంటల్ సొసైటీ ' ఆద్వర్యంలో కోల్కతాలో జరిగిన ప్రదర్శనలో అత్యున్నత వైస్రాయ్ పురస్కారం లభించడం విశేషం.

అశ్లీలతకు తావులేకుండా భారతీయ మహిళని తొలిసారిగా నగ్నంగా చిత్రించిన రామారావు గారు నవ్యాంధ్ర చిత్రకళా స్థాపకులు. 1922 లో రాజమండ్రిలో ' ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్ ' పేరిట చిత్రకళాశాలను స్థాపించారు. అప్పుడే సత్యవాణి అనే చిత్రకారిణిని వివాహం చేసుకున్నారు. రామారావుగారి చిత్రాలకి ఆయన భార్య సత్యవానిగారే 'మోడల్' గా ఉండేవారు. ఆయన భార్యతో బాటుగా సోదరి బుచ్చి కృష్ణమ్మ, మిత్రులు వరదా వెంకటరత్నం, చేమకూర సత్య నారాయణ అంతా పేరెన్నిక గల చిత్రకారులే. చిత్రకళ అంటే కేవలం ఆకృతులు మాత్రమే కాదు, ఒక సమాజ సాంస్కృతిక అంతరంగం. ఆయా వ్యవస్థ యొక్క ఆత్మిక వ్యక్తీకరణ. అందుకే, చిత్రకారుడు స్వాప్నికుడు కావాలేగానీ పనిలో నిపుణుడై ఉంటే సరిపోదు. ఈ గ్రహింపు ఉండబట్టే రామారావు అచిర కాలంలోనే అనితర సాధ్యమైన నూతన చిత్రకళా జగత్తును సృష్టించి సుసంపన్నం చేశారు. అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, కోల్కతా వంటి నగరాల్లోనే కాక పారిస్, లండన్, టొరంటో వంటి అంతర్జాతీయ ప్రదర్శనల్లో కూడా రామారావు గారి చిత్రాలు ఎన్నో ప్రశంసలు, పురస్కారాలు పొందాయ్. ఇంతటి

ప్రతిభావంతుడు 28 ఏళ్ళ అతి చిన్న వయసులోనే గుంటూరు జిల్లాలో పర్యటిస్తూ మశూచి వ్యాధికి గురై 1925, ఫిబ్రవరి 6 న అకాల మరణం చెందారు. ఆయన హఠాత్ నిష్క్రమణ కళామతల్లికి ముఖ్యంగా, చిత్రకళా జగత్తుకు అనూహ్యమైన తీరని లోటు.

భారతీయ చింతనలో నవ్యాంధ్ర చిత్రకళా సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టిన దామెర్ల రామారావు మరణం మొత్తం యావత్ దేశాన్నే విస్మయపర్చింది. ఎంతోమంది మేధావులు కళాకారులు మౌనంగానే రోదించారు. ఆ బాధతోనే హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, "ఆయన మరణించలేదు, జాతి కోసం శాశ్వతమైన చిత్రకళా సంపదని సమకూర్చిన ఆయన ఎలా మరణిస్తారు? నిత్యం కొత్త కలల రాగాలాపన చేస్తూ, అంతరాత్మని అన్వేషణా కాంతులతో సుసంపన్నం చేసుకున్న వానికి మరణం అనేది ఉంటుందా?" అంటారు. రామారావు గారు చిత్రించిన సిద్ధార్థ రాగోదయం, పుష్పాలంకరణ, నంది పూజ, గోపికాకృష్ణ, బావివద్ద, అజంత, ఎల్లోరా, పట్టిసీమ, కృష్ణలీలలు, పెళ్ళికూతురు, డ్యాన్సర్, మెయిడ్స్ ఆఫ్ కట్టియావాడ్...వంటి అత్యద్భుత కళాఖండాల్ని ఎన్నింటి గురించి చెప్పుకున్నా తక్కువే. దేశవిదేశాల్లో ఎందరో కళాభిమానుల అకళంకిత అపూర్వ ప్రేమాభిమానాలను సంపాదించుకున్న అమూల్యమైన ఆయన చిత్రకళా సారస్వత సంపదకు ఏ కాలంలోనైనా విలువ కట్టడం అసాధ్యం. విశ్వకళా జగత్తులో అనితరుడైన చిత్రకారుడు దామెర్ల.

మూడుపదుల వయసైనా నిండకుండానే అమరుడై అశేష కళాభిమానుల విశేష ఆదరణ పొందిన గొప్ప సృజనశీలి దామెర్ల రామారావు గారి స్మృతిలో రాజమండ్రిలో చిత్రకళా మందిరాన్ని, శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1925 లోనే ఆ రెంటినీ సందర్శించిన మహాత్మా గాంధీజీ ఆ చిత్రాలని చూసి ముగ్ధులయ్యారు. తదనంతరం న్యాపతి సుబ్బారావు, దేశభక్త కాశీనాథుని నాగేశ్వరరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, విస్సా అప్పారావు, వరదా వెంకటరత్నం తదితరుల పూనికతో ' దామెర్ల రామారావు మెమోరియల్ ఆర్ట్ గ్యాలరీ & స్కూల్ ' రిజిస్టర్ అయ్యింది. తదనంతరం 1957 లో దుర్గాబాయి

దేశ్ముఖ్ గారు ప్రారంభించిన సొంత భవనంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆ సంస్థ ఉన్నతికి మాదేటి రాజాజీ వంటి వారు కూడా కృషి చేశారు. ప్రస్తుతం రాజమండ్రిలోని గోదావరి స్టేషన్ వద్ద ఉన్న ఈ ఆర్ట్ గ్యాలరీలో దామెర్ల రామారావు గారి 250 పెన్సిల్ రేఖా చిత్రాలు, 34 తైల వర్ణ చిత్రాలు, 129 జల వర్ణ చిత్రాలు ఇంకా అసంపూర్ణ చిత్రాలు ఉన్నాయి. ఇవిగాక సుమారు 26 చిత్రాల సంపుటాలు ఉన్నాయి. ఇవన్నీ తెలుగువారు సంరక్షించుకోవలసిన విశేషమైన కళా సంపదలే.

అప్పట్లో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం లో, అలాగే మద్రాసు, ఢిల్లీ లో రామారావు గారి చిత్రకళా ప్రదర్శనలు జరిగాయి. కానీ ప్రస్తుతం స్తబ్దంగా ఉన్న ఆర్ట్ గ్యాలరీ మరింత అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా నేటి తరాలకు దామెర్ల రామారావు గారి కృషి, గొప్పతనం తెలియ జేయాల్సిన అవసరం ఉంది. తెలుగు నేలలో పుట్టి, ఒక ఆంగ్లేయునికి సన్నిహితుడై, మహా రాష్ట్రలో చదివి, గుజరాత్, ఢిల్లీ, ఒరిస్సా వంటి ఎన్నో ప్రాంతాలు పర్యటించి, టాగోర్ మొదలు ఎందరో వంగ జిజ్ఞాసువుల మెప్పును పొంది, దేశ విదేశాలలో ఎన్నెన్నో అద్భుతమైన చిత్రకళాఖండాల్ని ప్రదర్శించి, చిత్రకళా శిక్షణా కేంద్రాన్ని స్థాపించి, జీవితాంతం కళ కోసమే తపించి గుంటూరు ప్రాంతంలో తిరుగుతూ, కళ కోసమే మరణించి తనని తాను కళా సాంస్కృతిక స్రవంతికి అంకితం చేసుకున్న అజరామర చిత్రకళా జిజ్ఞాసువు దామెర్ల. అనన్య సామాన్యమైన ఆయన కుంచె సంధించిన అద్వితీయమైన చిత్తరువుల సాక్షిగా, సన్మార్గం కోసం జీవితాన్ని మలచుకోవడమే ఎలాంటి కళకైనా అర్ధమని రామారావుగారు అందించిన ఉత్తమ ఉపదేశం. ఆ కాలాతీత జీవిత సత్యాన్ని గ్రహించి ముందుకు సాగడమే ఆయన జీవన గమనం నుండి మనం స్వీకరించాల్సిన సార్థక సందేశం.

(ఫిబ్రవరి 6 దామెర్ల రామారావు గారి శతవర్ధంతి.)

అచంచల అక్షర చైతన్యం - అన్నపూర్ణాదేవి !

తెలుగు సాహిత్య, సామాజిక, సాంస్కృతిక చరిత్రలో విశిష్టమైన మహిళ మాగంటి అన్నపూర్ణాదేవి. గాందేయవాదిగా, స్వాతంత్ర సమరశీలిగా, సాంఘిక సంస్కర్తగా,తొలితరం రచయిత్రిగా అన్నింటికీ మించి దార్శనికత కలిగిన ఆలోచనా శీలిగా గుర్తుంచు కోవలసిన స్త్రీ మూర్తి ఆమె. సరిగ్గా 125 ఏళ్ళ క్రితం మార్చి 10, 1900న ఏలూరు దగ్గర చాటపర్రు లో కలగర రామస్వామి, పిచ్చమ్మల ఏకైక

సంతానంగా జన్మించారు. బ్రహ్మ సమాజ వాతావరణంలో పెరిగారు. ఆ రోజుల్లోనే కలకత్తాలో ఉండి ఇంటర్మీడియట్ వరకూ చదివారు. బెంగాలీలో పాండిత్యం గడించడమే కాదు. బెంగాలీ సాహిత్యాన్ని కూడా లోతుగా మధించారు. ముఖ్యంగా దేశంలోనే విశేషమైన సాంస్కృతిక పునరుజ్జీవనం బెంగల్ లో కొనసాగుతోన్న సమయం లో అదామె పై వేసిన ముద్ర చిన్నది కాదు. వంగ సాహిత్యం తో పోల్చుకుని తెలుగులో అభ్యుదయ సాహిత్యం, ముఖ్యంగా బాల సాహిత్యం లేకపోవడం ఆమెకు గొప్పలోటుగా అనిపించేది. విద్యార్థిగా కలకత్తాలో అడుగు పెట్టిన అన్నపూర్ణాదేవి నిరవధిక అధ్యయన శీలిగా, అన్వేషణ వేత్తగా,రచయితగా, అనువాదకురాలిగా,ప్రచురణకర్తగా, ఉద్యమ కారినిగా ఎదిగారు.

అందుకే సీతారాముల గురించిన రంగురంగుల పుస్తకాన్ని 16 ఏళ్ళ వయసులో మొదటి సారిగా తెలుగులోకి అనువదించారు. తర్వాత శాంతి నికేతన్ ప్రధాన పండితుడు విధు శేఖర శాస్త్రీ గారి 'వివాహ మంగళం ' సరళాదేవి ' నవవర్ష స్వప్నం ' ' అరవిందుని లేఖలు ',రామకృష్ణ పరమ హంస ' లీలామృతం " మొదలైన గ్రంథాల్ని బెంగాలీ నుండి తెలుగులోకి అనువదించారు. అక్కడితో ఆగకుండా ' ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాల ' ద్వారా ప్రచురించారు. అంత చిన్న వయసులో బెంగాలీ సాహిత్యాన్ని బాల సాహిత్యం, ముఖ్యంగా అరవిందుని రచనలని తెలుగులో అనువదించిన వారు మరొకరు లేరు. ఆ రకంగా క్షేత్రస్థాయి సాహిత్య సాంస్కృతిక రంగంలో ఒక మహిళగా మాగంటి అన్నపూర్ణాదేవి గారు వేసిన తొలి అడుగు ఒక నవ్య శకానికి నాంది పలికింది. ఆమె అనువాద శైలిని చూసి ప్రముఖ అభ్యుదయవాది అబ్బూరి ఎంతగా ముగ్ధుడై య్యారంటే, తాను బెంగాలీ భాష నేర్చుకున్న రోజుల్లో ఆమె తర్జుమా చేసిన అరవిందుని లేఖలు తనపై ఎంతో ఉన్నతమైన ప్రభావం కలిగించాయని రాసుకున్నారు. గోదావరి జిల్లాలకి చెందిన ఒక సాధారణ బాలిక చదువుకోడానికి కలకత్తా వెళ్ళడమూ, వంగ దేశంలోని విశిష్టమైన సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించడమూ, ప్రచురించి ప్రచార వ్యాప్తి చేయడమూ నాటికే కాదు, నేటికీ కూడా అద్వితీయమైన విషయం.

1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సహాధ్యాయి, ప్రముఖ స్వాతంత్ర సమర

యోధుడు మాగంటి బాపినీడుతో ఆమెకు వివాహం బ్రహ్మనమాజం పద్ధతిలో,ఆదిపూడి సోమనాధ రావు వంటి సంస్కర్తల ఆశీస్సులతో జరిగింది. తర్వాత బాపినీడు గారు ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్ళారు. తర్వాత అన్నపూర్ణాదేవి కూడా వెళ్ళాల్సి ఉంది. అందుకోసం ఎన్నో విలువైన బట్టలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నది కూడా. ఇంతలో మహాత్మాగాంధీ జాతికి పిలుపిచ్చారు. దేశం మొత్తం స్వాతంత్రం కోసం పోరాడుతున్న ఆ సమయంలో స్వంత స్వార్థం చూసుకోవడం ఆమెకు మనస్కరించలేదు. అంతే, కొన్న ఎంతో విలువైన విదేశీ సిల్కు దుస్తులన్నింటినీ తగలబెట్టేసింది. స్వాతంత్ర సంగ్రామంలోకి దూకి అనేక గ్రామాలు తిరిగింది. పేదల ప్రధాన శత్రువు మద్యపానం అని గుర్తించి ఊరూరా మద్యపాన వ్యతిరేక ఉద్యమం చేసింది. ఖాదీ ప్రచారం చేస్తూ " మోహనుదాస్ పరిశ్రమాలయం " స్థాపించి నూలు వడుకుతూ తత్సంబంధిత దేశీయ కుటీర పరిశ్రమల్ని కూడా ప్రోత్సహించింది. గ్రంథ ముద్రణ ద్వారా వచ్చిన ఆ కొంత ఆదాయం తోనే హరిజనోద్ధారణకు ముందు నిలిచి, దళితుల్ని సమానంగా ఆదరించడం, ఒక బాలికను గాంధీ ఆశ్రమానికి కూడా పంపించడం తట్టుకోలేని ఆనాటి సమాజం మాగంటి అన్నపూర్ణాదేవిని సంఘ బహిష్కరణ చేసిందంటే సంఘసంస్కరణలో ఆమె ఏ స్థాయిలో పని చేసిందో అర్థమౌతుంది.

1921 మార్చి నెలాఖరులో బెజవాడలో సుమారు రెండు లక్షల పైచిలుకు మంది స్త్రీలతో జరిగిన మహాసభకు మహాత్మా గాంధీజీ విచ్చేసారు. అంత మందిలోనూ నూలు వస్త్రాలు ధరించి సమావేశానికి నేతృత్వం వహించిన ఏకైక స్త్రీగా అన్నపూర్ణా దేవి ఆచరణను చూసి ఆశ్చర్యపోయారు. ఆయన తేరుకొనే లోపే స్వాతంత్రోద్యమానికి తగిన విధంగా సహకారం అందించాలనే ఆయన పిలుపు మేరకు ఒక్క జత గాజులు, మంగళ సూత్రం మినహా ఒంటి మీదున్న నగలన్నింటినీ అక్కడికక్కడే తీసి ఉద్యమానికి ఇచ్చేసిన ఆమె తెగువకు నిశ్చేష్టులై నిలబడిపోయారు. అంత వరకూ దేశంలోని ఏ ప్రాంతం లోనూ ఏ మహిళా చేయని విధంగా స్వాతంత్ర నిధికి మొట్టమొదటిసారి స్త్రీకి ఆభరణాలు ప్రియమైనవనే భావనను పటాపంచలు చేస్తూ శరీరం మీది బంగారు వస్తువులన్నింటినీ అవలీలగా

దానం చేసిన ఆమె సాహసానికి అబ్బురంతో ' మీ తల్లి తండ్రులు మరేమీ అనరా ? ' అని అడిగారట. ' ఇలాంటి మంచిపనులు చేయడానికి నన్ను కాదనరు ' అని అనడమే కాక అనర్గళమైన ఇంగ్లీషులో మాట్లాడుతూ మహాత్ముడిని ఏలూరు ఆహ్వానించింది. అందుకాయన ఆనందంగా సమ్మతించి ఆ రోజు సాయంత్రం నుండి రాత్రి వరకు ఏలూరు వచ్చారు. అన్నపూర్ణా దేవి వ్యక్తిత్వానికి, ఆతిథ్యానికి అబ్బురపడి ఆమెని తన ఆశ్రమానికి సాదరంగా ఆహ్వానించారు. తర్వాత గాంధీజీతో అన్నపూర్ణాదేవి అనుబంధం మరింత బలపడింది.

ఇంతాచేసి ఆమె జీవించింది 27 ఏళ్ళు మాత్రమే. ఝాన్సి లక్ష్మిబాయి పేరిట కన్న కూతురుకి జన్మనిచ్చిన వారం రోజులకే అన్నపూర్ణాదేవి మార్చి 9, 1927న అనారోగ్యంతో అకాలంగా మరణించింది. దేశంలోని అసంఖ్యాక యువజనులతో పాటుగా విదేశంలో ఉన్న భర్తకి కూడా ఆమె మార్గ నిర్దేశనం చేసింది. కుల మతాతీత మానవీయ నేతగా బాపినీడు ఎదగటంలో తోడ్పడింది. స్వదేశానికి వచ్చిన ఆయన విదేశీ బట్టలు విప్పించి దహించివేసి ఖాదీ బట్టలు తొడిగి ఆహ్వానించింది. ఆమె స్ఫూర్తితోనే ఐదుసార్లు బాపినీడు జైలుకి వెళ్ళారు. ఆమె మరణానంతరం తనకి రాసిన లేఖల్ని ఉన్నవ లక్ష్మీ నారాయణ గారి మాటలతో "అన్నపూర్ణాదేవి లేఖలు " పేరిట ప్రచురించారు.తెలుగు లేఖా సాహిత్యంలో ఆ తరహా గ్రంథం అదే మొదటిది. " నన్ను మరిచినను దేశమును మరువరాదు, నేను స్థిరము కాదు." అన్న అన్నపూర్ణాదేవి, " మీరు నా మాట వింటే నేను మీ మాట వినేదను. ఒకరి మాట యొకరికి కలియకపోతే చిక్కులుండునని తెలిసి కొనుడు.ఆడవాళ్లే మగవారి మాట వినవలేనా?మగవాండ్రు ఆడవాండ్ర మాటలు విన కూడదా?"అని లేఖల్లో ఒకచోట ప్రశ్నించడం ఆమె స్వేచ్ఛా పిపాసకి ప్రతీక. అంతేకాదు, " దుష్ప్రవర్తన గల భాగ్య వంతుడగు వ్యక్తిని భర్తగా బడయుట కంటే సచ్చరిత్రుడగు దరిద్రుడునే పతిగా బడయుట మంచిది " అంటూ ధైర్యంగా వెళ్లడిస్తుందామె. నాటి పరిస్థితుల దృష్ట్యా ఈ లేఖలు ఎంతో ప్రాముఖ్యత కలవి.

1975లో మొదటిసారిగా యు.ఎన్.ఓ (ఐక్యరాజ్య సమితి) ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని స్త్రీల సమస్యల్ని చర్చించడానికి ఏర్పాటు చేసిన సమావేశం నుండి

అంత ర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభించారని ప్రతీతి. ఆ రకంగా ఈ ఏడాది మహిళా దినోత్సవానికి స్వర్ణోత్సవ సందర్భం (1975 – 2025). అనేక మంది దార్శనికత, ఎందరో శ్రమజీవుల త్యాగం వెరసి మహిళా దినోత్సవం ఏర్పడింది. ఇలాంటి విశిష్ట సందర్భంలో, మూడు పదులైనా నిండకుండానే మరణించిన మాగంటి అన్నపూర్ణాదేవిని తెలుగు జాతి స్త్రీ సాధికారతకు దిక్సూచిగా స్మరించుకోవడం సమాజ సాంస్కృతిక చైతన్యానికి కనీస అవసరం. ఆమె మరణవార్త విన్న మహాత్మా గాంధి సంతాప లేఖ రాస్తూ," ఒక శిష్యురాలినే కాదు, కన్న కూతురినే నేను కోల్పోయాను..." అంటూ దుఃఖించారు. ఒక రచయిత్రిగా, సాహితీవేత్తగా, స్వాతంత్ర సమర శీలిగా, అనువాదకురాలిగా, సాంస్కృతిక కార్యకర్తగా, ప్రజా సంఘాల నిర్మాణశీలిగ, గాంధేయవాదిగా అన్నింటికీ మించి స్వతంత్ర ఆలోచన కలిగిన స్త్రీ వాదిగా మాగంటి అన్నపూర్ణాదేవి అసాధారణ కృషిని గుర్తించి ఆ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమె త్యాగానికి మన తరం ఇవ్వదగ్గ అర్థవంతమైన కనీస నివాళి కాగలదు.

(మార్చి 10,అన్నపూర్ణాదేవి 125 వ జయంతి.)

మహానుభావుడు మానవల్లి రామకృష్ణకవి



"అర్ధ దశాబ్ది క్రితం కాన్పూర్ లో జరిగిన ఒక విద్వద్గోష్టి లో మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్, లాహోర్ ఓరియంటల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్ స్వరూప్ మున్నగు విద్వద్వరేన్యులు విచ్చేసారు. నేను ఇద్దరికీ పరిచితున్నె. ప్రసంగవస్సాత్తూ " రామకృష్ణ కవి గారిని ఎరుగుదురా? " అని ప్రశ్నించారు

రాహుల్ జీ. "ఎందుకు? " అన్నాను. " ఏమీ లేదు, ఆయన ఎంత ధన్యజీవి! ఆయన జీవితసార్థక్యానికి ఒక్క కుందమాల నాటకం చాలు.ఎంత మంచి నాటకం వెలుగుకు తెచ్చారు? అన్నారు రాహుల్ జీ. " మరి నాట్య శాస్త్రం సంగతో ?" అన్నారు లక్ష్మణ్ స్వరూప్ జీ, " ఆయన జీవితాన్ని ధన్యం చేయ డానికి !" అన్నారు మరొకరు. నాకు మాట పెగల్లేదు. గుండె గొంతుకలో కొట్టుకులాడింది. నేను అప్పుడు అనుభవించింది మానుషానందం కాదు. ఉపనిషత్తులు ఉద్ఘోషించిన అతి మానుషానందభూతి అది! అతి కష్టంతో గద్గద కంఠంతో అన్నాను, " కవిగారు నాకు చాలా పరిచితులు. ఆయన దగ్గర పనిచేసే భాగ్యం నాకు కలిగింది. " అని. అక్కడి వారందరి చూపుల్లో కవిగారిని దర్శించినంత సంతోషం తెలిపే రాగరేఖ ఒక్కసారిగా మెరిసింది...."

మహామహోపాధ్యాయ తిరుమల రామచంద్ర గారు తన జీవిత చరిత్ర " హంపి నుండి హరప్పా దాకా " లో రామకృష్ణ కవిగారిని గురించి రాసిన భాగంలో ప్రారంభ వాక్యాలివి.ఎక్కడి కాన్పూరు? ఎప్పటి సమావేశం అది? మహామహులు పాల్గొన్న ఆ సందర్భంలో ఏకంగా రాహుల్ జీ వంటి వారిచేతనే ధన్యజీవి అంటూ కొనియాడ బడిన అరుదైన ఆ తెలుగుపండితులు ఎవరూ..? ఎవరీ రామకృష్ణ కవి?"అందరి కంటే నెక్కువుగా నాకు చిరకాల మిత్రులు, ఆంధ్రభాషా వాంగ్మాయం నందు విశేష కృషి చేసిన వారును, దేశాటనము చేసి అపూర్వ పుస్తక సంపాదనము చేసిన వారును శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారు..." అని కందు కూరి వీరేశలింగం గారు ఆంధ్ర కవుల చరిత్రములో ప్రస్తావించిన మహానుభావులు. "సాహిత్య ప్రపంచములో మా బోంట్లు తిన్నగా కన్నులు తెరవక పూర్వమే రామకృష్ణ కవి గారు ప్రాచీన ప్రభంధ ములను ప్రకటించిరి" అని వేటూరి ప్రభాకర శాస్త్రి గారి చేత కీర్తించబడిన మహావ్యక్తి రామకృష్ణ కవి. బాలాంత్రపు రజనీకాంతరావు గారు సైతం తన "ఆత్మకథా విభావరి" లో రామకృష్ణ కవి గారిని గురించి రెండు అధ్యాయాలు కేటాయించారు. ముందు తరాల పై మహాను భావుల ప్రభావం అలాగే ఉంటుందేమో.

అందుకే, యాభై ఏళ్ళ క్రితం సాహిత్య అకాడమీ 555 పుటల్లో ప్రచురించిన

మానవల్లి రామకృష్ణకవి రచనల సంపుటికి రాసిన ముందుమాటలో, " ఆంధ్ర భాషలో సాహిత్య విమర్శకు బిక్షపెట్టిన వారు వీరేనని చెప్పిన అతిశయోక్తి కాజాలదు.." అన్న దేవులపల్లి రామానుజరావుగారు, "వాంగ్మాయ పరిశోధనకై చేసిన తపస్సు కవిగారి జీవితము." అంటారు. అంతేకాదు "Amongst these individuals there is one at this moment who stands like a light house, this is Mr. Ramakrishna Kavi M.A. of Rajahmundry. His resources are not income of a state, but of heart. He is a lord of poverty, a teacher in secondary school..." అంటూ రామకృష్ణ కవి గారిని గురించి Modern Review పత్రికలో వ్యాసం రాసిన కె. పి. జైస్వాల్, "Mr. Ramakrishna Kavi is himself a discovery. His knowledge of Sanskrit sahitya is of the rare traditional type (i.e) unlimited and at the same time it is critical. His patriotism for that literature has probably no equal" అన్నారంటే రామకృష్ణ కవి గారి అసాధారణ ప్రతిభ ఎంతటిదో అర్థమౌతుంది.

చెన్నైలోని నున్గంబక్కంలో 1866 లో పండిత వంశంలో జన్మించిన మానవల్లి రామకృష్ణకవి కళాశాల విద్య అక్కడే చదివారు. ఆరుకి పై బడిన భాషల్లో అనర్గళమైన పాండిత్యం కలిగిన 16 ఏళ్ళ వయసులో ' మృగవతి " అనే కవిత రాయడం వల్ల ఆయన్ని అంతా గౌరవంగా " కవి గారు " అని పిలిచేవారట. ఐతే భరత నాట్యంలో పి. హెచ్. డి. చేసిన తమిళనాడు చిదంబరానికి చెందిన శ్రీమతి శశికళ గారు 2023 లో జాతీయ హిందీ మరియు సంస్కృత పరిశోధన పత్రికకు రాసిన వ్యాసంలో కవిగారు మార్చ్ 20, 1875 న జన్మించారని రాశారు. ఆ రకంగా చూస్తే ఇదాయనకు 150వ జయంతి. కాదూ మామూలు లెక్కప్రకారం చూసినా 160 వది. ఏదేమైనా తెలుగు సారస్వత సాంస్కృతిక కళా చరిత్రలో రామకృష్ణ మహాకవి గారిని స్మరించుకోవలసిన సందర్భం. అవడానికి సంప్రదాయవాదని అంటారు కానీ ఆయన చేసిన మహత్కార్యాలు జాతి ఉన్నతికోసమేనని నా అభిప్రాయం. వనపర్తి సంస్థానంలో కొన్నాళ్ళు పనిచేసిన రామకృష్ణ కవి గారు తదనంతరం ప్రాచ్యలిఖిత భాండాగారములో ప్రాచీన తాళపత్ర

గ్రంథాల అన్వేషణ లో అగ్రభాగాన నిలిచారు. విస్మృత కవులు రచన చేసిన రామకృష్ణ కవి శిథిల స్థితిలో నున్న ఎన్నో విలువైన గ్రంథాల్ని సేకరించి భద్ర పరిచారు.

వేంకటేశ్వరా ప్రాచ్య పరిశోధనా సంస్థలో, విద్యా శాఖాధికారిగా రాజమండ్రిలో ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు. సూద్రకుని వత్సరాజ చరిత్రను నవలగా రాశారు. నన్నెచోడుడి కుమార సంభవాన్నీ పరిష్కరించి ప్రకటించి నన్నెచోడుడు నన్నయ కంటే ముందు వాడని కవి గారు చేసిన ప్రతిపాదన పండిత లోకంలో ఒక సంచలనం. తర్వాతి కాలంలో కుమార సంభవం మొట్ట మొదటి తెలుగు గ్రంథంగా వినుకెక్కింది. మెకంజీ కైఫీయత్తుల్ని తెనిగీ కరించారు. క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, ప్రభంద మణిభూషణం, పరతత్వ రసాయనం, అనర్గ రాఘవం, త్రిపురాంత కోదాహరణం, శ్రీరంగ మహత్యం, సకాలనీతి సమ్మతం వంటి గ్రంథాలను సేకరించి విశ్లేషణాత్మక పీఠికలతో ప్రకటించారు. వైజయంతి, భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రిక, సరస్వతి మొదలైన పత్రికలలో అనేక విలువైన వ్యాసాలు రాశారు. వాల్మీకి చరిత్రనూ, తరిగొండ వెంగమాంబ, గణపవరపు వెంకటకవి, సోమనాథ సోమయాజి, కస్తూరి భట్టరాజు, చింతపల్లి కవుల్ని వెలుగులోనికి తీసుకొచ్చింది మానవల్లి వారే. తెలంగానమంతా పర్యటించి ' లిథిక్ రికార్డ్స్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్ ' అనే శాసనాల సంపుటిత గ్రంథాన్ని ప్రతిబింబాలతో పాటుప్రకటించారు. ఇన్నింటిలోకీ యావత్ తెలుగు జాతి ఆయనకు ఋణపడి తీరాల్సిన మహోన్నత కార్యం, మహానుభావుడు అన్నమయ్యను వెలికి తీసిన మహత్కార్యం. అదొక్కటి చాలు ఆయన్ని తెలుగు జాతి సారస్వత సమున్నతునిగా గుర్తించడానికి.

'ఐర్లాండ్ రిపబ్లిక్ డబ్లిన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్అడ్వాన్స్డ్ స్టడీస్' లో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేసిన 'మెయిల్స్ డిల్లోన్' తాను పారిస్లో విద్యార్థిగా ఉన్నప్పుడు తన అభిమాన టీచర్ 'సిల్వెన్ లేవి' తనకి మొట్టమొదిసారిగా, రామకృష్ణ మహాకవి గారినే పరిచయం చేశారనీ,ప్రాచీన సంస్కృత సాహిత్యంలో ఎన్నో సందేహాలను కవిగారు నివృత్తి చేశారనీ అంటారు. మానవల్లి వారు సంస్కృతంలోని ఏక నటాత్మక

నలుగురు ప్రాచీన కవులు రాసిన చతుర్భాణిని 1922 లో పరిష్కరించి ఇవ్వగా పాట్నాలోని ఒక ప్రచురణ సంస్థ వారు ముద్రించారనీ దానిని తాను డార్జిలింగ్ వద్దగల కుర్సియాంగ్ రేడియో స్టేషన్ కి డైరెక్టర్ గా ఉన్న ప్పుడు 1967 – 1968 సంవత్సరాలలో తెలుగులోకి అనువదించాననీ ప్రత్యేకంగా ఒక అధ్యాయమే కేటాయించి వెల్లడించారు బాలాంత్రపు రజనీకాంతరావు గారు. ఇంతటి మహానుభావుడూ తన చివరి దశలో చెప్పరాని ఆర్థిక సమస్యలతో ఈతి బాధలు అనుభవించారు. కొడుకులిద్దరూ కలిసి రాలేదు. ప్రభుత్వం గుర్తించి ఎంతో కొంత గౌరవ భృతి ఏర్పాటు చేసింది. తుదకు తిరుపతి వీధుల్లో తిరుగుతూ బిచ్చ మెత్తుకుంటున్న రామకృష్ణ మహాకవి గారిని అక్కడి రిక్షా వాళ్ళు చేర దీయగా ఒక హోటలు వారు దయతలచి భోజనం పెట్టే వారట. అలాంటి దుర్భర పరిస్థితుల్లో తన 91 ఏట 20-09-1957 న ఆయన తిరుపతిలో మరణించారు. రామచంద్ర గారి ప్రకారం కవి గారు చనిపోయింది 21 వ తేది.

ప్రాచీన గ్రంథాల అన్వేషణలో నేపాల్, బరోడా, బికనీర్, ట్రావెంకోర్,లాహోర్, జోధ్పూర్, కేరళ, కలకత్తా...ఇలా నలు చెరుగులా తిరిగిన మరోతెలుగు కవి కానీ,పరిశోధకుడు కానీ ఆనాటికి, ఈనాటికీ కూడా ఎవరూ లేరు. మారుమూల గ్రామాల్లో సంప్రదాయ పండితులు ఇవ్వడానికి నిరాకరించిన గ్రంథాల్ని ఊరికే చూసి ఇస్తానని తీసుకుని మొత్తం గ్రంథాన్ని మనసులో పెట్టుకుని తిరిగి వచ్చాక వాటిని పొల్లు పోకుండా నకలు చేసేవారట కవిగారు. అందుకేనేమో తిరుమల రామచంద్ర, "ఆయన ధారణశక్తి శక్తిస్వరూపిణి. ఆయన మెదడొక పావురాల గూడు. అవసరమైన శ్లోకాలు ఆ అరల నుంచి కర్బుర కాంతుల కపోతాలలాగ వెలుపలికి వచ్చేవి.."అంటారు. ఒకనాడు దేశం యావత్తు స్మరించిన మానవల్లి రామకృష్ణ కవి గారు ఈరోజు తెలుగుజాతి కి సైతం అపరిచితుడు. నిత్యం అన్నమాచర్యుల కీర్తనలతో మారుమోగే ఏ ఇంట్లోనూ, కనీసం ఆ వేంకటేశ్వరుని సన్నిధి పరిసరాలలో కూడా అసలాయన కోసం తెలిసిన వారు లేరు. ఆంధ్రాంగ్ల సంస్కృత సాహిత్యంలో మౌలిక పరిశోధనకు నేతృత్వం వహించిన మానవల్లి రామకృష్ణకవి పేరు కూడా బహుశా ఈనాటి సాహిత్య విద్యార్థులకు, పరిశోధకులకు

తెలీకపోవచ్చు. ఇక పాలకులకు, ప్రభుత్వాలకు ఆయన్ని పట్టించుకునే తీరిక ఎలాగూ లేదు. నిజంగా మానవల్లి వారి పేరుతో పురస్కారం ఏర్పాటు చేస్తే విశేషమైన పరిశోధన చేసే వారికి ప్రోత్సాహంగా వుంటుంది. అలాగే ఆయన సమగ్ర జీవితం, రచనలని సేకరించి నేటి తరాలకు స్ఫూర్తిని అందించేలా ప్రచురించే భాద్యత ప్రభుత్వం చేపట్టాలి.మహామహులు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు మొదలుకుని, మహోపాధ్యాయ తిరుమల రామచంద్ర గారి వరకూ ఎందరో విజ్ఞాన జిజ్ఞాసువులకు మార్గదర్శకులుగా నిలిచిన రామకృష్ణ కవి గారి విస్మృత జీవితాన్ని వెలుగులోనికి తీసుకురావడమే ఆయనకు మనతరం ఇవ్వదగ్గ కనీస సార్థక నివాళి.

జనహృదయాధీశుడు



"I see no sense in the children being seperated from their countrymen and in their having no manner of education in their language. India is not a barbaric country; it has schools and colleges, some of which are as good as the best of them in England" తొంబై ఏళ్ల క్రితం సంగతి. విజయనగర సంస్థాన అధిపతి మహారాజా అలక్ నారాయణ్ జమీందారీ వ్యవహారాల్ని నిర్వహించడంలో అసమర్థులనీ కాన ఆయన్ని జమిందారుగా తప్పించి వారి పిల్లల్ని

ఇంగ్లండ్లోని యూనివర్సిటీ కి పంపించాలనేది ప్రభుత్వ నిర్ణయం. దానిని సవాలు చేస్తూ న్యాయ స్థానంలో న్యాయమూర్తి ఎదుట స్వయంగా వాదించిన మహారాజా అలక్ నారాయణ్ ఎందుకు తన పిల్లల్ని ఈ దేశంలోనే ఉంచాలో చెబుతూ చేసిన వాదనలే పై వాక్యాలు. " పిల్లల్ని స్వదేశస్తుల నుండీ, వాళ్ళ స్వభాష నుండి వేరు చేయడం అర్థం లేనిది"అంటూ, " భారతదేశం అనాగరికం కాదు ఆ మాట కొస్తే మీ ఇంగ్లండుతో పోటీ పడగల విద్యా సంస్థలు ఇక్కడున్నాయి." అంటారు. సుమారు శతాబ్దం క్రితం ఇంకా స్వాతంత్రం కూడా రాని కాలం లో రెండు సొంత విమానాలు, వాటి కోసం విమానాశ్రమం, అంతులేననీన్నీ ఆస్తి పాస్తులు, ప్రపంచవ్యాప్తంగా పలుకుబడి, హోదా ఉన్న ఒక యువరాజు నోటి వెంట సాక్షాత్తూ బహిరంగ న్యాయస్థానంలో వొచ్చిన మాటలివి.ఇక న్యాయమూర్తి సంస్థానానికి అనుకూలంగా తీర్పు ఇవ్వక తప్పలేదు.

ఆ ఒక్క తీర్పే విజయనగర సంస్థానానికి చెందిన ఆఖరి మహారాజు గా పి. వి. జి. రాజు గారిని ఈ దేశపు విలక్షణ దార్శనికుడిగా మల్చగలిగింది. The Last Maharaja Of Vizianagaram. చిట్టచివరి విజయనగర సంస్థానాధిపతి గురించి మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ గతేడాది ఏప్రిల్లో ప్రచురించిన విలువైన గ్రంథం ఇది. "దేశమును ప్రేమించు మన్నా, మంచియన్నది పెంచుమన్నా దేశమంటే మట్టి కాదోయి, దేశమంటే మనుషులోయ్." అన్న మహానుభావుడు గురజాడ అప్పారావు గారి వాక్యాలతో గ్రంథం ప్రారంభం అవుతుంది. అశోక్ గజపతి రాజు గారి ముందుమాటతో 80 పైబడ్డ అరుదైన ఫోటోలు, ఛాయా చిత్రాలతో కలిసి చదివించే చారిత్రక కథనం. సిసోడియా రాజవంశం మూలలు కలిగిన విజయ నగర పూసపాటి సంస్థానం దేశంలోనే విస్తృతమైన సామాజికార్థిక, రాజకీయ చైతన్యం కలిగిన కుటుంబం. స్వాతంత్ర్యానికి పూర్వం స్పష్టమైన బ్రిటిష్ వ్యతిరేక వైఖరితో ఎన్నికలలో పోటీ చేసి ఏకంగా 56, 000 మెజార్టీ సాధించిన ఘనత సంస్థానానిది. సర్వేపల్లి రాధాకృష్ణ మొదలుకుని సర్ సివి రామన్ వరకూ,మహా జ్ఞాని మాక్స్ ముల్లర్ నుండీ మహా వైజ్ఞానికుడు ఐన్స్టీన్ వరకూ సంస్థానం తలవని, కలవని ప్రజాపక్ష బుద్ధిజీవులు ఒక్కరు కూడా లేరు. జస్టిస్ పార్టీ నుండి కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్ట్ ఇతరేతర అన్ని రాజకీయ

పార్టీలు, వాటి సిద్ధాంతాలతో లోతైన అవగాహన కలిగిన రాజ కుటుంబం.

" దక్షిణాది బనారస్" పేరు గాంచిన విజయ నగరంలో మొదట అడుగు పెట్టిన వ్యక్తిగా చెప్పబడే సూఫీ సాధువు, హజరత్సయ్యద్ ధన్కేశ వలీ బాబా విజయ నగర కోట కోసం స్థలం సూచించడం గమనార్హం. శతాబ్దాల చరిత్ర కలిగిన రాజ కుటుంబానికి సంబంధించిన నిర్మాణానికి ఒక ముస్లిం సూఫీ సాధువు మార్గదర్శకుడు కావడం అరుదైన విషయం. మరే రాజ ప్రాసాదానికి ఇటువంటి చరిత్ర ఉందేమో తెలీదు కానీ ఒకరకంగా బలీయమైన మత సామరస్యానికిది ప్రతీక. ఇప్పటికీ ఆయన దర్గా కోట వద్ద ఉంది. పివిజి రాజు గారిది విశ్వజనీన మతం. మూస భావాలకి అది వ్యతిరేకం. అందుకే ప్రజలు అందరి కోసం కోటలో ఒక మాసోనిక్ ఆరాధనాలయం కూడా నిర్మించారు. బుర్రకథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు గారి నుండి ఎలెక్ట్రానిక్ కార్పొరేషన్ అధినేత అయ్యగారి సాంబశివరావు వరకూ రాజావారి ఉదారత్వంతో వికసించిన కుసుమాలు చాలానే ఉన్నాయి. ఇక ఆయన చేసిన విద్యా సాంస్కృతిక సేవా కార్యక్రమాల వివరాలు, సమాజోద్ధరణ వితరణ దానధర్మాల చిట్టా విప్పితే అది మరో మహాగ్రంథం అవుతుంది. రాణి ఎలిజబెత్, ఫిలిప్ యువరాజు మొదలు విజయనగర సంస్థానం ఆతిధ్యం పొందని మహామహులు ప్రపంచంలో ఎవరూ లేరు.

ఒకసారి జపాన్ లో జరిగిన ఏదో కార్యక్రమానికి వెళ్ళిన షహనాయి విద్వాంసుడు బిస్మిల్లాఖాన్ ను విజయనగరం నుండి వచ్చిన ప్రముఖుడు పలకరించగా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా ఆ సంస్థానం లోని ఆతిథ్యాన్ని తల్చుకుని మురిసిపోయాడట. స్వామి జ్ఞానానంద నుండి అరవిందులు, జిడ్డు కృష్ణమూర్తి తదితర ఆధ్యాత్మిక సామ్యవాదులతో ప్రభావితం అయిన పి వి జి రాజు గారు చివరి వరకూ ప్రజా నేతగానే వెలిగారు. పార్టీలతో సంబంధం లేకుండా సగటు మనిషి పక్షానే నిలిచారు. ఎంత ఎత్తుకి ఎదిగినా ఒద్దికగా ఒదిగే జీవించారు. అట్టడుగు వర్గాల కోసం తాను చేయగలిగినంతా నిష్కామ కర్మగా చేశారు. విద్యార్థి దశలో కాలిఫోర్నియా లోని ఒక రెస్టారెంట్ లో కూడా కొంత కాలం పని చేయడం ఒక యువరాజు జీవితంలో ఊహించలేం. ఇలాంటి నమ్మశక్యం కాని అనేక ఘటనలు రాజు గారి జీవితంలో అనేకం. అందుకే ఆయన అనేక హృదయాల్ని

ఏలిన రాజు. ఆయన డైరీల ఆధారంగా రూపొందించిన ఈ గ్రంథం ఒక మంచి ప్రయత్నం. స్వయంగా ఆయనే స్వీయచరిత్ర రాసి ఉంటే ఇంకెంత గొప్పగా ఉండేదో అనే ఆశ మాత్రం పాఠకుడికి కలుగుతుంది. 1924 పి వి జి రాజు గారి శతజయంతి సంవత్సరం. నేటికి 30 ఏళ్ల క్రితం 1995 లో ఆయన మరణించారు.

పంజాబ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆయన్ని కొన్నాళ్ళు ప్రజా జీవితానికి దూరం చేసింది. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగవ్వ గానే మళ్ళీ తన జనాలతోనే గడిపారు. జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా వంటి సోషలిస్టు నాయకులతో పి వి జి రాజుగారికి ఉన్న అనుబంధం అసాధారణమైంది. సమానతను క్రియాశీలంగా పాటించిన రాజవంశీయులు, జమీందారులు అరుదు. సోషలిస్ట్ పార్టీ సమావేశాలు జరిగినప్పుడు చోటా మోటా నాయకులు సైతం ఖరీదైన హోటల్ గదుల్లో ఉండేవారట. కానీ, పి వి జి రాజు గారు మాత్రం పార్టీ ఆఫీస్ లో నేల మీద ఒక చాప పరచుకుని హాయిగా నిద్రపోవడం చూసి అనేకమంది విస్తుపోయే వారని సీనియర్ సోషలిస్టు నేత రావెల సోమయ్య గారు స్వయంగా ఇంటర్వ్యూ లో చెప్పినట్టు తెల్సుకుని నివ్వెరపోతాం. ఉన్నత విద్యావంతుడు, మేధావి, విస్తృత యాత్రికుడు, స్వాతంత్ర ఆలోచనాశీలి, స్వేచ్ఛా ప్రియుడు, సంఘ సంస్కర్త, అన్నిటికీ మించి అసంఖ్యాక ప్రజల ఆకాంక్షలకు నిలువెత్తు రూపంగా తిరుగాడిన పి వి జి రాజు గారి అకాల మరణం ప్రజలకి తీరని లోటు. ఆయన మరణ వార్త విని సుమారు రెండు లక్షల మంది ప్రజానీకం స్వచ్ఛందంగా సుదూర ప్రాంతాల నుండి తరలి వచ్చారంటే ప్రజల హృదయాల్లో ఆయనకి ఉన్న విశిష్ట స్థానం అర్థమౌతుంది. రాజ్యాలేలే రాజులు అనేకమంది ఉండొచ్చు. కానీ, జన హృదయాల్లో నిలిచే రాజులు అరుదుగా మాత్రమే ఉంటారు. అందులో పివిజి రాజు గారొకరు. ఆయన నమ్మిన విలువల్ని కాపాడుకోవడము, కొనసాగించడమే బహుశా తెలుగు జాతి ఆయనకిచ్చే ఆత్మీయ నివాళి.

(పి వి జి రాజు గారి శత జయంతి సందర్భంగా,
MANSAS ప్రచురించిన అరుదైన గ్రంథం గురించిన చిరు పరిచయం.)

విస్మృత జీవన ఋషి

తెలుగు నేల మీద లింగ వివక్షకు వ్యతిరేకంగా ఏకవ్యక్తి సైన్యంగా యుద్ధం చేసిన తాత్వికుడు చలం. ఆయన భావాలతోనూ, వ్యక్తిగత జీవితంతోనూ భిన్నాభిప్రాయాలు ఎన్నున్నా స్త్రీ పురుష సమానత్వం కోసం చలం చేసిన అసాధారణ కృషిని మరువలేం. ఆనాటి వరకు సాహిత్యం మూసలో సాగుతున్న పురుషాధిక్య ధోరణిని చీల్చిచెండాడిన అక్షర యోధుడు చలం. ఈనాటికి కూడా నిత్యం మహిళల పై అత్యాచారాలు, హత్యలు, కొనసాగుతున్న క్రమంలో

మూఢత్వంతో నిండిన బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలానికి భిన్నంగా ఎదురొడ్డి నిలిచిన కలం వీరుడుగా చలాన్ని స్మరించు కోవడం అవసరం. చలం కేవల భావావేశ రచయిత కాదు. అసాధారణ భావోద్యమ కారుడు. తెలుగు సమాజంలో కుళ్ళిపోయిన ఛాందసత్వాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించడానికి నడుం కట్టిన సాంఘిక విప్లవకారుడు. నిత్యం సగటు మనిషిని పీల్చి పిప్పి చేస్తున్న అనేక దురాచారాలను నిష్కర్షగా నిలబెట్టి తన అక్షర జ్వాలలతోనే నిలువునా తగలబెట్టిన దార్శనికుడు చలం. అందుకనే "తెలుగు వెలుగు చలం " అంటూ ఏకంగా బృహత్ గ్రంథాన్నే రాసిన పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు, "జీవితాన్ని జీవితంగా మొట్టమొదట తెలుగువాళ్ళకి చూపించిన తెలుగు కథకుడు చలం "అంటారు.

"తెల్లారి లేస్తే పప్పు, పిడకలు, మళ్ళు,చీదరలు, అలుకులు, అధికారాలు, మూలుగులు, ముసుకులు, ఇవన్నీ వొదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనోవ్యవధి, సంతోషం, ఉత్సాహం ఎప్పుడు కలుగుతుంది మానవులకు ?" ఇలా ఒక జీవితకాలపు ప్రశ్నని వేయగల రచయిత నాటికి నేటికీ చలం ఒక్కడే. గమ్మత్తు ఏమిటంటే అలా రాసిందాన్ని తిరిగి విమర్శించుకున్నది కూడా మళ్ళీ ఆయనే. మనుషుల్లోని కుళ్ళుని, కుతంత్రాలను, ద్వేషాన్ని, హిపోక్రిసీనీ తులనాడి జీవితమంటే మనిషి మహాన్వేషణా మహోత్సవమని ప్రకటించడమే కాక, అలా తాను నమ్మినదాన్ని లోకంతో సంబంధం లేకుండా గుండె ధైర్యంతో పాటించి చూపించిన మొనగాడు చలం ఒక్కడే. అందుకే "People would rather die - than not think" అన్నాడు. చరిత్రలో ఎంతటి తాత్వికుడు కూడా సాహసించి అనని వాక్కులవి.అటువంటి మహా రచయిత 1925లో రాసిన అద్భుతమైన విశిష్ట రచన "Man and Woman (Excluding The Aspect Of Love). సరిగ్గా వందేళ్ల క్రితం మదనపల్లె నుండి ఒక మహిళ సంస్థ ప్రచురించిన ఈ చిన్ని పుస్తకమే తర్వాత కాలంలో తెలుగులో సంచలనాత్మక గ్రంథం ' స్త్రీ ' గా విస్తరించి చలంగారు రాశారు. 20 పుటలు కూడా లేని ఈ పొత్తం వేరే ఏ దేశంలో అయినా ప్రచురించి ఉంటే ఆ వ్యక్తిని నెత్తిన పెట్టుకునేది. దురదృష్టవశాత్తూ, " కవిత్వం లోనూ, జీవితం లోనూ economy of words and thoughts లేకపోవడం దేశభక్తి కన్నా హీనమైన

పాపం, ఆత్మలోకంలో దివాళా..” అని ధంకా బజాయించి చాటిన చలం మన దేశంలో అందునా తెలుగులో మాత్రం సంచలనాత్మక వ్యక్తిగానో, స్త్రీవాద రచయిత గానో మాత్రమే మిగిలిపోయాడు.

చలం స్త్రీ అనగానే, అదేదో స్త్రీల కి మాత్రమే పరిమితం చేసి రాసిన రచన కాదు. సాంఘికార్థిక రాజకీయ లైంగిక, ఆరోగ్య సాంస్కృతిక అంశాలు అన్నింటిని లోతుగా పరిశీలించి చేసిన విశ్లేషణాత్మక శోధనే చలం స్త్రీ. స్త్రీ పురుషులు కోసమనే కాదు, పిల్లల కోసం కూడా మనసులో చలానికి ఉన్న తపన మనకి ఇందులో కనిపిస్తుంది. ఈనాటికి అందులో విషయాలు ఎంతో అపురూపంగా అనిపిస్తాయి. ఒక ఆసక్తికర విషయాన్ని ప్రస్తావించాలి. 1925 లో ప్రపంచ మేధావి బెర్ట్రాండ్ రస్సెల్ “ వాట్ ఐ బిలీవ్ ?” అనే చిన్న పుస్తకం ప్రచురించాడు. స్త్రీ పురుష సంబంధాలు మొదలుకుని మనిషి నైతిక ప్రమాణాలు, సాంఘిక కార్యాచరణ మరెన్నో విషయాల్ని అందులో చర్చించాడు. ఆ రచనకి విశేషమైన ఆదరణ లభించడమే కాక రస్సెల్ ని జగత్ప్రఖ్యాత మేధావిగా లోకం కీర్తించింది. ఇక, అదే ఏడాది చలం సూటిగా స్పష్టంగా రాసిన “ స్త్రీ “ పుస్తకం సంగతి మాత్రం కొద్దో గొప్పో చలం సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి మినహా, వేరేవరికి సరిగా తెలీను కూడా తెలియదు. అంతకంటే విచారించాల్సిన విషయం, “ స్త్రీ” రచనకి మూలమైన, చలం ఏకైక ఆంగ్ల రచన “మ్యాన్ & వుమెన్ “ ఐతే, వచ్చిన 90 ఏళ్ళకి అంటే, 2014 లో పిఠాపురానికి చెందిన “ ప్రకృతి ప్రచురణలు “ తెలుగులోకి అనువదించి ప్రచురించే వరకు అసలు అలాటి రచన చలం చేశారనే చాలా మందికి తెలీదు. తెలుగు వెలుగుగా భాసించి పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన చలం రచనలు ఆధునిక సమాజం అనుకుంటున్న నేటి కాలంలో కూడా ఇంకా చాలా మందికి నిషేధాలే. అటు సంప్రదాయ వాదులు, ఇటు ఆధునికులు, ఒకవైపు పాలకులు, మరోవైపు మేధావులు కల్సిగట్టుగా ఉమ్మడిగా మౌనం పాటించినా, రోజురోజుకి చలం రాతలకు లోకం దాసోహమంటోంది. ఎందుకంటే, లోకంలో జరుగుతున్న నేరాలకి, ఘోరాలకి ఎన్నింటికో సమాధానాలు, పరిష్కారాలు చలమే చెప్పగలడు, చూపగలడు కాబట్టి.

ఐతే, ప్రత్యేకంగా చలం ' స్త్రీ " రచనను ప్రస్తావించడానికి కారణం, వందేళ్ల క్రితం రాసిన ఈ పుస్తకం నిర్లక్ష్యానికి గురై విస్మరించబడటమే. ఒక రకంగా చలం యొక్క మొత్తం సారాన్ని ఇమిడ్చిన ఈ రచనను తెలుగు సమాజం, ముఖ్యంగా ప్రగతిశీల కూటమి ఒక చారిత్రక పత్రంగా గుర్తించడంలో ఎందుకు విఫలం అయ్యారనేదే ప్రశ్న. చలం అభిప్రాయాలతోనూ, ఆయన వ్యక్తిగత వ్యవహారలతోనూ ఎవరికైనా ఎన్నో విభేదాలు ఉండవచ్చు. కానీ, వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఎన్నడూ భాగం కాని స్త్రీ స్వేచ్ఛని, స్త్రీ పురుష సమానతని, అమలిన శృంగార భావనను, జీవన సౌందర్యాన్ని, ప్రకృతి పారవశ్యాన్ని అన్నిటికీ మించిన మహోన్నత మానవతావాదాన్నే తన మార్గంగా అమలు చేసిన చలాన్ని కనీసం అర్థం చేసుకోవడంలో కూడా అన్యాయమైన వైఖరిని అవలంభించడం దారుణం. ప్రతీ భారతీయ భాషలోకి తర్జుమా చేయాల్సిన చలం ' స్త్రీ ' ఈనాటికి కూడా ఎవరో కొద్దిమందికి తప్పా తెలుగువారికి తెలియక పోవడం మన వెనుకబాటు తనానికి నిదర్శనం. కులమతాల కుళ్ళుని, వాదాల గోడలను పూర్తిగా నిరాకరించిన చలం చివరికి ఎవరివాడూ కాకుండా మిగిలిపోయాడు. చలాన్ని మర్చిపోతే అది సమాజానికి నష్టం కానీ చలానికి కాదు. ఎందుకంటే తెలుగులో చలం పురోగామి చైతన్యానికి చిహ్నం. ఆ చైతన్యం లోపించిన ఏ సమాజంలో అయినా పురోగతి శూన్యం. దురదృష్టవశాత్తూ తెలుగు జాతి చలాన్ని కోల్పోయింది. అందుకనే నేటికీ ఆయనంటే అన్ని వర్గాల మగాళ్ళకి కడుపుమంట. స్త్రీ పక్షాన స్త్రీ గా, బిడ్డల పక్షాన పసిబిడ్డగా జీవించిన భావుకుడు తెలుగులో చలం మాత్రమే. అందుకనే ఎవరు ఏమనుకున్నా నేటికి 75 సంవత్సరాల క్రితం, 1950లోనే చలం అరుణాచలం బాట పట్టారు. అక్కడే రమణాశ్రమంలో మూడు దశాబ్దాలు గడిపారు.బాలాంత్రపు రజనీకాంతరావు గారు చలాన్ని చేసిన చివరి ఇంటర్వ్యూ వింటే (అంతర్జాలంలో ఉంది) చివరి దశలో సైతం చలం తన మూల అభిప్రాయాలేవీ మార్చు కోలేదనే విషయం అర్థమౌతుంది. " ఆత్మే ప్రమాణం. ఏ కార్యం చేసిన తర్వాత నీచంగా " ఫీల్ " అవుతారో ఆ కార్యం పాపం. ఏ కార్యం ఆరోగ్యంగా, ఆనందకరంగా ఉంటుందో అది ధర్మం..." అన్న చలం, "లోకంలోని అన్ని ఉద్యోగాలకన్నా పిల్లల్ని

ఆరోగ్యంగా కని, ఆరోగ్యంగా పెంచడమనేది గొప్ప ఉద్యోగం. ఈ ఉద్యోగానికి ఎవరూ జీతం ఇవ్వరు." అంటూ, "To be in love means to find once God" అన్నాడు. ఆ ప్రేమని దర్శించాడు కనుకనే తెలుగు నేల మీద ప్రకటించిన యుద్ధానికి భౌతికంగా విరామం ప్రకటించి తమిళనాట ఈశ్వరుణ్ణి వెతికి పట్టుకొని ప్రశాంతతను పొందాడు. అక్కడ మరణించాడు కనుకనే కనీసం రోడ్డు పక్కన ఉన్న ఆయన సమాధి ఆ మేరకయినా ఈనాటికి మిగిలి ఉంది. ఈరోజు అసంఖ్యాకంగా అరుణాచలం వెళుతున్న ఎందరో భక్తులకు, ఆధ్యాత్మిక అన్వేషకులకు ఆనాడే, అంటే ఈ సామాజిక మాధ్యమాలు, అవధానుల ప్రసంగాలు లేని కాలంలోనే ఆ అరుణాచలం మహాపర్వతం మాటున తృప్తిగా శయనించిన చలం ఎంతటి దూరదృష్టిగల మార్గదర్శకుడో ఈనాటికైనా తెలిసిరావాలి. అరుణాచలం వెళ్ళిన వారంతా అక్కడున్న ఒక తెలుగు మహా తాత్వికుడి అంతిమ స్మృతిని తప్పక దర్శించుకు రావాలి.

కవిగా,రచయితగా,అనువాదకుడిగా, సామాజిక ఆలోచనపరుడిగా, సంఘసంస్కర్తగా, వ్యంగ్య వ్యాఖ్యాతగా, మహిళా పక్షపాతిగా, తిరుగులేని అధ్యయనవేత్తగా, సమానతా ఉద్యమ నిర్మాతగా అన్నింటికి మించి కళాత్మకత కలిగిన రసైకజీవిగా, గుణాత్మకత రగిలిన స్వాప్నికుడిగా, నిత్య సత్యాన్వేషణా పథంలో పయనించిన మానవీయ సౌందర్యారాధకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా, సాహార్థిక చింతనశీలిగానే చలాన్ని గుర్తించడం సబబు. అలా, తెలుగులో ఎవరూ గుర్తించని మొదటి కళాత్మక అనార్కిస్టు చలమే.. సిద్ధాంత చట్రాలకు అతీతంగా ఒక విశ్వజనీన నవమానవ వ్యవస్థ కోసం తన చిట్టచివరి నిమిషం వరకూ తపించిన మహావ్యక్తిని తనకు తెలిసిన తక్కెళ్లతో తూచడానికి చూడటమే వ్యవస్థ చేసిన పిచ్చిపని. అందుకే ఆయన ఆశయాలను అర్థం చేసుకునే స్థాయికి కూడా లోకం ఇంకా చేరలేదు. అయినప్పటికీ, అప్రకటితంగానే చలానికి అసంఖ్యాక అభిమానులున్నారు. చలం అక్షరాల్ని గుండెల్లో ఏళ్లపాటు దాచుకున్న ప్రేమాస్పదులున్నారు. ఐతే, నేటి తరాలకు చలం రచనల్ని పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పురుషాధిక్యత, వ్యక్తిగత అహాలు విపరీతంగా

పెరిగిపోయి, స్వేచ్ఛకు, విశృంఖలతకు వ్యత్యాసం తెలీకుండా పోయిన రోజుల్లో మానవ సంబంధాల్లో ఉన్న సంక్లిష్టతలను సమాజానికి చూపించడానికి చలం అక్షరాలు చాలా అవసరం.

మనిషి జీవితంలో లైంగికత ఒక దైనందిన వాస్తవం. మానసిక, శారీరక సమస్యలకు ప్రధాన కారణం సెక్స్ గురించిన సరైన స్పృహ లేక పోవడమే. దానిని గుర్తించి సవాలు చేసిన వారు అనేక ప్రాంతాల్లో చాలా మందే ఉండొచ్చు. ఐతే, మానవ జీవితంలోని కృత్రిమత్వాన్ని ఎండగట్టి, ఉద్యమ స్థాయిలో స్త్రీ స్వేచ్ఛ కోసం గొంతెత్తిన వ్యక్తులు దేశంలోనే అరుదు. ముఖ్యంగా, సదాచార కుటుంబాల్లో నెలకొన్న కట్టుబాట్లను నిరసిస్తూ వందల సంఖ్యలో రచనలు చేసి, ఆ స్థాయిలో నిష్కర్షగా ఎద్దేవా చేసిన వారు నాటికి నేటికి కూడా చలం తప్పా ఎవరూ లేరు. అలా, ఏ రాజకీయ సామాజిక సిద్ధాంతం జోలికి పోకుండానే పాశ్చాత్య ప్రజాస్వామిక విధానాన్ని తనదైన శైలిలో ప్రచారోద్యమంగా తెలుగులో నిర్మించిన ఘనత చలానిదే. మబ్బుల మాటున దాగిన నింగిలో నిబిడీకృతమైన ఎన్నెన్ని అరుదైన రంగురంగుల ఇంద్రధనుస్సుల్ని వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేశాడు ? చలం లేని లోకం ఎన్నటికైనా స్వేచ్ఛాగీతాన్ని వినగలిగేదా ? సప్తవర్ణాల్ని చూడగలిగేదా? మహిళల్ని, మల్లె వూలను, పిల్లల్ని, పిల్లగాలులను, సూర్యోదయాన్ని, సూక్ష్మమైన జీవిత సారాలను అర్థం చేసుకోగలిగేదా ? అందుకనే, చలం వంటి జీవన ఋషి తెలుగులో మరెక్కడా కానరాడు. అలాటి చలం, ఆయన రచనలు, జీవితం, చేసిన సుధీర్ఘ పయనం, తప్పొప్పులు అన్నీ తెలుగు జాతి విశిష్ట సంపద. వాటి వెలుగులో అసమాన గోడల్ని కూలుస్తూ, సమతా మమతల సమాజాన్ని నిర్మించే దిశగా, ఆయన స్ఫూర్తిని సజీవంగా కాపాడుకోవడమే మహత్తరమైన మానవోద్యమకారునిగా చలానికి, చలం ' స్త్రీ ' కి, మనతరం ఇవ్వగలిగే కనీస మానవీయ నివాళి కాగలదు.

(మే 18 మహా రచయిత చలం జయంతి, అలాగే, చలం " స్త్రీ " కి శతవార్షికోత్సవం సందర్భంగా....)

తెలుగు వెలుగు డా. గురుకుల మిత్ర

తెలుగు భాష, జాతి, చరిత్ర, సంస్కృతులని లోతుగా అధ్యయనం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి డా. గురుకుల మిత్రా. ఒక జాతిగా తెలుగు ప్రాంతానికి భౌగోళికంగా ఉన్న విశిష్టతల్ని రాజకీయార్థిక సాంస్కృతిక ప్రత్యేకతలను గుర్తించిన ప్రథమ పరిశోధకుడు. సకల అభ్యుదయ శక్తుల్ని మిళితం చేసి "సమసంఘం ' సంస్థను రూపొందించిన వాడు. రాష్ట్రాల స్వయం నిర్ణయాధికారాల్ని స్పష్టంగా ప్రతిపాదిస్తూ, 40 ఏళ్ల క్రితమే ఏకంగా " తెలుగు జాతి విముక్తి సంఘం" స్థాపించి, " తెలుగిస్తాన్" పేరిట శక్తివంతమైన సృజనాత్మక కవితా సంపుటి ప్రచురించిన మహావ్యక్తి డా. మిత్రా. బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం ఒక శాస్త్రీయ

దృక్పథాన్ని వెలువరించిన డా. మిత్రా, దేశంలోని వామపక్ష, ప్రగతిశీల సంఘాల న్నింటినీ సమన్వయం చేసి, "బలహీన వర్గాల సమాఖ్య ' ఏర్పరిచాడు. దళిత బహుజన శ్రేణులు అన్నింటినీ ఒక్క తాటి పైకి తీసుకొని రావడానికి శాయశక్తులా ప్రయత్నం చేశాడు. ఆనాడే కులగణన అవసరాన్ని గుర్తించి అందుకోసం గొంతు విప్పిన మొదటి వ్యక్తి డా. మిత్రా.

గుంటూరు జిల్లా రేపల్లె లో జూలై 21, 1933 లో జన్మించిన డా. మిత్రా బాల్యం నుండి విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. గుడివాడ లో హోమియో వైద్యం చదివాడు. ఆ కాలంలోనే రాడికల్ వామపక్ష ఉద్యమాలలో క్షేత్రస్థాయి లో పనిచేశాడు. ఒక వైపు దుర్భర పేదరికాన్ని అనుభవిస్తూనే మరోవైపు అసాధారణ అధ్యయనం చేశాడు. కలకత్తాలో పి.జి. చదివి ఆక్యుపంక్చర్ వైద్య విధానాలని నేర్చుకోడానికి చైనా వెళ్ళాడు. షాంఘై విశ్వవిద్యాలయంలో ఆక్యుపంక్చర్ ఎం. డి. చేశాడు.సంప్రదాయక ఆక్యుపంక్చర్ వైద్యాన్ని కాదని, ఆధునిక పద్ధతులలో మెరుగు పరిచాడు. అలా భారతదేశంలో ప్రత్యామ్నాయ ఆక్యుపంక్చర్ పద్ధతిని కనుగొన్న మొట్టమొదటి వైద్యుడు మిత్రా. కొన్ని వందల హెల్త్ క్యాంపులు నిర్వహించాడు.ఆయన క్యాంపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సులు నడిపేదంటే, వాటికి ఉన్న ప్రజాదరణ ఎంతటిదో ఊహించ వచ్చు.రోగి కేంద్రక వైద్య విధానాన్ని రూపొందించిన డా. మిత్రా, పదుల సంఖ్యలో ప్రత్యామ్నాయ వైద్య గ్రంథాలు రచించాడు. దేశవ్యాప్తంగా ఎందరో వైద్యుల్ని, ఆరోగ్య కార్యకర్తల్ని తయారు చేశాడు.

ఒకవైపు వైద్యుడిగా నిరంతరం పనిచేస్తూనే, మరోవైపు అన్నిరకాల భావోద్యమాల్లోనూ అవిశ్రాంతంగా కృషి చేయడం డా. మిత్రాకి మాత్రమే చెల్లింది. జాతి విముక్తి పోరాటాలు చేస్తున్న రాష్ట్రాలు అన్నింటికి అధ్యయన పర్యటనలు చేయడమే కాక, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అన్ని ప్రజా సంఘాలతోను ఎల్లప్పుడూ చర్చిస్తూనే ఉండేవాడు. భావజాల ప్రచారానికి ప్రజాధికారం, తెలుగు జాతి, తెలుగిస్థాన్, ఫ్రీ నేషన్ వంటి పత్రికలు కూడా స్థాపించి నడిపాడు. అక్రమ కేసుల్లో అనేకసార్లు అరెస్టయ్యాడు. ఎన్నో సార్లు విమర్శించబడ్డాడు. అవమానాలు, అవహేళనలు అధిగమించాడు. జీవితాంతం రాజీలేని ధిక్కార స్వరంగానే

మసిలాడు. అప్పట్లో తమిళనాడు ప్రభుత్వం డా. మిత్రా గారిని ఆ రాష్ట్రంలోకి ప్రవేశించ కుండా నిషేధం విధించింది. ఒక దశలో మిత్రా గారి ఉనికికి భయపడిన పాలకులు ఆయన మీద నిరంతరం రహస్య నిఘా వేసి ఉంచే వారంటే ఆయన ఉ ద్యమ తీవ్రత ఎంతటిదో అర్ధం అవుతుంది.

కొండపల్లి సీతారామయ్య మొదలుకుని వావిలాల గోపాలకృష్ణయ్య వరకు దేశంలోనూ,తెలుగు ప్రాంతంలో డా. మిత్రాకి పరిచయం లేని బుద్ధిజీవులు లేరంటే అతిశయోక్తి కాదు. అటు వామపక్ష ప్రగతిశీల పార్టీల నుండి, ఇటు నాస్తిక హేతువాద సంఘాల దాకా పదుల సంఖ్యలో ప్రజాసంఘాలకి వెన్నుదన్నుగా నిలిచిన ఏకైక మేధావి మిత్రా. ఆరోజుల్లో తాను దైవాంశ సంభూతుడినని ప్రచారం చేసుకుంటున్న ఒక ప్రఖ్యాత బాబా దగ్గర మారువేషంలో కొంతకాలం శిష్యుడిగా చేరి అక్కడి మోసాల్ని బట్టబయలు చేసి మహిమలు లేవని నిరూపించిన వ్యక్తి డా. మిత్రా. ప్రత్యామ్నాయ రాజకీయ చైతన్యానికి తాత్వికంగా ఊతం ఇస్తూ కొన్ని వందల రాజకీయ తరగతులు నిర్వహించిన మిత్రాని అనేకమంది సినీరంగ ప్రముఖులు కూడా సలహాల కోసం సంప్రదించే వారు. ఇంతటి కీర్తి ప్రతిష్టలు, పరపతి ఉన్నప్పటికీ ఎన్నడూ ఆయన డబ్బుకు విలువ ఇవ్వలేదు. ఆస్తిపాస్తుల కోసం పాకులాడలేదు. ప్రాక్టీసులోనే వచ్చిందే కానీ ఆయన మిగుల్చు కున్నది ఏమీ లేదు.

భారతీయ సమాజంలో సాంస్కృతిక రంగం విశిష్టత గుర్తించిన డా. మిత్రా, భాష విషయం లోనూ తనదైన కృషి చేశాడు. సులువైన వర్ణ క్రమంతో తెలుగు అక్షరమాలని డా. మిత్రా ప్రయోగించే వాడు. తన కవితల్లో, రచనల్లో కూడా క్లిష్టమైన, గ్రాంథిక పదాల బదులు అందరికి అర్థమయ్యే తేలికపాటి వాక్యాల్నే ఆయన ఉపయోగించే వాడు. భాష కేవల సమాచార సాధనం కాదని, భాష ఒక జాతి జనజీవన సాంస్కృతిక సారమని మిత్రా అభిప్రాయం. అందుకే, ఆ దిశగా ఆయన 'తెలుగు మహాసభ ' పేరిట స్తాపించి, నిర్మించిన ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. రోజువారీ వ్యవహారాల్లో తెలుగు భాష ప్రాముఖ్యత గుర్తించాలనే డిమాండుతో డా. మిత్రా అన్ని తెలుగు జిల్లాలలో సమావేశాలు నిర్వహించి, చేసిన పోరాట ఫలితంగానే నాటి ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు, "దైనందిన జనజీవన పాలనా విధానంలో, బోధనా రంగంలోనూ తెలుగు భాషనే వాడాలి" అంటూ

ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

ముఖ్యంగా, అప్పటి వరకూ కేవల నినాదంగా ఉన్న బహుజన రాజ్యాధికారానికి స్పష్టమైన తాత్విక భూమిక డా. మిత్రా రచించాడు. ' సామాజిక న్యాయం' అనే మౌలిక ప్రజాతంత్ర భావన ఆధారంగానే ప్రత్యామ్నాయ రాజకీయ స్రవంతులు ఉండాలని నిర్దేశించాడు. ఏ సామాజిక సిద్ధాంతానికైనా ' సమానతే ' ప్రాతిపాదిక కావాలని ప్రకటించాడు. ఆ క్రమంలో పీడిత కులాలు అన్ని ఏకం కావాలని చెబుతూ, దామాషా ప్రకారం అవకాశాలు అన్ని కులాలకు ఉండాలాంటాడు. అంతేకాదు, తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ జనాభా ఉన్న తెలగ,బలిజ, మున్నూరు కాపు, తూర్పు కాపు వంటి ఉప కులాలన్నీ సమాఖ్యగా ఏర్పడి కాపు కులం చోదక శక్తి గా మారాలని ఆశించాడు. డా. మిత్రా ' కాపు నాడు ' రూపకర్త అనే విషయం కూడా చాలా మందికి తెలియదు. పీడిత తాడిత, దళిత బహుజన సబ్బండ కులాల ఐక్య సంఘటన ప్రాధాన్యత ఎన్నడో చాటి చెప్పిన అరుదైన మేధావి డా. మిత్రా.

సామాజిక మార్పు కోసం జీవితాంతం అసాధారణ కృషి చేసిన డా. మిత్రా ఏప్రిల్ 13, 2007 న అనారోగ్యంతో చనిపోయాడు. మరణానంతరం తన పార్థివ దేహాన్ని నిట్ట నిలువుగా పూడ్చమనే చిత్రమైన కోరిక ఆయన కోరాడంటారు. డా. మిత్రా రచనలు దాదాపు అన్నీ మరుగునపడ్డాయి. అముద్రిత రచనలు, ఆయన ఎంతో పరిశోధించి రాసిన శాస్త్రీయ ఆక్యుపంక్చర్ గురించిన ఉద్గ్రంధం వంటివి ఏమైపోయాయో తెలీదు.మిత్రులు, సహచరులు అప్పట్లో ఏవో కొన్ని కార్యక్రమాలు చేశారు కానీ ప్రస్తుతం అవీ లేవు. భావజాల పరంగా ఎప్పటి కంటే ఈరోజే డా. మిత్రా ఆలోచనలకు మరింత ప్రాసంగికత ఉంది. వైద్యునిగా, సామాజిక చింతనాశీలిగా, ఉద్యమ నిర్మాణవేత్తగా, కవిగా, రచయితగా, పాత్రికేయుడిగా అన్నిటిని మించి నిబద్ధతగల సైద్ధాంతిక సాంస్కృతిక దార్శనికుడిగా డా.మిత్రా చేసిన కృషి వెలుగులో ఆయన ఆశయాల్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళడమే ఆయనకి ఇవ్వగలిగే క్రియాశీలక నివాళి.

(జూలై 21, డా. గురుకుల మిత్ర జయంతి)

మానవీయ సాహిత్యశీలి కోడూరి

తెలుగు సాహిత్యంలో విశిష్టమైన కృషి చేసిన అరుదైన వ్యక్తి కోడూరి శ్రీరామమూర్తి. సాహిత్య విమర్శ, కథ, నవల, బాల సాహిత్యం, పరిశోధన, పత్రికా రచన, ప్రచురణ ఇలా పలు ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప మనిషి కోడూరి. ప్రత్యామ్నాయ గాంధేయవాదానికి సంబంధించిన బహుముఖ కోణాలకు తెరతీయడం కోడూరి ప్రత్యేకత. భగత్సింగ్, మానవేంద్రనాథ్ రాయ్, వల్లభాయ్

పటేల్, వంటి మహోన్నతుల జీవితాల్లో వెలుగుచూడని ఎన్నో విషయాలను వెలికితీసిన ప్రజ్ఞాశాలి. అంతేకాదు, ప్రపంచ మేధావులైన బెర్ట్రాండ్ రస్సెల్, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ రస్కిన్,జాన్ స్టువర్ట్ మిల్ వంటి వారి కోసం తెలుగులో మొదటిసారిగా విలువైన రచనలు చేసిన అపూర్వ ఆలోచనాశీలి. చివరివరకూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా కూడా తాను నమ్మిన మానవతావాద సిద్ధాంతానికి సాహిత్య రంగంలో చోటు కల్పించి,మనసా వాచా కర్మణా మనిషి ఉన్నతికి కట్టుబడ్డ మహోన్నత రచయిత కోడూరి శ్రీరామమూర్తి.

1941, సెప్టెంబరు 29 న రాజమండ్రిలో జన్మించిన కోడూరి వారిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రాజమహేంద్రవరంలో మొదటి సారి ఇంటి పై జాతీయ జెండా ఎగరవేసిన దేవతా శ్రీరామమూర్తి కోడూరి తాతగారు. ఆయన గొప్ప దేశభక్తులు. ప్రభుత్వం ఆయన పై పెట్టిన అక్రమకేసుల్ని ఎదుర్కొని " జండా ఎగరేయడం నా జన్మహక్కు" అని స్వయంగా కోర్టులో వాదించుకుని కేసు గెలిచారు. దాంతో స్థానిక ప్రజానీకానికి జండా ఎగరేసుకునే వీలు కలిగింది. ప్రతి ఇల్లు మువ్వన్నెల జెండాతో రెపరెప లాడింది. అందుకే, ఆయన్ని అంతా ' జండా ఫ్లీడరు' అని పిలిచేవారు.. ఆ విషయం తెలిసిన మహాత్మా గాంధీజీ, సుభాష్ చంద్రబోస్ వంటి మహామహులు ఎప్పుడు రాజమండ్రి వచ్చినా కోడూరి తాత గారైన దేవతా శ్రీరామమూర్తి గారి ఇంటనే దిగేవారు. తర్వాత కాలంలో ఆయన పేరే కోడూరి వారికి కూడా పెట్టారు.

కోడూరి శ్రీరామమూర్తి తండ్రి పుల్లేశ్వరరావు.తల్లి కోడూరి లీలావతి దేవి, ప్రసిద్ధ రచయిత్రి.బాల సాహిత్యం లో అందెవేసిన చెయ్యి. ఆమె పేరిట రాజమండ్రి లో ఇప్పటికి ఒక వీధి సైతం ఉంది. ఆమె ప్రభావంతోనే అతి చిన్న వయసులో అప్పుడే పుట్టిన చెల్లెలు కోసం " నేను, నా చెల్లెలు" అనే రచనచేసిన కోడూరి శ్రీరామమూర్తి మొదట్నుంచి గాంధేయవాది. రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా అప్పట్లో 14 అధికారిక భాషల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన పుస్తక పోటీల్లో ఎందరో మహామహులతో పోటీపడి విద్యార్థి అయిన కోడూరి వారికి మొదటి బహుమతి వచ్చింది. అప్పటికి ఆయన వయసు కేవలం 19 ఏళ్ళు

మాత్రమే. బహుమతి ప్రధానోత్సవంలో, నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు నవయువకుడు కోడూరిని చూసి, ఆ రచన చేసింది కోడూరి అంటే మొదట నమ్మలేదు. తర్వాత పరమానందభరితులై కోడూరి శ్రీరామమూర్తి గారితో ఫోటో కూడా దిగారు. అలా ఆయన రచనా వ్యాసంగం ప్రారంభమైంది.

అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ వారి ప్రోత్సాహం తో కొన్ని అనువాదాలు చేసిన శ్రీరామమూర్తి గారు, 'ఉదయరేఖ ' అనే సాహిత్య పత్రిక కూడా కొంతకాలం స్తాపించి నడిపారు. వివిధ పత్రికల్లో సహాయసంపాదకుడిగా పనిచేశారు. మూడు దశాబ్దాలకు పైగా బొబ్బిలి కళాశాలలో ఆర్థికశాస్త్రం బోధించారు.వివిధ జర్నలిస్టు సంఘాలకు,కళాశాలలకు గెస్ట్ లెక్చరర్ గా ఉన్నారు.అప్పట్లో కోడూరి శ్రీరామమూర్తి గారి వ్యాసం లేని భారతి పత్రిక ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. అంతగా తెలుగు సాహిత్య విమర్శ లో పేరు సంపాదించు కున్నారు. ఆయన రాసిన, " తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ " నాటికి నేటికి కూడా ఆ అంశం మీద ఒక్క తెలుగులోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే అరుదైన గ్రంథం. ఈనాటికి కూడా అనేక విశ్వవిద్యాలయాలలో ఆ అంశం పై అదొక్కటే సాధికారిక రచన. ఆ రచన ఆంగ్లంలో కనుక ఉండుంటే ఆయనకు దేశదేశాల్లో అంతర్జాతీయ ఖ్యాతి లభించేది. ఆయన నవల ' నీటిలో నీడలు ' అమెరికాలోని వాషింగ్టన్ కాంగ్రెస్ లైబ్రరీలో ఎంపిక చేసి ఉంచిన అరుదైన తెలుగు పుస్తకాల్లో ఒకటి.

ఇవేకాక వెలుగు వెన్నెల అనే వ్యాస సంపుటి, తెలుగు కథ నాడు, నేడు, మా మంచి తెలుగు కథ, రాగమాలిక, తెర తీయగరాదా కథా సంపుటి, బాలసాహిత్యంలో రవికవి, మహనీయుల జీవితంలో కథ కాని కథలు, ఆలోచన వ్యాసాలు వంటి వివిధ రచనలు చేశారు. వందలాది సాహిత్య గోస్టులు, సభల్లో ప్రసంగాలు చేశారు. హేతు చింతనతో కూడిన జిజ్ఞాసని రచనా శైలిలో కోడూరి ఇష్టపడేవారు. వ్యక్తిగత నమ్మకాలతో సంబంధం లేకుండా శాస్త్రీయ దృష్టితో చరిత్రని, సాహిత్యాన్ని, సమాజాన్ని సమీక్షించడం కోడూరి ప్రత్యేకత. గాంధీజీ ప్రతిపాదించిన నూతన విద్యావిధానం (నయీ తాలీం), నైతిక ప్రవర్తనావళి, పౌరచైతన్యం, సామాజిక న్యాయం, సహాయ నిరాకరణోద్యమం, సహకార

సంఘాలు, సర్వోదయ సిద్ధాంతం వంటివి యువత లోతుగా అధ్యయనం చేసి లోటుపాట్లు విమర్శించాలనేది కోడూరి శ్రీరామమూర్తి గారి కల. దానిని నిజం చేసే దిశగా పిల్లలకి కూడా అర్థమయ్యే తేలికపాటి భాషలో గాంధేయవాదాన్ని ఆయన రచించేవారు. తన దగ్గరికి వచ్చే ఆసక్తిపరులకి, యువతకి చదవమని పుస్తకాలు ఇచ్చేవారు.

ఇదంతా ఒకెత్తయితే మహాత్మా గాంధీని గురించి ఆయన జీవితాంతం చేసిన విస్తృత శోధన, కృషి ఒక్కటి ఒకెత్తు. మహాత్మాగాంధీని బహుముఖ కోణాలలో ఆవిష్కరించిన తొలి తెలుగు రచయిత కోడూరి. కేవల స్వాతంత్ర సమర యోధునిగా మాత్రమే కాక ఒక సత్యాన్వేషిగా, పాత్రికేయుడిగా, పర్యావరణ వేత్తగా, దార్శనిక ఆలోచనశీలిగా, రాజకీయవేత్తగా ఎన్నోరూపాల్లో మనకు తెలియని మహాత్ముడి కోసం కోడూరి విశ్లేషించారు. బహుశా మరే ఇతరేతర భాషా సాహిత్యంలో కూడా మహాత్మా గాంధీని గురించి ఇంత విలక్షణంగా వివరించిన వారు ఎవరూ ఉండరేమో. పురాణం సుబ్రమణ్యశర్మ గారి సంపాదకత్వంలో ఆంధ్రజ్యోతి పత్రికలో " గాంధీజీ కథావళి" పేరిట సుమారు మూడేళ్ల పాటు సీరియల్ రాశారు. అలాగే " ఈనాడు " పత్రికలో నేటికీ గాంధేయ మార్గం ఎలా అవసరమో చెబుతూ దాదాపు 50 వరకూ వ్యాసాలు రాసారు. గాంధీజీ దృక్పథానికి కట్టుబడి మొత్తం పదిహేను వరకూ పుస్తకాలు రాసారు. తెలుగులో ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలు ఎన్నో కోడూరి వారి రచనలు పదుల సంఖ్యలో ప్రచురించాయ్.

"ఇప్పుడు నా వయస్సు ఎనిమిది దశాబ్దాలు దాటి తొమ్మిదో దశాబ్దంలో దాదాపుగా సగానికి వొచ్చింది. ఇక, ఇప్పటికైనా జారిపోకుండా ఉన్న జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుందామనే ఉద్దేశంతో ఇది వ్రాయడం ప్రారంభించాను. ఇది చాలా విలువైనదని చెప్పడం లేదు. కానీ, ఒక తరంలో జీవించిన, ఇంకా జీవిస్తున్న ఒక వ్యక్తి జ్ఞాపకాలు కాబట్టి కొత్త తరం పాఠకులకు కొంతైనా ఉపయోగకరంగా ఉండవచ్చునని ఇది రాస్తున్నాను..." అంటూ ' తెగిన జ్ఞాపకాలు ' పేరిట స్వీయచరిత్ర మొదలుపెట్టిన కోడూరి శ్రీరామమూర్తి గారు, ఆత్మకథ పాతికపుటలు అసంపూర్ణంగా రాస్తూనే ఆగస్టు 5, మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో

అకస్మాత్తుగా అస్తమించారు. ఇవే కాకుండా, పుస్తక రూపంలో రాని వందలాది వ్యాసాలు, "స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం – సంప్రదాయము, ప్రయోగము" అనే ఆయన విశేష మహా పరిశోధక గ్రంథం కూడా అముద్రితంగా ఉండిపోయింది. ఔత్సాహికులు పూనుకుని ఆయన జీవితం, కృషి కోసం మరింత శోధిస్తే ఇంకా మరుగుపడిన ఎన్నో విషయాలు తెలుస్తాయి.

సాహిత్య అకాడమీ అవార్డు మొదలుకుని తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం వరకూ అనేక గౌరవాలు పొందిన కోడూరి శ్రీరామమూర్తి గారిది సార్థక జీవితం. సాత్విక, నైతిక విలువలు కలిగిన వ్యక్తిత్వం. భారతీయ స్వాతంత్రోద్యమ చరిత్ర మొదలుకొని లౌకికవాదం, ఫ్రెంచ్ విప్లవం, గదర్ మహోద్యమం తదితర అంశాలపై సాధికారికంగా రచించగల, ఉపన్యసించగల ఏకైక తెలుగు సాహిత్యకారుడు కోడూరి. ఆయనకి జీవితాంతం తోడుగా ఉన్న భార్య భారతి గారి ఆకస్మిక మరణం అంతిమ దశలో ఆయన్ని తీవ్రంగా కుంగదీసింది. ఆ దిగులుతోనే చివరివరకూ రచనా వ్యాసంగానికే అంకితమై అక్షరాలతోనే సావాసం చేస్తూ చివరి శ్వాస విడిచారు. భిన్న సామాజిక ఉద్యమాలు అన్నింటిపట్లా మిత్ర పూరిత దృక్పథంతో వ్యవహరించిన కోడూరి శ్రీరామమూర్తి గారు నిఖార్సైన ప్రజాతంత్రవాది.గాంధేయవాదానికి సంబంధించిన ఒక ప్రత్యేక బుద్ధిజీవినిని, ఆయన మరణంతో తెలుగు సమాజం కోల్పోయింది. అక్షరాల్లో నిక్షిప్తమైన ఆయన ఆదర్శాలను ఆచరణలో నిబద్ధతగా కొనసాగించ గలగడమే నేటి తరం కోడూరి శ్రీరామమూర్తి గారికి అంతిమంగా ఇవ్వదగిన ఆశయపూరిత ఆత్మీయ నివాళి.

(మహా రచయిత శ్రీ కోడూరి శ్రీరామమూర్తి గారు ఆగస్టు 5 న రాజమహేంద్రవరంలో మరణించారు.)

విస్మృత బౌద్ధ మేధావి

అరుదైన తెలుగు భావోద్యమకారుడు కడలి సత్యనారాయణ మూర్తి. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో బౌద్ధ బహుజన సాంస్కృతిక వికాసానికి ఎనలేని కృషి చేసిన మహావ్యక్తి. ప్రగతిశీల వామపక్ష ఉద్యమం మొదలు హేతువాద,అంబేద్కర్,ఫూలే ఆలోచనా స్రవంతుల్ని పరిపుష్టం చేసిన మేధావి.

సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఒకవైపు రచనా వ్యాసంగం, మరోవైపు అలుపెరుగని కార్యాచరణతో అసాధారణ క్రియాశీలిగా ఎదిగిన దార్శనికుడు. దశాబ్దాల క్రితమే బౌద్ధాన్ని లోతుగా అధ్యయనం చేసి పీడితుల విముక్తి మార్గంగా గుర్తించి ప్రచారం చేసిన ఆలోచనాపరుడు. దళిత బహుజన స్త్రీల బలమైన గొంతుకగా " గోదావరి కెరటాలు " పత్రిక స్థాపించినవాడు. గోదావరి జిల్లాల్లో తొలి బుద్ధ విహార వ్యవస్థాపకుడు.

అక్టోబర్ 12, 1938 లో రాజోలులో జన్మించిన కడలి సత్యనారాయణ మూర్తి తండ్రి సైకిలు షాపు నడిపేవాడు. అక్కడే పి యు సి చదివి అనేక పనులు చేశాడు. కొంతకాలంపాటు హైదరాబాద్ లోని ఒక రెసిడెన్షియల్ హోస్టల్లో కూడా వార్డెన్గా పనిచేశాడు. ముక్కుసూటితనం, అక్రమాలు సహించలేనితనం వల్ల ఎక్కడా ఎక్కువకాలం నిలదొక్కుకోలేదు. చివరికి కాకినాడ సబ్ ట్రెసరీ ఆఫీసులో ఉద్యోగం రావడంతో అక్కడే ఆయన కార్యకలాపాలు సాగాయి. హేతువాద సంఘం బాధ్యునిగా అనేక సభలు సమావేశాలు నిర్వహించాడు. మొట్టమొదటిసారిగా డా. అబ్రహం కోవూర్, బి. ప్రేమానంద్ వంటి ప్రపంచ ప్రఖ్యాత హేతు వాదులని తీసుకొచ్చి ఎన్నో విజ్ఞానదాయక కార్యక్రమాలు చేపట్టాడు. మూఢనమ్మకాలు, మహిమల బండారాలు బయటపెట్టాడు.

ఆ క్రమంలోనే వివిధ వామపక్ష సిద్ధాంతాల్ని అధ్యయనం చేశాడు. విశాఖపట్నం వెళ్ళి శ్రీశ్రీని స్వయంగా కాకినాడ తీసుకొచ్చాడు.మార్క్సిస్టు సానుభూతి పరుడిగా మారాడు. ఆనాటి పీపుల్స్ వార్ అగ్రనేతలు కొండపల్లి సీతా రామయ్య, కె. ఎస్. సత్యమూర్తి, గద్దర్ వంటి వారితో సంబంధాలు పెట్టుకున్నాడు. స్వయంగా వాల్ రైటింగ్స్ రాయడం, కరపత్రాలు పంపిణీ చేయడం చేసేవాడు.భూపతి నారాయణమూర్తి పరిచయంతో దళిత బహుజన సాంస్కృతిక శాస్త్రాలను అధ్యయనం చేశాడు. డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాఫూలేల తాత్వికత ఆయన దృక్పథాన్ని మలుపు తిప్పింది. దొమ్మేటి సత్యనారాయణ బోధి ప్రభావంతో బౌద్ధం గురించి లోతైన పరిశోధన చేశాడు. అంతిమంగా బౌద్ధ బహుజన ప్రత్యామ్నాయ సిద్ధాంతవేత్తగా రూపొందాడు.

ఇదంతా ఒకెత్తయితే, 90 వ దశకంలో బౌద్ధం స్వీకరించిన కడలి సత్యనారాయణ మూర్తి, దళితులు (ఎస్. సి, ఎస్. టి., మైనారిటీలు) జాతులు, స్త్రీల సమస్యల దర్పణం అని ప్రకటించి " గోదావరి కెరటాలు " పత్రిక స్థాపించడం ఒక్కటి ఒకెత్తు. దళిత బహుజన భావజాల సాధనంగా అక్షరాలని తలకెత్తుకున్న కడలి సత్యనారాయణ మూర్తి సుమారు 12 ఏళ్ళ సర్వీసుని స్వచ్ఛందంగా వొదులుకుని పత్రిక పెట్టాడు. ప్రసిద్ధ అంబేద్కరిస్ట్ వి.టి. రాజశేఖర్ బెంగుళూరు నుండి " దళిత్ వాయిస్" పత్రిక స్థాపించిన సరిగ్గా పదేళ్లకు 1991లో తెలుగులో గోదావరి కెరటాలు ఆరంభించాడు. ప్రత్యామ్నాయ పీడితుల స్వరంగా నిలిపాడు.బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబా ఫూలేల విశిష్ట భావజాల వాహకంగా పత్రికని మలిచాడు.

" బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని కూల్చనిదే విముక్తి లేదు. దున్నే వానికే భూమి ఆర్థిక వాదమే. భూమిని జాతీయం చేయడమే కీలక సమస్య. హేతుబద్ధమైన ' బౌద్ధమార్గం ' తప్ప మరే మార్గం దళితులను దాస్య శృంఖలాల నుండి విముక్తి చేయజాలదు." శీర్షిక కిందనే ఇలాంటి ధిక్కార వాక్యాలతో ప్రచురించబడిన మొదటి తెలుగు పత్రిక అది. గోదావరి కెరటాలు పత్రిక నారాయణ గురు, పెరియార్ వంటి వారి ఆలోచనలకి సైతం అద్దంపట్టేది. వి. టి. రాజశేఖర్ రచనల్ని తెలుగులోకి తెచ్చిన మొదటి పత్రిక కూడా ఇదే. అంతకంటే విశేషం దళిత్ వాయిస్ పత్రిక 1991 డిసెంబర్ సంచిక లో విజయరాజ్, "గోదావరి కెరటాలు " అనే తెలుగు పత్రిక మానవ హక్కుల స్వరంగా వృద్ధి చెందుతోందని అభినందిస్తూ రాసిన వ్యాసం స్వయంగా ప్రచురించడం.

దళిత్ వాయిస్ వంటి ఒక జాతీయ స్థాయి పత్రిక తన సైద్ధాంతిక సరళికి దగ్గరగా ఉన్న ఒక చిన్న ప్రాంతీయ పత్రిక గురించి ప్రకటించడం చారిత్రక విశేషం. దాన్ని బట్టి ' గోదావరి కెరటాలు' పత్రిక తెలుగు భావోద్యమ రంగంలో ఏ విధంగా కృషి చేసిందో అర్థమౌతుంది. ఊ. సాంబశివరావు, కంచ ఐలయ్య వంటి మేధావులతో ఏర్పడ్డ "దళిత రచయితలు, మేధావులు, కళాకారుల ఐక్య వేదిక " లో కూడా సత్యనారాయణ మూర్తి కీలకపాత్ర పోషించాడు.కె.జి.సత్యమూర్తి ఆధ్వర్యం

లో నడిచిన ఏకలవ్య పత్రిక సంపాదక వర్గంలో ఉన్నాడు. ఈ క్రమంలోనే గోదావరి జిల్లాల్లో తొలి బుద్ధ విహారాన్ని కాకినాడ ట్రెసరీ కాలనీలో స్థాపించాడు. అనేక రాష్ట్రాల నుండి ఎందరో బౌద్ధ భిక్షువులను ఆహ్వానించి అనేక బృహత్తర కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాడు.

హేతువాద కార్యకర్తగా, కమ్యూనిస్టు మేధావిగా, ఫూలే అంబేద్కర్ అభిమానిగా,దళిత బహుజన ఉద్యమకారుడిగా, ప్రత్యామ్నాయ రచయితగా, పత్రికా సంపాదకునిగా, జీవితాంతం పీడితుల ఉన్నతి కోసమే వెచ్చించిన కడలి సత్య నారాయణ మూర్తి అరవై ఏళ్ల వయసులో జనవరి 23, 1998 న మరణించాడు. భార్య సావిత్రి.ఒక కొడుకు, కూతురు.వ్యక్తిగత జీవితం లో ఎన్నో ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొన్నా దశాబ్దాల పాటు పత్రికను నిరవధికంగా కొన సాగించాడు. జీవితం మొత్తం కేవలం మూడు జతల బట్టలు మాత్రమే కలిగిన ఆయన నిరాడంబరతను గురించి ఇప్పటికీ మిత్రులు కథలుగా చెప్పుకుంటారు. విస్మరించబడ్డ బహుజన మేధావి, తొలి బౌద్ధ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కడలి సత్యనారాయణ మూర్తి స్ఫూర్తిని పునర్నిర్మించుకోవడమే నేటి దళిత బహుజన ప్రజాతంత్ర శ్రేణుల ముందున్న కర్తవ్యం.

(అక్టోబర్ 12, కడలి సత్యనారాయణ మూర్తి జయంతి.)

తొలి ప్రజాపక్ష పాత్రికేయ యోధుడు!



మహా సంఘసంస్కర్త గోపాల్ బాబా వాలంకర్ మహరాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో మహద్ దగ్గర రౌదుల్ గ్రామంలో 1840లో జన్మించారు. అసమానతలతో నిండిన సమాజంలో ఎన్నో వివక్షల్ని ఎదుర్కొని అసాధారణ స్థాయికి ఎదిగాడు. ఆర్మీ అధికారిగా పనిచేశాడు. సైన్యం అతడికి క్రమశిక్షణ, జీవన పోషణ కల్పించింది కానీ కళ్ళ ముందు వ్యవస్థ మాత్రం అందుకు భిన్నంగా కనిపించింది. దేశంలో పెనువేగంతో అలముకుంటున్న మార్పులు సైతం అణగారిన ప్రజల జీవితాన్ని పెద్దగా ప్రభావితం చేయలేకపోవడం గమనించాడు. రిటైరయ్యాక తాలుకా

ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నప్పుడు తోటి అధికారుల తీరు గమనించాడు. ఎటువైపు తిరిగినా ఎదురొచ్చే ఈ దేశపు ఆధిపత్య కులవ్యవస్థకి వ్యతిరేకంగా నిలవడమే తగిన పరిష్కారమని కనుగొన్నాడు. అక్షరాల పరమార్థం అర్థవంతమైన చైతన్య స్రవంతిలో మాత్రమే వెల్లడవుతుందనే నిజం అంతరాత్మని తట్టిలేపింది. దాని ఫలితమే దేశంలోనే దళిత బహుజన, పీడిత శ్రేణుల పక్షాన మొట్టమొదటి సారిగా 1888లో "విఠల్ విధ్వంసక్" అనే సంచలనాత్మక ప్రజాపత్రిక ప్రారంభించాడు.

'విఠల్' దేవుడికీ, బ్రాహ్మణ పండితులకి సమంగా వర్తించే గౌరవసూచక పదం. నాటి సమాజంలో అసలా పదమే బ్రాహ్మణాధిక్యతకి ప్రతిరూపం.అలాంటిది ఏకంగా 'విఠల్ విధ్వంసక్" అనే పత్రిక పేరే ఉన్నత వర్గాల్ని భయంకంపితుల్ని చేసింది. శతాబ్దాలుగా అక్షరజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని ప్రత్యేక హక్కులు అనుభవిస్తున్న అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కుండబద్దలు కొట్టినట్లు ప్రశ్నించడం గోపాల్ బాబా (కృష్ణ) వాలంకర్ పత్రిక సాధించిన చారిత్రక విజయం. ప్రప్రథమంగా ఆయా ప్రాంతాలలో సాంఘిక రాజకీయార్థిక సమస్యల్ని విశ్లేషిస్తూ ప్రచురించిన 'విఠల్ విధ్వంసక్" తొలి దళిత బహుజన మాస పత్రికగా వినుతికెక్కింది. మానవాతీత శక్తిని తోసిరాజని మొదటి సారిగా ఈ దేశంలోని సగటు మనిషి కోసం మాట్లాడింది. అతడి సమస్యల్ని సహానుభూతితో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. పత్రిక పేరులోనే, వ్యవస్థీకృతమైన అమానవీయ సంస్కృతిని నిరసించి ప్రత్యామ్నాయ మార్గాన్ని బలోపేతం చేయడానికి పుట్టుకొచ్చిందనే స్పృహను జనానికి బలంగా కల్పించగలిగింది.

మహాత్మా ఫూలే ప్రకటించిన ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని గోపాల్ బాబా మరింత విస్తరించాడు. దళిత బహుజనులే ఈ దేశపు మూలవాసులంటూ తనదైన శైలిలో విశ్లేషించాడు. ఆనాడు అన్యాయంగా ఈదేశం మీద దండెత్తి ఇక్కడి ప్రజల్ని బానిసలుగా చేసి వనరుల్ని ఆక్రమించుకున్న ఆర్యుల వారసులే ఈనాటి బ్రాహ్మణాది అగ్రవర్ణాలని ప్రకటించాడు.హిందూ పురాణాలు, ఉపనిషత్తులు తదితరాది వైదిక మత సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసిన గోపాల్ బాబా అనార్యుల్ని అణిచేయడం కోసం ఆర్యులు సృష్టించిన అసమానతలే కులాలు

అంటాడు. విఠల్ విధ్వంసక్ పత్రికా ప్రచురణతో బాటుగా 'సుధారక్, దీనబంధు' వంటి మరాఠి పత్రికలలో కూడా ఆయన అనేక శక్తివంతమైన రచనలు చేశాడు. అంతేకాదు, ఎన్నో కరపత్రాలు, ప్రచారోద్యమ సాహిత్యం సైతం ముద్రించాడు. 26 విమర్శనాత్మక ప్రశ్నల్ని సంధిస్తూ 'విఠల్ విధువంసన్' అనే పుస్తకం, హిందూ ధర్మ దర్పన్ అనే పుస్తకం కూడా రాసారు. అబ్రాహ్మణుల ఆచార సాంప్రదాయ తంతుల్ని నిర్వహించేందుకు ఆయా కులాల వారితోనే 'అనార్య దోష పరిహార మండలి' వంటి సంఘాలు స్థాపించాడు. అందుకే ఆయన్ని టి. యన్. వాలుంజుకర్ 'తొలి దళిత బహుజనోద్యమ మేధావి' గా పేర్కొంటారు.

గోపాల్ బాబా వాలంకర్ డా. బి. ఆర్. అంబేద్కర్ భార్య, మాతా రమాబాయి బంధువు. అలాగే మహా సాంస్కృతిక విప్లవ దంపతులు జోతిరావు ఫూలే, సావిత్రి బాయిల వ్యక్తిత్వాలతో, ఆలోచనలతో ప్రభావితమైన వ్యక్తి. ఆ విధంగా దేశంలోనే తొలి సాంస్కృతిక విప్లవోద్యమ నిర్మాణాలకి సంబంధించిన ఇరువురు మహా దంపతులతోనూ ఆయనకు బాంధవ్యం ఉంది. బహుశా అదే ఒక స్పష్టమైన దృక్పథంతో ముందుకు వెళ్ళడానికి ఆయనకు తోడ్పడింది. 1930 లో బొంబాయిలో స్థాపించిన మొదటి హేతువాద పత్రిక "రీజన్" నిజానికి "పురోహిత వ్యతిరేక పత్రిక' అనే కోణంలోనే ఏర్పడింది. దేశంలోని ఎన్నో ప్రాంతాలలో అప్పటికే ఉన్న భావోద్యమకారుల విప్లవాత్మక ఆలోచనల్ని ఒక్కదరికి చేర్చింది. ఐతే అంతకుముందు ఏభై సంవత్సరాల క్రితమే సూటిగా బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా గోపాల్ బాబా స్థాపించిన "విఠల్ విధ్వంసక్" చరిత్ర మాత్రం ఎందుకో మరుగున పడింది. ఆ మాటకొస్తే భారతీయ పత్రికా పితామహునిగా పరిగణించే 'హిక్కీ' మొదలుకొని ఈనాటి ఆధునిక పత్రికల వరకూ గోపాల్ బాబా అంత రేడికల్‌గా, సూటిగా శీర్షికతోనే పెత్తందారుల్ని బెంబేలెత్తించిన మరో పత్రిక లేదు.

"పత్రిక లేని ఉద్యమం రెక్కలులేని పక్షి వంటిది' అంటాడు బాబాసాహెబ్ అంబేద్కర్. ఈరోజు ఈ మాత్రం దళిత బహుజన అణగారిన వర్గాలకు చైతన్యం కలిగిందంటే అందుకు గోపాల్‌బాబా వాలంకర్ లాంటి పత్రికా సంపాదకుల సాహసోపేతమైన పాత్ర కూడా కారణం.చరిత్ర గమనంలో ఎగుడు దిగుళ్ళు

సహజం. ఐతే, మానవాళికి మార్గదర్శకం కాగలిగిన మహానుభావులు వేసిన అడుగులు మాత్రం ఎన్నటికీ తిరోగమించవు. అలా, ఈ దేశంలో పీడిత ప్రజల ఆత్మగౌరవం కోసం మొదటిసారి గొంతెత్తి నినదించిన స్వరం, అక్షరాగ్నుల్లై గర్జించిన కలం గోపాల్ బాబా వాలంకర్‌ది. 1904 లో మరణించిన వాలంకర్ జీవితకాలం ఆరు దశాబ్దాలే ఐనా, తర్వాత కాలంలో అటు మహారాష్ట్ర మొదలుకొని ఇటు తమిళనాడు వరకూ ఎన్నెన్నో ప్రజాభ్యుదయ పత్రికలు నలు చెరుగులా ఉదయించి విస్తారంగా ఎదగడానికి పునాది బాటలు పడ్డాయంటే, అందుకు వాలంకర్ వంటి యోధుల మహత్తర కృషి కూడా ఒక ప్రధాన కారణం. మరి అటువంటి మహోన్నతమైన మానవీయ కృషిని దశాబ్దాల తరువాతైనా ఆ మేరకు గుర్తించి గౌరవించుకోవడం మన కనీస కర్తవ్యం.

ఆధ్యాత్మిక సామ్యవాద స్వాప్నికుడు.



సామాజిక విప్లవానికి ఆధ్యాత్మికతను మిళితం చేసిన అరుదైన అన్వేషి స్వామి సహజానంద సరస్వతి. భారతదేశంలో మొట్టమొదటిసారిగా భూమిని జాతీయం చేయాలని ఉద్యమించిన వ్యక్తి ఆయన. ఈ దేశంలో రైతుకూలీ రాజ్యం స్థాపన స్వామీజీ కన్న కల. దానిని నిజం చేయడం కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన ప్రజానేత సహజానంద సరస్వతి. ఉత్తర భారతంలోని దేవా అనే గ్రామంలో

జన్మించిన నౌరంగ్ రాయ్ ప్రాథమిక విద్యను మూడేళ్లలోనే పూర్తి చేశారు. ఆధ్యాత్మిక సత్యాన్వేషి గా మారి దేశం మొత్తం తిరిగారు. ఎందరో సాధువుల్ని కలిసారు. ఇంకెన్నో పుణ్య క్షేత్రాల్ని చూసారు. మత గ్రంథాలను ఔపోసన పట్టారు. ఇవేవీ ఆయనకు సంతృప్తిని ఇవ్వలేదు. కళ్ళముందు కదలాడుతున్న వాస్తవాల్ని గుర్తించని ప్రజ్ఞ వ్యర్థం అనుకున్నారు.సామాజిక అసమానతల్ని గుర్తించని మతం గతం అనుకున్నారు. స్వామి సహజానంద సరస్వతి గా మారారు. క్రియాశీల సామాజిక కార్యకర్తగా రూపొందారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో స్వామీజీ అరెస్టు అయ్యారన్న వార్తను విన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్, ప్రతీ ఏడూ ఏప్రిల్ 28న ' అఖిల భారత స్వామి సహజానంద దినోత్సవం ' గా జరుపుకోవాలని ' ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ' తరపునుండి ప్రకటించారంటే స్వామి సహజానంద ప్రభావం ఎంతటిదో అర్థమౌతుంది. ఒక్క మహాపండిత్ రాహుల్ సాంకృత్యాయన్ జీవితం మాత్రమే సహజానంద సరస్వతి స్వామి జీవితానికి దగ్గరగా ఉంటుంది. ఇరువురూ చాలా కాలం రైతాంగ పోరాటాలకి నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. అలాగే ప్రజా విముక్తి గొంతుకలకి స్థానం కల్పించడం కోసం హుంకార్, లోక్ సంగ్రహ వంటి విప్లవాత్మక పత్రికలు స్థాపించి నడిపారు. ' గీతా హృదయ్ ' వంటి ఎన్నో ఆధ్యాత్మిక రచనలు కూడా చేశారు. మతాన్ని పూర్తిగా వ్యక్తిగత వ్యవహారంగా ప్రకటించిన స్వామీజీ, మత చాందస వాదాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. తన రచనల్లో కార్ల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ల గురించి కూడా రాసిన స్వామీజీ ఫాసిజాన్ని నిర్ద్వందంగా ఖండించారు.

'ఆలిండియా కిసాన్ సభ ' మొదలుకుని ఆరోజు ప్రధానంగా రైతాంగ పోరాటాలకి రూపాన్నిచ్చిన వ్యక్తి సహజానంద సరస్వతి. అప్పట్లో భూమిహార్ బ్రాహ్మణుల్ని చులకనగా చూడటం ఉండేది. అలాంటి ప్రాంతంలో ఆయన సాంప్రదాయ బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకించి బీహార్ ప్రాంత 'భూమిహార్ ',ల కోసం 'సీతారామ్ ' ఆశ్రమం స్థాపించారు. దేశంలోనే మొదటిసారి రైతు కూలీ ఉ ద్యమాలను మిలిటెంట్ స్థాయిలో నిర్మించారు. జమీందారీ విధానం రద్దు కోసం

ఎన్నో పోరాటాలు చేశారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా ఘాజీపూర్, వారణాసి, ఫైజాబాద్, లక్నో, బక్సర్, హాజరీభాగ్ మొదలైన జైళ్లలో ఎన్నో ఏళ్ళు గడిపారు. మహాత్మా గాంధీని అభిమానించినా గుడ్డిగా ఆయన భావాల్ని సమర్థించలేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్ట్, జనతాదళ్...ఏ రాజకీయ పార్టీకి బాకాలూదలేదు. ఏ పార్టీ లోనూ చేరలేదు. " వై ఐయాం నాట్ ఇన్ ఎనీ పొలిటికల్ పార్టీ " అంటూ ప్రజలకి వివరణ ఇచ్చారు. తాను ప్రజాపక్షమే కానీ పార్టీల పక్షం కానని ఎలుగెత్తి చాటారు.

ఇదంతా ఒకెత్తయితే ఈ దేశంలో భూమి సమస్యని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి స్వామీజీ చేసిన అసాధారణ కృషి, అసామాన్య అధ్యయనం ఒకెత్తు. " భూమిని జాతీయం చేయాలని " డిమాండ్ చేసిన మొట్టమొదటి వ్యక్తి స్వామి సహజానంద సరస్వతి అంటారు. అంతకుముందు భూమి సమస్య గురించి అంతటి స్పష్టమైన వైఖరి ఏ ఉద్యమ సంఘానికి లేదు. అంతే కాదు, ఈ దేశంలో భూమి సమస్య కుల సమస్యతో ముడిపడి ఉందని గుర్తించారు కనుకనే సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం కోసం అహర్నిశలు తపించారు. మతం ఆధారంగా కాకుండా మానవత ప్రాతిపదికగా నిరుపేదలకు, బహుజనులకు భూమి పై హక్కు ఉండాలని పోరాడారు. ఈనాటికి కూడా వివిధ రాజకీయ సమీకరణల నేపథ్యంలో ప్రత్యామ్నాయ తరహా ఆలోచనా ధోరణి బీహార్ ప్రాంతంలో కొద్దోగొప్పో ఇంకా నెలకొని ఉందని అంటే దానికి స్వామీజీ వంటి వారి చైతన్యశీల వ్యక్తిత్వము, కృషే కారణం. అసలైన ఆధ్యాత్మిక మార్గం ప్రజా సంక్షేమమేనని నమ్మిన సిసలైన సామ్యవాది సహజానంద సరస్వతి.

భావజాల రంగంలో సైతం స్వామీజీ చేసిన అసాధారణ కృషిని గుర్తించాల్సి ఉంది. పౌర సమాజం సమైక్యతను పరిరక్షించే దిశగా హిందీలో విస్తృతమైన రచనా వ్యాసంగం చేశారు. దేశమంతా అవిశ్రాంతంగా తిరిగారు. తన మీద వస్తున్న ఎన్నో విమర్శల్ని పట్టించుకోకుండా అటు నంబూద్రిపాద్ మొదలు, ఇటు ఎన్.జీ. రంగా వరకూ ఎంతోమంది మేధావుల తో కలిసి పని చేసారు. విశేషమైన అనేక రైతు సంఘాల్ని ప్రతీ ప్రాంతంలోనూ నిర్మించారు. ఆధ్యాత్మిక సాంఘిక రంగాల్లో స్వామి

దయానంద సరస్వతి, స్వామి వివేకానంద చేసిన కృషిని రాజకీయ, సామాజిక రంగంలో సహజానంద సరస్వతి చేశారని బుద్ధిజీవుల అభిప్రాయం. ఎందుకంటే, సన్యాసి జీవితం గడుపుతూ దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటాలకి నాయకత్వం వహించిన ఏకైక వ్యక్తి నాటికి నేటికీ సహజానందా సరస్వతి ఒక్కరే. అందుకే ఈరోజుకీ బీహార్లో రాజకీయాలకు అతీతంగా ప్రతీ పార్టీ కూడా సహజానంద సరస్వతి జయంతి, వర్ధంతులు జరుపుతారు.

' మేరి జీవన్ సంఘర్ష్ ' పేరిట ఆయన రాసిన ఆత్మకథను, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఇంగ్లీషులో 400 పుటలకు పైగా అనువదించి ' ది స్ట్రగుల్ ఆఫ్ మై లైఫ్ ' పేరిట రామచంద్ర ప్రదాన్ సంపాదకత్వంలో ప్రచురించింది. నాటి సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక సమస్యల్ని చిత్రించిన దృశ్య చిత్రమది. ఒక సన్యాసిగా సనాతన ధర్మాన్ని సైతం అధిగమించి సంపూర్ణ మహా మానవతావాదిగా వికసించిన ఉత్కృష్టమైన వ్యక్తి స్వామి సహజానంద సరస్వతి. అసంఖ్యాకంగా ఆయన జీవితం కోసం పరిశోధించిన వారున్నారు. పదుల సంఖ్యలో ఆయన రాసిన రచనలే కాక, ఆయన గురించి విస్తారంగా రాసిన వాళ్ళూ ఉన్నారు. అమెరికాలోని వర్జెలియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వాల్టర్ హ్యూసర్ అప్పట్లో స్వామీజీ జీవితం, కృషి కోసం ఎంతో పరిశోధన జరిపారు. ఈ మధ్యనే ఆశ్రమం నుండి తీసుకెళ్లిన సుమారు 200 కేజీల, ఐదు పెట్టెల పరిశోధనా పత్రాలను, స్వామీజీ అముద్రిత రచనల్ని బీహార్ మంత్రుల సమక్షంలో మళ్ళీ తిరిగి అప్పగించారు. వాటి పై పరిశోధన ఇంకా జరగాల్సి ఉంది.

ఆధ్యాత్మిక వాదిగా, రైతాంగ ఉద్యమ నేతగా, ప్రజాపోరాట యోధునిగా, పాత్రికేయుడిగా, విస్తృత యాత్రికుడిగా, భావజాలరంగ ప్రచారకుడిగా, లౌకికవాద తత్వవేత్తగా, ప్రజాభిప్రాయ పరిపాలకుడిగా ఎన్నో పాత్రలు పోషించిన స్వామి సహజానంద సరస్వతి ఈ దేశంలో అసమానతలు రద్దై ప్రజలంతా కలిసి మెలిసి సమానంగా జీవించాలని ఆశించిన మహోన్నత ఆధ్యాత్మిక సామ్యవాది. క్రియాశీల సత్యాన్వేషి. A True Spiritual Socialist. దురదృష్టవశాత్తూ ఇంతటి గొప్ప వ్యక్తి గురించి తెలిసిన వారు దేశంలోనే అత్యంత తక్కువ. ఉత్తర భారతంలోనే

అంతంతమాత్రం. కుల, మతాతీత మానవీయ విలువలను మానవాళి లో పెంపొందించడానికి చివరి వరకూ తపించి జూన్ 26, 1950 న మరణించారు. చేతిలో ఎప్పుడు కర్రతో కనిపించే ఆయన్ని ' లాఠీ స్వామి ' అనీ, ' కర్ర స్వామి ' అని కూడా ప్రజలు ప్రేమగా పిలుస్తుండేవారు. దేశవ్యాప్తంగా విద్వేష గాలులు బలంగా వీస్తున్న ఈ సమయంలో ఆధ్యాత్మికత అంతస్సారం అందరినీ ప్రేమించడమేనని, అదే సకల మతాల సారమని ప్రబోధించిన స్వామి సహజానంద స్ఫూర్తిని పునర్నిర్మించుకోవడం ఈనాటి తక్షణ అవసరం.

(జూన్ 26 స్వామి సహజానంద సరస్వతి 75 వ వర్ధంతి.)

అనగనగా....ఓ పగటికల - గిజుభాయ్ !

(ఒక దార్శనిక స్వాప్నికుడి పరిచయం.)



కొద్దో గొప్పో సామాజిక స్పృహ కలిగి ఉన్న వారిలో కూడా పిల్లల మార్కులు గురించిన పిచ్చి, ర్యాంకుల కోసం వెర్రి ఎంతలా ఉంటుందో తెలుసు. మనిషి విలువ చిన్నప్పుడు మార్కుల అంకెలకి, పెద్దయ్యాక జీతపు సంఖ్యలకు బానిసయ్యే క్రమమే ఈ రోజు చూస్తున్నాం. అలాంటి చోట వొచ్చిన మంచి ప్రయత్నం అనగనగా అనే సినిమా. ఈ మధ్య కాలంలో వొచ్చిన ఒక హృద్యమైన కథ. నిజానికి ఇది కథ కాదు. నిజ జీవితం, ఎవరిదంటారా ?

మనిషి జీవితానికి ప్రమాణం అనుభవాలే కానీ అంకెలు కాదు. పిల్లల బతుక్కి

అర్ధం సంతోషమేకానీ సంపాదన కాదు. అది గ్రహించని వ్యవస్థ బట్టీ చదువులు, బండపాఠాల తో బాల్యాన్ని ఖూనీ చేస్తూ అదే " భవిషత్తు " అనే భ్రమ లో ఉ ంది.పిల్లల పట్ల సమాజం సమష్టిగా చేస్తున్న నేరం ఇది. దీనిని సుమారు వందేళ్ల క్రితం చెప్పిన వ్యక్తి, " గిజుభాయ్ బదేక ".మొట్ట మొదటిసారిగా భారతదేశంలో మాంటిసరి విద్యావిధానం పరిచయం చేసిన మహావ్యక్తి.

ఎన్నో అవహేళనలు,అవమానాలు ఎదుర్కొని కూడా పిల్లలకు కథలు, కళల ద్వారా మంచి విద్యని అందించే ప్రయత్నం చేసిన మేధావి. మహాత్మా గాంధీ చేత " మీసాల అమ్మ " గా బిరుదు పొందిన ప్రయోగ శీలి. గుజరాత్లో పుట్టి అంతర్జాతీయ స్థాయిలో మానవీయ కోణంలో బోధనా విధానాన్ని రూపొందించిన దార్శనికుడు. క్లుప్తంగా చెప్పాలంటే, బాల్యాన్ని కోల్పోకుండా ప్రతీ తరం ప్రజాతంత్రంగా అనుసరించాల్సిన బుద్ధిజీవి గిజుభాయ్.

మామూలుగా పిల్లలకు మహా ఐతే టీచర్లకు మాత్రమే ఏవో సలహాలు చెప్పడం, లేదా ప్రభుత్వాన్ని విమర్శించడం ఇంత వరకు ప్రతి విద్యావేత్త చేస్తాడు. కానీ గిజుభాయ్ అధ్యాపకులకు, తల్లితండ్రులకు, పాలకులకు, పిల్లలకు అందరికి అభిమానంగా వారివారి ఆచరణను అర్ధవంతంగా పరిచయం చేసి, ఎంత దార్శనికంగా ఉండవొచ్చు అనే విషయం స్పష్టం చేసిన అరుదైన అన్వేషి గిజుభాయ్ మాత్రమే.

తెలుగులో కూడా గిజుభాయ్ రచనలు మనకి అందుబాటులో ఉన్నాయి. అనగనగా సినిమా ఎలాగో చూస్తారు సరే కానీ, గిజుభాయ్ గురించి, ఆయన జీవితం గురించి, ఎన్నడో టాటా ట్రస్ట్ తీసిన చిన్ని సినిమా The Temple On the Hill. గిజుభాయ్ స్థాపించిన దక్షిణామూర్తి స్కూల్ పరిచయం. యూట్యూబ్ లో ఉ ంది చూడండి. దాదాపు 200 వరకు రచనలు చేసిన ఆయన ప్రసిద్ధ పుస్తకం మాత్రం "దివాస్వప్న". HBT ప్రచురణగా నాలుగు దశాబ్దాల క్రితం తెలుగులో వొచ్చింది. ఇంకా ప్రజాశక్తి ఇతర పుస్తకాలు ప్రచురించింది.

(అనగనగా...అనే తెలుగు సినిమాని పరిచయం చేసే ఉద్దేశంతో FB లో రాసిన గీజుభాయ్ గురించిన చిన్న వ్యాసం.)

ప్రత్యామ్నాయ రంగస్థల ప్రవక్త



భారతీయ నాటక రంగాన్ని భూమార్గం పట్టించిన సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణాలు కాదనీ, జనజీవన విధానాలని నమ్మిన బాదల్ సర్కార్, అభినయాన్ని సాధారణీకరించాడు. రంగస్థలాన్ని మానవీకరించాడు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించాడు. అసమాన గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించాడు. ఆ క్రమంలోనే, కొంతమంది ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితం చేయబడ్డ రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచాడు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని

పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంత్ర స్వరంగా నాటకాన్ని మార్చాడు. ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశాడు. మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కూలీన వర్గానికి మాత్రమే పరిమితమైన ఆధునిక నాటకాన్ని రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం "మూడో రంగస్థలం " (థర్డ్ థియేటర్) సృష్టించడం ఒక్క భారతీయ నాటకంలోనే కాదు. ప్రపంచ నాటక చరిత్రలోనే బాదల్ సర్కార్ సాధించిన చారిత్రక విజయం. అందుకే యావత్ జగత్ రంగస్థలం ఆయన్ని " ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్" (తృతీయ రంగస్థల పితామహుడు) గా ముక్తకంఠంతో గౌరవిస్తుంది.

జూలై 15, 1925 న కోల్కతాలో సుధీంద్ర సర్కార్ గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివాడు. ఇంగ్లాండ్, నైజీరియా వంటి దేశాలు మొదలుకొని ఎన్నో చోట్ల ఉద్యోగాలు చేశాడు. నాటకం పట్ల ప్రేమతో యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని నిరూపించిన వాడు. అందుకే, నాటక ప్రదర్శనకి సరికొత్త నిర్వచనం ఇచ్చాడు. మడి కట్టుకుని కూర్చున్న "నాటకాన్ని" ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా " వీధి నాటకాన్ని " నిర్మించాడు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే చాంతాడంత స్క్రిప్టులు, స్టేజి, లైటింగ్, సెటప్పులు, నటులు, మేకప్పులు, గంటలకొద్దీ సాగే కథనం కాదని, నాటకం నిరంతర చైతన్య ప్రవాహమని చాటాడు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచాడు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచాడు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే.

బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. కళ పీడిత ప్రజల సమస్యలకు

శాస్త్రీయ పరిష్కారాలు చూపాలి. నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి ధీటుగా జవాబిస్తూ, " ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం " అంటాడు బాదల్ సర్కార్.నక్సల్బరి ప్రభావంతో సగటు బెంగాల్ యువతరం యొక్క సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశాడు. ' అవర్ స్ట్రీట్ థియేటర్ ' (మన వీధి నాటకం) పేరుతో పుస్తకం కూడా రాసిన బాదల్ సర్కార్, పాలకుల నిర్బంధంలో వీధినాటకం, " గెరిల్లా నాటకం "గా రూపాంతరం చెందుతుందంటాడు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజానాటకం మరింత బలోపేతం కావాలంటాడు. కళా తాత్వికతను పునర్నిర్వచించిన బాదల్ సర్కార్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద "ప్రదర్శన" కాదని, అది వ్యవస్థలోని నిజాలను " నిదర్శనం " గా చూపే శక్తివంతమైన వాహకమని చాటాడు.

అందుకు అనుగుణంగానే చివరివరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల తరబడి దేశంలో ప్రత్యామ్నాయ కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్, ఏనాడు పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వందంగా తిరస్కరించాడు. తీసుకున్న పురస్కారాలు కూడా ఎందుకు స్వీకరించవలసి వచ్చిందో అనేక ఇంటర్వ్యూలలో స్పష్టంగా వెల్లడించాడు. 1967లో ' శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల గోడా, స్పార్టకస్, బోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రాసాడు.వీటిల్లో అనేకం ఇతర భాషల్లోకి అనువాదమై ఎన్నో ప్రశంసలు పొందాయి. బాదల్ ప్రభావంతో తెలుగులో కూడా ఎన్నో నాటకాలు వొచ్చాయి. నాలుగ్గోడల నడుమ జరిగే నాటక ప్రదర్శనలని ఆ ప్రాంగణాల నుండి విముక్తి చేసి, బెంగాల్లోని మారుమూల కార్మిక వాడలు, గ్రామీణప్రాంతాలు మొదలుకుని నలుగురు

గుమిగూడె అన్ని ప్రదేశాలకు కళను విస్తారంగా తరలించిన బాదల్ సర్కార్, దేశ వ్యాప్తంగా ఎందరో క్రియాశీలక రంగస్థల కార్యకర్తలను తయారు చేశాడు.

అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజం పై వెనువెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రేరకాలే. అదక్కడితో ఆగలేదు, అటు ఆదివాసి దళిత బహుజన సాంస్కృతిక సంస్థల నుండి,ఇటు ప్రగతిశీల మహిళా, గాంధేయవాద, సోషలిస్టు, వామపక్ష శక్తుల వరకు ప్రతి ప్రజాసంఘము వీధి నాటకాన్ని, భావజాల ప్రచార పనిముట్టుగా ఆశ్రయించాల్సి రావడం, బాదల్ సర్కార్ భావోద్యమాలలో సాధించిన అరుదైన విజయం. ప్రత్యామ్నాయ కళా రూపకంగా వీధి నాటకానికి మాత్రమే దక్కిన అపూర్వ గౌరవం.

నిబద్ధత కలిగిన కళాకారుడిగా బాదల్ సర్కార్ ని నాటక కళా జగత్తులో చిరస్థాయిగా నిలిపే ఆవిష్కరణగా వీధి నాటకం నిలిచిపోతుంది. తర్వాత కాలంలో ఆ వీధి నాటక చైతన్యానికి భయపడ్డ ఆధిపత్య శక్తులు ఏకంగా దాడులు, హత్యలకు కూడా తెగబడ్డాయి. సఫ్దార్ హష్మీ వంటి కళా యోధుడిని సైతం వందలాది మంది బహిరంగంగా చూస్తుండగానే పొట్టన పెట్టుకున్నాయి. అయినా, సాంస్కృతిక కార్యాచరణ ఆగలేదు. ప్రత్యామ్నాయ రంగస్థలం ఎన్నడూ వెనుకంజ వేయలేదు. పైగా అనూహ్యమైన రూపాల్లో, మరింత సారవంతంగా నిలదొక్కుకుంది. ప్రజాసంఘాల నుండి ప్రతి రాజకీయ సామాజిక ఆధ్యాత్మిక సాంస్కృతిక స్రవంతికి భావజాల ప్రచారానికి భరోసానిచ్చే దిక్సూచిగా మారింది. కాకపోతే,

మారుతున్న డిజిటల్ యుగంలో మార్కెట్ మాయాజాలం వల్ల ప్రజాసాంస్కృతిక శక్తులు బలహీన పడ్డ మాట వాస్తవం. అయినప్పటికీ ఇది తాత్కాలికమే. ఎందుకంటే, నాటకం అంటే జీవితం. ప్రజా రంగస్థలం ప్రత్యక్ష రూపకం. ప్రత్యామ్నాయ నాటకం ప్రజాచైతన్య పూరకం. మనిషి జీవితానికి సంబంధించిన ఉన్నత విలువల్ని ప్రమాణీకరించేది నాటకం. అది అనాదిగా అభివృద్ధి చెందుతున్న మానవాళి అభివ్యక్తికి ఆదర్శాత్మక చిహ్నం.

అందుకనే, ఏ కళాకారుడికి దక్కని అరుదైన రీతిలో, సాంస్కృతిక రంగంలో అలుపెరుగని కృషి చేసిన బాదల్ సర్కార్ 85 వ జన్మదినం సందర్భంగా 2009లో పలు సంస్థలు " బాదల్ ఉత్సవ్ " పేరిట ఐదు రోజులపాటు సాంస్కృతిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించాయి. బాదల్ కోసం ఎన్నో పుస్తకాలు ప్రచురించాయి.మరెన్నో సినిమాలు కూడా రూపొందాయి. 1995 లో ప్రత్యామ్నాయ సాంస్కృతిక రంగస్థల సంస్థలు సమిష్టిగా కోల్కతాలో ఫుట్పాత్ మీద జరిపిన నాటకాల ప్రదర్శన (థియేటర్ ఫెస్టివల్) చరిత్ర తో "థర్డ్ థియేటర్ " పేరిట డాక్యుమెంటరీ చిత్రం కూడా రూపొందింది. కళాకారుడిగా, ప్రయోక్తగా, రచయితగా, సాంస్కృతిక కార్యకర్తగా, నిత్య చైతన్యశీలిగా జీవితాంతం బతికిన బాదల్ సర్కార్ 2011, మే 11 న కేన్సర్ తో పోరాడి చనిపోయాడు. భారతీయ రంగస్థల చరిత్రలో మహత్తరమైన మార్పుకి సారధ్యం వహించిన ప్రజాపక్ష మేధావిగా, క్షేత్రస్థాయి బుద్ధిజీవి గా బాదల్ సర్కార్ శాశ్వతంగా నిలిచిపోతాడు. ఆయన దిశానిర్దేశం చేసిన ప్రత్యామ్నాయ రంగస్థలాన్నీ, అందులో ప్రధానమైన వీధి నాటకాన్ని మరింత బలోపేతం చేసుకుని సారవంతమైన సమసమాజ నిర్మాణం దిశగా మునుముందుకు సాగడమే బాదల్ సర్కార్ ఆశయ స్ఫూర్తికి భవిష్యత్ తరాలుగా మనం ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన నివాళి.

(జూలై 15 బాదల్ సర్కార్ శతజయంతి.)

ఓ అద్వితీయ కులనిర్మూలన తత్వవేత్త!!!
సత్యశోధక్ కమ్యూనిస్టుపార్టీ స్థాపకుడు!!
సత్యాన్వేషణే సామ్యవాదం:శరద్ పాటిల్!

మార్క్సిజాన్ని, ఫూలే అంబేద్కర్ దృక్పథంతో సమన్వయం చేసిన తొలి కమ్యూనిస్టు మేధావి శరద్ పాటిల్. భారతీయ సంస్కృతి లోని కుల అసమానతల్ని చారిత్రక దృష్టితో అధ్యయనం చేసిన మొదటి బుద్ధిజీవి. భారతదేశంలోనే కాదు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అనూహ్యంగా, సత్యాన్ని అన్వేషించడమే కమ్యూనిస్టు మౌలిక లక్ష్యం అని ప్రకటిస్తూ, అందుకోసం దశాబ్దాల చరిత్ర కలిగిన

పార్టీ నుండి బయటికి వచ్చి ఏకంగా, " సత్యశోధక్ కమ్యూనిస్టు పార్టీ" స్థాపించిన ధీశాలి శరద్ పాటిల్. జ్యోతిబా ఫూలే తాత్వికతను, హేతు జిజ్ఞాసనూ ప్రతి తరంలోనూ కొనసాగించాల్సిన అవసరాన్ని చాటిచెప్పిన వాడు.అంబేద్కరిజం లేని మార్క్సిజం అసంపూర్ణం అంటూ దేశ వ్యాప్తంగా ఆరోగ్యకర చర్చను నిర్మించిన వ్యక్తి. బౌద్ధం మొదలుకుని భక్తి ఉద్యమాల వరకూ ప్రాచీన,ఆధునిక భారతీయ సామాజిక చరిత్ర మూలాలలోకి వెళ్ళి ఔపోసన పట్టిన పండితుడు. సంస్కృత, పాళీ, మాగధీ వంటి భాషా సాహిత్యాల్ని లోతుగా అధ్యయనం చేసిన ఏకైక కుల నిర్మూలన తత్వవేత్త శరద్ పాటిల్.

1925,సెప్టెంబరు 17న మహారాష్ట్రలోని ధులే అనే ఊర్లో పుట్టిన పాటిల్ బరోడాలోని కళాభవన్ లో, ముంబై లోని ప్రఖ్యాత జె జె స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో చిత్రకళ అభ్యసించాడు.రెండో ప్రపంచ యుద్ధం నాటికి విద్యార్థి ఉద్యమాల ద్వారా కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చాలాకాలం పూర్తిస్థాయి కార్యకర్తగా ఉన్న ఆయన, " కుల సమస్య " గురించి పార్టీ పంథాతో సైద్ధాంతికంగా విభేదించి బయటికి వచ్చాడు. 1978లో అంటే సుమారు 50 యేళ్ల క్రితమే " సత్యశోధక కమ్యూనిస్టు పార్టీ" స్థాపించి ప్రకంపనలు సృష్టించాడు. దాస – శూద్ర బానిసత్వం గురించి అరుదైన పరిశోధన చేశాడు. ప్రముఖ చరిత్రకారులు రోమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్, డా. ధర్మేంద్రనాథ్ శాస్త్రి,రేగే వంటి మహామహులు ఆయన రాసిన ఈ శోధనను ప్రశంసించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కుల అంశాన్ని ప్రస్తావించి దానిపై లోతైన చర్చ జరిగేట్టు చేసిన వారిలో మొదటి వ్యక్తి శరద్ పాటిల్. అంతే కాదు, జీవితాంతం కుల, వర్గ జమిలి పోరాటాల సమ్మేళనానికి సైద్ధాంతిక పునాది వేసిన మహావ్యక్తి. ట్రేడ్ యూనియన్ రాజకీయాల నుండి రైతాంగ పోరాటాల దాకా క్షేత్రస్థాయిలో పాల్గొని, అన్నిరకాల ప్రతీఘాత శక్తుల్ని భావజాలపరంగా కూడా బలహీన పర్చిన యోధుడు. ఆస్తిక, నాస్తిక దర్శనాల్లో పాటిల్ చేసిన కృషి ఎప్పటికీ అద్వితీయమైందని అనేకమంది ప్రముఖులు పేర్కొంటారు.

"నేను ప్రస్తావించిన బ్రాహ్మణేతర మూడవ ప్రత్యామ్నాయం ఐలయ్యకు చెందిన

ఆంధ్ర దేశంలో ప్రారంభమైంది. డా. కె. బి. కృష్ణ ఈ శాఖ కు గురుతుల్యుడు. నేను ఈ మూడవ శాఖకు చెందినవాడ్ని.. ఫూలే, అంబేద్కర్ ఆలోచనా ధోరణుల ప్రభావం ఈ మేధావి పై లేదు. వీరు భారతీయ చరిత్రను, తత్వ శాస్త్రాన్ని బ్రాహ్మణేతర మార్క్సిస్టు దృష్టి నుండి పరిశీలించారు... డా. కె. బి. కృష్ణ జీవించింది 50 యేళ్లు మాత్రమే. ఆయన సాధించిన విజయాలు మాత్రం దిగ్భ్రాంతిని కలిగిస్తాయి." అంటారు శరద్ పాటిల్ ' భారత ప్రజాతంత్ర విప్లవ సమస్యలు ' అనే వ్యాసంలో. ఒక తిరుగులేని కమ్యూనిస్టు మేధావిగా దశాబ్దాల చరిత్ర కలిగిన వ్యక్తి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నదగిన రచయిత, విస్మరించ బడ్డ ఒక తెలుగు బుద్ధిజీవిని తన గురువుగా ప్రకటించడమే కాక, డా. కె. బి. కృష్ణ ను "Father Of Marxist Indology" (మార్క్సిస్టు ఇండొలోజీ పితామహుడు) గా కూడా పేర్కోవడం గమనార్హం. ఒక నిఖార్పైన సత్యాన్వేషికి మాత్రమే సాధ్యమయ్యే దృక్పథం ఇది. నిబద్ధత కలిగిన ఆలోచనా పరుడు మాత్రమే చేయగల ప్రకటన అది. శరద్ పాటిల్ మేధో నీతికి అద్దంపట్టే సంఘటన ఇది.

భారతీయ తాత్విక చరిత్రలో ఎన్నో విస్మరిత విషయాల్ని మార్క్సిస్టు దృష్టితో పరిశోధించిన వ్యక్తిగా డా. కె. బి. కృష్ణ చిరస్మరణీయుడు. లోతైన అవగాహన కలిగిన వారికే కానీ ఎక్కువమందికి ఆయన కృషి తెలీదు. అలాంటిది తెలుగు మేధావి టి. రవిచంద్ ద్వారా కృష్ణ గారి కోసం తెలుసుకుని, ఆయన రచనలు అధ్యయనం చేసి, అవి, కులనిర్మూలన ఉద్యమానికి నేతృత్వం వహించగలవని ధైర్యంగా ప్రకటించ గలిగాడు శరద్ పాటిల్. అందుకనే ఆయా వివరాలతో 30 ఏళ్ల క్రితం, 1996 లో ' మెయిన్ స్ట్రీమ్ ' పత్రికలో, " ప్రాబ్లమ్స్ ఆఫ్ ఇండియన్ డెమొక్రటిక్ రెవల్యూషన్ " అని శరద్ పాటిల్ రాసిన అరుదైన విశ్లేషణా వ్యాసాన్ని మార్క్సిస్టు మేధావి కే. శె. ఏటుకూరి బలరామమూర్తి గారి చేత తెలుగు చేయించి 'మిళింద ప్రచురణలు ' అదే ఏడాది ప్రచురించింది. అంతేకాదు, డా. బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనా స్రవంతిని ఈ దేశం లోని కమ్యూనిస్టు పార్టీలు అనుసంధానం చేసుకోవాల్సిన అవసరాన్ని దేశం నలువైపులా స్వయంగా వెళ్ళి క్షేత్రస్థాయిలో ప్రచారం చేసిన మొదటి వ్యక్తి శరద్ పాటిల్. అందులో భాగంగా ఆయన తెలుగు

రాష్ట్రాలు సైతం పర్యటించి, అనేకచోట్ల ప్రసంగించాడు.

శరద్ పాటిల్ ప్రవేశపెట్టిన చారిత్రక గతితార్కిక బహుజన దృక్పథం భారత ప్రజాతంత్ర విప్లవానికి ఒక నూతన ఒరవడిని అందించింది. అబ్రాహ్మణ దర్శనాలు, బ్రాహ్మణేతర తాత్విక ధోరణులపట్ల చింతనాత్మక వైఖరిని నిర్మించింది. 1987లో ఆయన విడుదల చేసిన ' అబ్రహ్మణ సాహిత్య, కళా సృజన మేనిఫెస్టో.' ఒక సంచలనం. అప్పటి వరకూ బూర్జువా మేధావని, బ్రిటీష్ ఏజెంట్ అని రకరకాలుగా అంబేద్కర్ను, పూలేను విమర్శించిన వివిధ వామపక్ష శ్రేణుల భ్రమల్ని శరద్ పాటిల్ ప్రవేశపెట్టిన శాస్త్రీయ సిద్ధాంతం పటాపంచలు చేసింది. బుద్ధుడు, ఫూలే, అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని మినహాయిస్తే ఈ దేశంలో ఇక కమ్యూనిజం పేరిట చేసేది ఏదీ ఉండదని కుండబద్దలు కొట్టాడు శరద్ పాటిల్. సైద్ధాంతికంగా తన వాదాన్ని నిలిపేందుకు రచనా వ్యాసంగాన్ని బలమైన మాధ్యమంగా చేసుకున్నాడు. ' సత్యశోధక్ మార్క్సిస్టు ' అనే మరాఠీ పత్రికతో పాటూ, " దళిత ఆదివాసి గ్రామీణ సాహిత్య సభ " అనే సంస్థ కూడా స్తాపించి భావజాల రంగంలో అవిరామమైన కృషి చేసిన శరద్ పాటిల్ 89 సంవత్సరాల వయసులో ఏప్రిల్ 13, 2014 న మరణించాడు.

"అంబేద్కర్ తాను రూపొందించిన" స్టేట్ సోషలిజంలో భూమిని జాతీయం చేయాలని అన్నాడు. తద్వారా తప్ప కులవ్యవస్థను నిర్మూలించడం సాధ్యం కాదు అని చెప్పాడు. అలా కుల సమస్యను అంబేద్కర్ ఎంతో ముందుచూపుగల తాత్విక దశతో తీసుకున్నాడు. అందువల్ల అంబేద్కర్ కేవల భావజాల కర్త కాదు. అతడొక తత్వవేత్త. నేను అతడి ఫిలాసఫీని 'సామ్యవాద గతితార్కిక వాస్తవికతా వాదంగా ' పేర్కొంటున్నాను. ఫూలేయిజమ్, అంబేద్కరిజమ్ అనేవి మార్క్సిజంతో సమానంగా తాత్విక భూమికను కలిగి ఉన్నాయి..." గతితర్కం, అంబేద్కరిజం, మార్క్సిజం పేరిట తెలుగులో ప్రచురించిన వ్యాస సంకలనంలో నాడు శరద్ పాటిల్ రాసిన మాటలివి. బి. ఎస్. రాములు అనువాదం చేసిన 22 పుటల ' అంబేద్కరిజం – మార్క్సిజం ' అనే ఆ రచన కులవర్గ పోరాటాల చరిత్రను అధ్యయనం చేసే ప్రతి ఒక్కరూ చదివి తీరాలి. మొత్తం దేశంలోని వామపక్షపార్టీల ఉద్యమ

చరిత్ర,పరిణామాన్ని హేతుబద్ధంగా విశ్లేషించిన శరద్ పాటిల్, ఈ దేశపు సామాజిక మార్పుకి అనివార్యంగా అనుసరించాల్సిన సిసలైన మార్గాలని నిర్దేశించాడు. ఆ సైద్ధాంతిక స్పష్టత వల్లనే చివరి వరకూ కులనిర్మూలన వాదానికి కట్టుబడిన కమ్యూనిస్టుగా బతికాడు.

అంతటి అసాధారణ వ్యక్తి కనుకనే, వివేచన కలిగిన ప్రతిచోటా ఆయన ఆలోచన బీజాలు తలెత్తుతున్నాయి. సిద్ధాంతాల్ని పిడివాదాలుగా కాకుండా విముక్తి సాధనాలుగా అర్థం చేసుకునే తరాలు ప్రశ్నిస్తున్నాయి. " సత్యాన్ని సత్యంగా, అసత్యాన్ని అసత్యంగా స్వీకరించి మాత్రమే అన్వేషించమనే " బుద్ధుని ఉపదేశాన్ని మనసు,బుద్ధి సవ్యంగా ఉన్న అన్ని స్రవంతులు ఈరోజు పాటించడానికి సమాయత్తమవుతున్నాయి. ముఖ్యంగా, "సౌతాంత్రిక మార్క్సిస్టు గా శరద్ పాటిల్ ప్రవేశపెట్టిన ఫూలే, అంబేద్కర్ దృక్పథం " అనే అంశం గురించి గతేడాది బెంగాల్లో, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్, విశ్వభారతి విశ్వవిద్యాలయం ఒకరోజు అంతర్జాతీయ సమాలోచన సమావేశం కూడా నిర్వహించింది. సౌతాంత్రిక బౌద్ధం ఓ ప్రత్యేక మార్గం. ఆ ఒరవడిని మార్క్సిజంతో మిళితం చేసిన సామాజిక శాస్త్రవేత్త పాటిల్. అందుకనే, ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖ ఆలోచనాపరులు శరద్ పాటిల్ జీవితం, చేసిన అరుదైన కృషి కోసం లోతుగా చర్చిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు శరద్ పాటిల్ శ్రమించి అందించిన ప్రాచీన భారత సమాజం, ఉత్పత్తి వ్యవస్థ, భావజాల రంగ పరిణామాల గురించిన పరిశోధనలను మరింత లోతుగా, సారవంతంగా అధ్యయనం చేయాలనే ప్రతిపాదనలు పెరుగుతున్నాయి.

అయితే, దురదృష్టవశాత్తూ ఆయన భావజాల స్థాయిని అందుకోగల ఉన్నతికి ఈ దేశంలోని " ప్రధాన స్రవంతి" కమ్యూనిస్టు పార్టీలు కానీ ఫూలే, అంబేద్కరిస్ట్ సంఘాలు కానీ ఇంకా చేరలేదు. అయినప్పటికీ, దేశంలోని పలు చోట్ల భాషలకు, ప్రాంతాలకు అతీతంగా శరద్ పాటిల్ రాసిన రచనలు, చేసిన సంస్థాగత నిర్మాణం దిశగా కొత్త ఆశలు పుడుతున్నాయి. అవకాశవాద రాజకీయాల్ని అధిగమించి నూతన తరహా ప్రత్యామ్నాయ ప్రజాతంత్ర ప్రయత్నాల దిశగా యువత ఆలోచనలు

క్రియాశీలకంగా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా యువతలో ఫూలే అంబేద్కర్ కార్ల్ మార్క్స్ జమిలి పోరాటాల స్ఫూర్తి రోజురోజుకి పెరుగుతోంది. సాధారణ కమ్యూనిస్టు కార్యకర్త నుండి ఒక జర్నలిస్టుగా, రచయితగా, నిరవధిక యాత్రికునిగా, బహుభాషావేత్తగా, చరిత్ర కారునిగా, నిత్య అధ్యయనశీలిగా, కుల నిర్మూలన ఉద్యమకారుడిగా, ప్రత్యామ్నాయ సిద్ధాంతవేత్తగా, అన్నింటినీ మించి అరుదైన సత్యాన్వేషిగా నిత్యం ఒక ధిక్కార కెరటంగా కొత్తదారుల్లో పయనించిన నిజమైన ప్రజానేత శరద్ పాటిల్. ఆయన జీవితాంతం ఆశించిన కులనిర్మూలన దిశగా ఆచరణాత్మక కృషి చేయడమే ఆయనకి మనం ఇవ్వగలిగే ఆశయశీల నివాళి.

(సెప్టెంబర్ 17 శరద్ పాటిల్ శతజయంతి.)

ప్రత్యామ్నాయ సాంస్కృతిక సేనాని !
ఆంటోనియో గ్రాంస్కీ

(ఒక ప్రజాతంత్ర బుద్ధిజీవి ప్రాసంగికత)

1927 లో ఫ్రెంచ్ తాత్వికుడు జూలియన్ బెండా మేధావులు చేసే ద్రోహం కోసం చర్చిస్తూ LA Trahison des Clercs (The Treason Of The Intellectuals) అనే గ్రంథం రాసాడు. సమయం వచ్చినప్పుడు కూడా మన నిరసన ప్రకటించ

కుండా, అసలేమాత్రం స్పందించకుండా మౌనంగా ఉండటం అంటే, జరుగుతున్న అన్యాయానికి పరోక్షంగా మద్దతు తెలపడమే కాగలదు. అలా పాలక పక్షం దుర్మార్గాలను ధైర్యంగా ప్రశ్నించి, రాజ్యం చేసే సాంస్కృతిక దాడికి సంబంధించిన అనేక పాశ్వాల్ని మొట్టమొదటిసారిగా బయట పెట్టి, అందుకు సుమారు రెండు దశాబ్దాల కాలం ఖైదులో మగ్గిపోయి, చెరశాలనే చరిత్ర రచన కేంద్రంగా మల్చుకున్న అద్వితీయ ప్రత్యామ్నాయ ప్రజాతాత్వికుడు ఆంటోనియో గ్రాంస్కీ. మార్క్సిజాన్ని పిడి వాదంగా కాక, ప్రత్యామ్నాయ వైధానిక పద్ధతి (Alternative Methodology) గా అర్ధం చేసుకున్న అతి తక్కువ మంది బుద్ధి జీవుల్లో గ్రాంస్కీ ఒకడు. అతడి మౌలిక అంశం మనిషి, అందుకే సారవంతమైన సమాజాన్ని స్వప్నించగలిగాడు. అర్ధవంతమైన వ్యవస్థకి అక్షరాభ్యాసం చేయగలి గాడు. చనిపోయే కొద్దిరోజుల ముందు పెద్ద కొడుకు డీలియో కి రాసిన చివరి లేఖలోని ఈ వాక్యాలు చూడండి

I am feeling a bit tired and cannot write a lot. Write to me always, and tell me about everything that interests you at school. I think you like history, just as I did when I was your age, because it is about living men. And every thing that is about men, as many men as possible, all the men in the world united among them selves in societies, working and struggling and bettering themselves must please you more than any other thing

ప్రపంచంలోని మెరుగైన సమాజస్థాపన కోసం జరిగే పీడితుల పోరాటాలన్నింటి పక్షం వహించి వాటి గురించి నిక్షిప్తం చేయడమే చరిత్రకి అర్ధం అని నమ్మాడు కనుకే ఇంతటి గొప్ప వాక్యాలు రాయగలిగాడు. నాకు తెలిసీ లోకంలో ఏ తండ్రి కూడా తమ పిల్లలకి ఇంతకంటే ఉన్నతమైన సందేశాన్ని ఇవ్వలేరు. నిజానికి ఇది ఒక్క తన సంతానానికే కాదు, సమస్త మానవాళికీ, తన తదనంతరం గ్రాంస్కీ ఇచ్చిన మహోన్నతమైన సందేశం.

మార్క్సిజాన్ని నిర్మాణాత్మకంగా విమర్శించిన ప్రముఖ అరాచకవాద తత్వవేత్త ప్రౌధాన్ ని మిత్రపూరిత చర్చకు ఆహ్వానిస్తూ మే 5, 1846 న మార్క్స్ లేఖ

రాయగా, దానికి జవాబు లేఖ ఫ్రోధాన్ రాస్తూ "…With all my heart I welcome your idea of exposing all opinions to the light. Let us have decent and sincere polemics. Let us give the world an example of learned and far sighted tolerance. But, simply because we are at the head of a movement do not let ourselves become the leader of a new intolerance, let us not pose as apostles of a new religion even - though this religion be the religion of logic, the religion of reason itself. Let us welcome, let us encourage the protests; let us condemn all exclusions, all mysticisms. But, never let us think of any question as closed, and even we have exhausted our very last argument, let us begin again, if necessary with eloquence and irony. On that condition I shall be delighted to associate with you - but otherwise no." అంటాడు. ఇదెంత వాస్తవిక దృష్టితో రాసిందో అర్థం కావాలంటే తర్వాత 75 ఏళ్ళకు 1917 రష్యా విప్లవాన్ని చిమ్మ చీకట్లో చిక్కటి వెలుగంటూ పొగుడుతూ వర్ణించిన బెట్రాండ్ రస్సెల్, తర్వాత 1920 లో అనధికారికంగా రష్యా చూసొచ్చి, "Bolshevism is not merely a political doctrine; it is also a religion with elaborate dogmas and inspired scriptures." అనడాన్ని అర్థం చేసుకోవాలి.

మార్క్సిజాన్ని కొత్త మతంలా అనుసరించడం అప్పటికే ఎంతగా ముదిరిపోయిందో, దాన్నొక ప్రభావశీలమైన విధానంగా కాక, పిడివాదంగా ఒప్పచెప్పడం ఎంతగా పెచ్చరిల్లిందో చెప్పడానికి శతాబ్దం క్రితం నాటి ఆ బుద్దిజీవి మాటలే ప్రత్యక్ష సాక్ష్యం. సరిగ్గా ఇప్పుడు గ్రాంస్కీ గురించిన చర్చలో ఈ విషయాన్ని ప్రస్తావించడానికి కారణం ఉంది. ఆర్థిక అసమానతలకి మాత్రమే మార్క్సిజాన్ని కుదించిన పరిస్థితుల్లో, ప్రాదేశిక ప్రత్యేకతల్ని పరిగణనలో తీసుకుని మాత్రమే పని చేయాలనే పంథాని భౌతికవాద దృక్పథంతో వినూత్నమైన రీతిలో ప్రతిపాదించిన మేధావి గ్రాంస్కీ. ముఖ్యంగా,భారతీయ సమాజంలో నెలకొన్న సాంస్కృతిక అస్తిత్వాలకి కులం ఒక బలమైన చోదక శక్తిగా ఉంది. ఇక్కడ సాంస్కృతిక పరాయీకరణ కులంతో ముడిపడి ఉంది. దానిని మొదట గుర్తించడం

అవసరం. ఈ అంశానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఈసరికే తేరుకోలేని తప్పు అభ్యుదయ శక్తులు చేసాయి. కాన, ఇకనైనా సాంస్కృతిక సామ్రాజ్యవాదం ఎంత ప్రమాదమో గుర్తించడం అవసరం అని నా అభిప్రాయం.

సరిగ్గా ఇక్కడే మనకి గ్రాంస్కీ తాత్వికతని అధ్యయనం చేయడం ఎంత ముఖ్యమో అర్థం అవుతుంది. ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ అనేది పుట్టడానికి వందేళ్ళకు ముందే అనేక ఆధిపత్య వ్యతిరేక పోరాటాలు జరిగాయి. మొట్టమొదటి తెలుగు నిఘంటు నిర్మాణ కర్తగా పేరొందిన మామిడి వెంకయ్య వంటి వాళ్ళు చేసిన పోరాటాలు ఏకంగా ఇంగ్లాండు ప్రివీ కౌన్సిల్ వరకూ వెళ్ళొచ్చాయనే విషయం మరువరాదు. కులం పేరిట అంతటి భయంకరమైన దడుల్ని కట్టుకున్న వ్యవస్థలో సమానత్వం కోసం జరిగే ప్రయత్నాలు కచ్చితంగా సంస్కృతిని అధ్యయనం చేయడం వలనే జరుగుతాయనే ప్రాథమిక గ్రహింపు అవసరం. ఆ గ్రహింపుతోనే వందేళ్ళ క్రితం సాంస్కృతిక సంఘంగా ప్రారంభం అయిన మతోన్మాద ఆరెస్సెస్, ఈరోజు దేశంలో అధికారంలో ఉండగా, రాజకీయార్థిక సిద్ధాంతంగా మాత్రమే అర్థం చేసుకోబడిన మార్క్సిజం భారతీయ సాంస్కృతిక మూలాల్ని విస్మరించి వివిధ శాఖోపశాఖలుగా చీలిపోయిందనేది మన కళ్ళ ముందు కనిపిస్తున్న నిజం. ఇప్పటికైనా మించి పోయింది లేదు. మంచికి ఎప్పుడూ ఒక ఆశాజనక స్థానం ఉంటుంది, కాన భారతీయ సమాజంలో వివిధ రకాలైన సాంస్కృతిక బహుళ రూపాల్ని సారంతో సహా ఆచరణాత్మకంగా అధ్యయనం చేయడానికి గ్రాంస్కీ స్ఫూర్తితో ప్రగతిశీల శక్తులు పూనుకుంటే బావుంటుంది.

మార్క్సిజాన్ని తాత్వికంగా అత్యున్నత స్థాయి లో నిలబెట్టిన బుద్ధిజీవిగా గ్రాంస్కీ ని వర్ణిస్తాడు యమ్మెన్ రాయ్ తన జ్ఞాపకాలు గ్రంథంలో. అయితే, రాయ్ జైల్లో ఆరేళ్ళు ఉన్నాడు. ఆ కాలంలో గ్రాంస్కీ లానే రాయ్ ప్రత్యేకంగా, శ్రద్ధగా విస్మరిత సంస్కృతిని అధ్యయనం చేసాడనీ, నవ్య మానవవాదం (New Humanism) పేరిట, ప్రత్యామ్నాయ సాంస్కృతిక నిర్మాణం అనేది ప్రజా బాహుళ్యంలో జరగకుండా విప్లవం పేరిట జరిగే తంతుల వల్ల ప్రయోజనం ఉండదనే నిర్ణయానికి రాయ్ అప్పుడే వచ్చాడంటారు ప్రఖ్యాత మేధావి భాస్కర్ సూర్, 'During his long jail

term, he (Roy) much like Gramsci was deeply thinking over the necessity of radical cultural transformation. Until there was to be a cultural revolution or Renaissance, or to put it in Gramscian vocabulary, a counter hegimony, any seizure of power would dismally fail in its revolutionary mission." అంటారు. అటువంటి సాంస్కృతిక వికాసం ఈ దేశంలో విస్తరించ డమే ధ్యేయంగా, యం. యన్. రాయ్ 75 ఏళ్ళ క్రితం Indian Renaissance Institute నెలకొల్పడం జరిగింది. దాని ప్రధాన ఉద్దేశం నూతన మానవుణ్ణి సృష్టించడమే. అందుకే, The Renaissance was a rebirth of man అంటాడు రాయ్.

అప్రస్తుతం కాదు కనుక ప్రస్తావించాల్సిన ముఖ్య అంశం ఏమిటంటే, ప్రపంచ. వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన ఎందరో వినూత్న సైద్ధాంతిక మార్క్సిస్టు మేధావుల్ని మలిచిన ఫ్రాంక్ఫర్డ్ స్కూల్ కూడా ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ పేరిట సరిగ్గా వందేళ్ళ క్రితం 1923 లో స్థాపించబడి ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక చరిత్రకీ, శోధనకి అద్భుతమైన చింతనాత్మక వారసత్వాన్ని అందించింది. అలాంటి సత్యాన్వేషణా తృష్ణ ను జీర్ణించుకుని కొత్త భావాలకు ఎల్లప్పుడూ తలుపులు తెరిచి సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు సాగిపోవడమే ఏ కాలంలోనైనా ప్రజాహిత వాదాలు చేయాల్సిన పని. మార్క్సువాదమైనా, గ్రాంస్కీవాదమైనా మనిషి పక్షాన అలా నిలిచేందుకు,మనిషి కాలానుగుణంగా మార్పుచేర్పులు చేసుకుందుకు మలచబడి న మహత్తరమైన మానవీయ మార్గాలే.

ఈ దేశంలో మనుషుల్ని చులకనగా చూస్తూ మతం పేరిట సాంస్కృతిక ఆధిపత్యం ఎప్పటి నుంచో చెలామణీ అవుతోంది. సామ్రాజ్యవాదం కొత్తగా దానికి తోడై ఒక సంకరజాతి దోపిడీ వర్గం జనించింది. కాన ఇక్కడ సాంస్కృతిక ప్రతిదాడి ప్రధానంగా బహుముఖంగా సాగాలి. సకల మార్గాలనూ అవలంబించాలి. దానికి సమ సమానత్వం, సామాజిక న్యాయమనేవే లక్ష్యం కావాలి. అందుకోసం వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్య కార్యాచరణ పై దృష్టి పెట్టాలి. అధ్యయనం ఒక తప్పనిసరి ఆయుధమనే విషయం గుర్తించాలి. రాజకీయ వేదికల కంటే కూడా వైజ్ఞానిక తాత్విక ధోరణుల్ని మెరుగుపర్చుకోవడం పై దృష్టి కేంద్రీకరించాలి. పౌర

సమాజంలో అర్ధవంతమైన ఆలోచనల్ని సారవంతంగా నిర్మించడమే ఏకైక ఎజెండాగా పనిచేయాలి. పార్టీలకి అతీతంగా ప్రజాపక్ష బుద్ధి జీవులకి, ప్రజాస్వామిక శ్రేణులకి మద్దతివ్వాలి. అప్పుడు మాత్రమే పేట్రేగిపోతున్న మతోన్మాదాన్ని కనీసంగానైనా నిలువరించగలం. అదే, అద్వితీయ సాంస్కృతిక కార్యశీలిగా, గ్రాంస్కీ నుండి స్వీకరించాల్సిన క్రియాశీల నిర్మాణాత్మకత. అదే, భావి తరాలకు గ్రాంస్కీ అందించిన అపూర్వమైన కార్యోన్ముఖ ఆచరణాశీలత. అదే, ఎన్నటికైనా ఆంటోనియో గ్రాంస్కీ నుండి వర్తమాన సమాజం తప్పనిసరిగా గ్రహించాల్సిన ప్రజాహిత ప్రాసంగికత.

మహత్తర "మేడే " పోరాట సందర్భంగా,

మహోజ్వల మహా పరంపర పథంలో..,

ఒక ప్రయాణం - భిన్న సందర్భాలు

(లక్నో - కాన్పూర్ - కాకోరీ స్మృతులు.)

కాకోరీ. ఆగస్టు 9, 1925. సరిగ్గా వందేళ్ల క్రితం ఈ దేశపు యువ ధిక్కారాన్ని అగ్గిరగిల్చి ప్రపంచమంతా బిగ్గరగా పరిచయం చేసిన పేరు." హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ " విప్లవకారులు ప్రత్యక్షంగా పాల్గొన్న

విప్లవాచరణ అది. ఎన్నాళ్లనుండి అనుకుంటున్నానో, ఇన్నాళ్ళకి వెళ్ళడమే కాక ఆ ఘటన మొత్తాన్ని రచించిన లక్నో లోని పురాతనమైన చేద్దీలాల్ ధర్మశాలలో ఓ రెండు రోజులు ఉండటం కుదిరింది. అప్పట్లో 227 గదిలో కాకోరీ పోరాట ప్రణాళిక సిద్ధం చేశారని అంటారు. అందులో ఉండటం కాలేదు కానీ అసలు ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ మాత్రం ఉండలేని 327 బాగా దుమ్ము పట్టున్న పాత గదిని ఇక తప్పక తీసుకున్నాను. రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ ఇద్దరూ మతాల్ని పక్కనపెట్టి సగటు మనిషిని దోపిడీ నుండి విముక్తి చేయడం కోసం హిందూ ముస్లిం సమైక్యతకు ప్రతీకగా సామ్రాజ్యవాదం మీద చేసిన పోరాటం

కాకోరీ. ' విభజించి పాలించు ' అనే పాలకుల పన్నాగాన్ని తుత్తునియలు చేసిన అసాధారణ కార్యక్రమం కాకోరీ.ఆస్మృతులతో నిర్మించిన అమరుల స్మారక కేంద్రం కాకోరీ ఊరికి కొంత దూరంలో ఉంది. పట్టింపు లేదు. బాగా దుమ్ముపట్టి నిర్లక్ష్యానికి నిదర్శనంలా ఉంది.

ఇక కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభ.

ఒకనాడు Revolutionary Capital of India గా పేరొందిన కాన్పూర్ లో 1925, డిసెంబర్ లో జరిగిన ఈ మహాసభ వివరాలు లభిస్తున్నవి తక్కువే. జరిగింది, జరిగిందనే కానీ ఆయా స్థలం తదితర వివరాలు ఒక్కరంటే ఒక్కరికి

కూడా నిర్ధారణగా తెలీదు.కాంగ్రెస్ పార్టీ కి చెందిన చాలామంది కమ్యూనిస్టు వ్యవస్థాపక సమావేశంలో ఉన్నారు. పదుల సంఖ్యలో పాత కామ్రేడ్స్ తో మాట్లాడి తీగ లాగితే మొత్తానికి గ్వాల్టోలి అనే దగ్గర మక్బారా వద్ద ఉన్న స్థలంలో ఆ సమావేశం జరిగిందనే డొంక దొరికింది. అసలా వివరాలు చెప్పగల వాళ్లు కూడా ఇప్పుడెవరు మిగల్లేదు సరికదా పదుల సంఖ్యలో ఉన్న వామపక్ష పార్టీలకు కనీసం ఆ వివరాలు కూడా ఇప్పటి వరకు పట్టలేదు.అందుకనే అక్కడ కనీసం ఒక్క స్మృతిచిహ్నం కూడా లేదు. మొత్తానికి ఎలాగోలా ఓ లింక్ పట్టుకు వెళ్ళి ఆ గ్రౌండ్ ఫొటోస్ తీసుకున్నాను. మొత్తం పాడుబడ్డ రోడ్లు, చెత్త చెదారంతో ఉంది. భారతీయ సామ్యవాద మహాసభ సంస్థాపక సమావేశం అక్కడ జరిగిందంటే నమ్మలేం.

కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చెప్పేటప్పుడు గుర్తుకు వచ్చే మొదటి వ్యక్తి హస్రత్ మొహాని."ఇంక్విలాబ్ జిందాబాద్ " నినాద రూపకర్త. " సంపూర్ణ స్వాతంత్రం" కోసం నినదించిన ఉద్యమకారుడు. మొట్టమొదటి కమ్యూనిస్టు మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షుడు. అధ్యక్ష ప్రసంగం చేసిన వ్యక్తి." అభ్యుదయ రచయితల సంఘం " వ్యవస్థాపకుల్లో ఒకరు. ఇలా చెప్పుకుంటే ఎన్నో.నాకు ఎంతో ఇష్టమైన కవి. " చుప్కే చుప్కే రాత్ దిన్ ఆన్సూ భహానా యాద్ హై..." విన్న ప్రతి సారీ గుండె ద్రవిస్తుంది. ఆయన జ్ఞాపకాలతో పాటు మహాత్మా గాంధీ తో సహా ఎన్నో విలువైన ఆనాటి జ్ఞాపకాలతో నిండిన 'ఫిరంగి మహల్ ' ను చూడటం ఒకెత్తయితే, ఊరి మారుమూలొక రజాబ్ గంజ్ అనే చోట ' బాహ్ మౌల్వీ అన్వర్ అనే మసీదు లో లిటరల్ గా అష్టకష్టాలు పడి లోపల గల స్మశానంలో సమాధుల్ని వెతుక్కుని తప్పక తాళం తీయించి, చల్లటి చెట్టు నీడలో శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న మహనీయుడు హస్రత్ మొహాని స్మృతిని దర్శించుకోవడం ఇన్నాళ్ళకి నెరవేరింది.

ఒక ఆసక్తికర విషయం చెప్పాలి. మొదటి భారతీయ కమ్యూనిస్టు మహాసభ చేసిన తీర్మానాల్లో రోజా లక్సమ్బర్గ్, కార్ల్ లిబ్నిష్క్ ల హత్యల్ని ఖండిస్తూ చేసిన తీర్మానం కూడా ఒకటి. తిరుగులేని రష్యన్ ప్రభావంతో దేశంలో మొట్టమొదట కమ్యూనిస్టు పార్టీ స్థాపిస్తున్న సమావేశంలో, అదే దేశంలో సిద్ధాంత విభేదాల తో చంపబడిన ఇరువురు మేధావులు, బుద్ధి జీవులకి నివాళి అర్పించడం భారతీయ

కమ్యూనిస్టు ఉద్యమ ప్రజాతంత్ర దృక్పథానికి తిరుగులేని నిదర్శనం. ప్రపంచ చరిత్రలో మరే దేశంలోనూ నాటికి, నేటికీ జరగని అపూర్వ విషయం. భిన్నాభిప్రాయాలు ఎన్నున్నా, ఈనాడు ఆదివాసుల మీద దేశవ్యాప్తంగా జరుగుతున్న హింసాకాండలో మౌనం పాటిస్తున్న మేధావులు మెలకువలో కూడా గ్రహించలేని విషయమిది. నక్సలైట్లనే నెపంతో పదుల సంఖ్యలో సాటి మనుషుల్ని చంపుతుంటే నోరు మెదపని మేధస్సు ఉంటే ఎంత, ఉడితే ఎంత. రష్యన్ విప్లవంతో ప్రభావితమైన వారిలో హజ్రత్ మొహాని ఒకరు. ఆనాడు ఆయన సభలో మాట్లాడుతూ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ లక్ష్యాలు ఏ విధంగా ఉంటే



మేలో ప్రసంగించారు. మద్రాస్ నుండి సింగరవేలు హాజరైన ఆ సభలో కులతత్వానికి వ్యతిరేకంగా చర్చ జరిగింది.

ఈ విషయం ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం ఈ దేశంలో ప్రతి 18 నిమిషాలకు దళిత బహుజనులు, స్త్రీలు, మైనారిటీల మీద ఒక దాడి జరుగుతోంది. వారానికి సగటున 13 మంది దళితులు హత్య చేయబడుతున్నారు. ఇంకా అనేక ప్రాంతాల్లో కులగజ్జి, అంటరానితనం బహిరంగంగానే అమలవుతోంది.' బ్రాహ్మణత్వం ', పెట్టుబడిదారీ స్వభావం ' కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరిలోనూ ప్రవేశించింది. జీవితం సమష్టి సమ్మేళనంగా కాక వ్యక్తిగత వ్యవహారంగా మారింది. అహంకారం, గొప్పలు ప్రదర్శించుకోవడం ఉన్నతంగా చిత్రిస్తుంటే, సాటి మనుషుల్ని ప్రేమించడం, సమానత్వాన్ని పాటించడం, ఆదర్శాల్ని ఆచరించడం పిచ్చితనంగా భావించ బడుతోంది. మార్పు కోసం పుట్టుకొచ్చిన ఉద్యమాలు అన్నీ కూడా ఈ కులతత్వానికి బలైపోయాయి. ఈ క్రమంలో అన్ని వామపక్ష విప్లవ రాజకీయాల్లో ఎన్నో విభేదాలకు, చీలికలకు కారణమైన ' కులం ' గురించిన చర్చ కమ్యూనిస్టు వ్యవస్థాపక సమావేశంలో జరగడం ఎంత ఆహ్వానించదగిన విషయమో, తర్వాత కాలంలో కులనిర్మూలన దిశగా ఆ ప్రయత్నాన్ని చర్చను కొనసాగించక పోవడం అంతే బాధాకరమైన విషయం.

రెండు, గణేష్ శంకర్ విద్యార్థి. ఏం జీవితం ? జీవితం అంటే అది కదా,అనుకునే జీవితం.ఎన్నిసార్లు రాసాను. ఇంకెన్నిసార్లు ప్రసంగాల్లో ప్రస్తావించాను. అక్షరాలు,అంకితాలు సరే కానీ ఆయన జ్ఞాపకాలు మాత్రం పల్చబడుతున్నా ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఒక మెడికల్ కాలేజీ, ఒక పార్కు, రెండు గుళ్ళు నేటికీ ఆయన పేరిట మిగిలిన చిహ్నాలు. మత కలహాలను నిలువరించడానికి మానవత్వమనే ఆయుధంతో పోరాడి చనిపోయిన యోధుడు.రాజ్యాంగ స్ఫూర్తి చిహ్నంగా నాలుగుసింహాల ముద్ర కింద గణేష్ శంకర్ విద్యార్థిని చిత్రిస్తూ ఆయన హత్య జరిగిన చోట నిర్మించిన గుడి నాకు తెలిసి దేశంలోనే అపురూపమైనది. ఇప్పుడు పాడుపడి పోతోంది. 'ప్రతాప్' పత్రిక

కార్యాలయం కూడా. ఎన్నేళ్లుగా అనుకుంటున్నానో, మనసార ఆ మహనీయుడి త్యాగాన్ని కన్నీటితో స్మరించుకోడానికి. భారతీయ భావోద్యమాల చరిత్రలో మత సామరస్యం కోసం తన నెత్తుటితో చెరగని ముద్ర వేసిన అసాధారణ మహనీయుడు, అస్తమించని సూర్యుడు గణేష్ శంకర్ విద్యార్థి.

మూడో వ్యక్తి భదంత బోధనంద మహాస్తవీర్. సాంప్రదాయక బౌద్ధాన్ని కాదని ఆధునిక యానంగా, ప్రజా ప్రవాహంగా భారతదేశంలో బౌద్ధాన్ని ఉద్యమ స్థాయిలో నిర్మించిన ఇరువురు మహా వ్యక్తులుగా మొదట బిక్కు మహావీర్ ను పేర్కొంటే, రెండు బోదానందను చెబుతారు. ఆశ్చర్యకరంగా, నవీన బౌద్ధానికి బలమైన రధ

చక్రాలుగా నిలిచిన మహాపండిత్ రాహుల్ సాంకృత్యాయన్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఇద్దరు కూడా భోదానంద్ జీవితంతో అత్యధికంగా ప్రభావిత మయ్యారు. అంబేద్కర్ తన ధర్మ దీక్ష భోదానంద్ చేతనే స్వీకరించాలని, ఆయన ఆధ్వర్యంలో భిక్కువుగా మారాలని తపించారు. కానీ భోదానంద ఆకస్మిక మరణంతో కుదరలేదు. ఉత్తర భారతదేశంలో మొట్టమొదటిసారిగా బౌద్ధాన్ని పీడితుల కోసం ఉ ద్యమంగా మలిచిన భోదానంద స్వయంగా బెంగాలీ బౌద్ధ ఆశ్రమం లో ఉండి దీక్ష స్వీకరించి కూడా, అక్కడ ఆధిపత్యాన్ని కాదని వందేళ్ల కిందట 1925 లో ఉత్తర భారత భావోద్యమం కోసం బుద్ధ విహారను స్థాపించారు.

మూఢత్వాన్ని చీల్చి చెండాడేలా ఉండే ఆయన బోధలు ఈనాటికి సంచలనమేనని విన్న వారు అంటుంటారు. ఆయన రచనలు ఇంకా బయటికి రావాల్సి ఉంది. అనేక మంది జిజ్ఞాసువులు శిష్యులుగా కలిగిన ఆయన నిత్యం సంచారంలోనే గడిపారు. వ్యక్తిగతంగా ఆయన నిర్మించిన, బాబా సాహెబ్ అంబేద్కర్ మూడు సార్లు సందర్శించి ముగ్ధులైన ఆశ్రమం ఇప్పుడు మరమ్మత్తుల్లో ఉ ంది. ప్రస్తుతం బిక్కు జ్ఞానలోక్ దాని బాధ్యతలు చూస్తున్నారు. ఆయనతో కాసేపు చర్చించి, ఏవో కొన్ని సూచనలు చేసాను. ఎన్నాళ్లుగానో నాలో స్ఫూర్తిని నింపుతున్న భదంత బోధనంద మహాస్తవీర్ అంతిమ విశ్రమ స్థలాన్ని కూడా ఎక్కడికి దగ్గర్లోని బెంగాల్ బుద్ధ విహారాలో దర్శించుకోవడం ఇన్నాళ్ళకి నెరవేరిన కల. జీవితం నిజమని నమ్మేవాడిని, కలల్ని ఎక్కువ కాలం కనలేను. సత్యంతో సావాసం లేకుండా సాగలేను. ఇంతా చేసి ఉన్నది రెండు మూడ్రోజులే. విపరీతమైన వేడి, ఎండ. పరుగులాంటి పయనం. అయినప్పటికీ అవ్యక్తమైన సంతృప్తి. అదంతే.

ఎందుకని అడక్కండి. కృంగిపోతున్న గుండెని ఒడిసి పట్టుకుని చైతన్యాన్ని నెలకొల్పడం కోసం కృషి చేసి ఒదిగిపోయిన యోధులకి కుదిరినంతలో నీరాజనాలు అర్పించడం కోసం. పదుల సంఖ్యలో జీవితాల్ని తృణప్రాయంగా త్యాగం చేసిన వీరుల అమరత్వంతో అమలిన కరచాలనం చేయడం కోసం. బతుకు బాటలో ఎడతెగని అన్వేషణకే అంకితమైన హృదయాలు ఎంతో బాధతో ఒలికించిన రక్తాశ్రువుల తత్వశాస్త్రాన్ని అయినంతలో అధ్యయనం చేయడం కోసం. ప్రమాదాల

చీకట్లతో నిత్యం యుద్ధం చేస్తూ కూడా నమ్మిన సైద్ధాంతిక దివిటీలతో వెలుతురు నింపుతున్న యువ కాంతిపుంజాల కోసం. స్వార్థం కోసం ప్రజల్లో అనేక సంక్షోభాలు రెచ్చగొడుతున్న సందర్భంలో, అక్కడక్కడా ఇంకా పూర్తిగా ఎండిపోకుండా పారుతున్న మానవత్వం కోసం. అట్టడుగు వర్గపు మనిషి కోసం. అడుగారిన అంతరంగ తరంగాల్ని తట్టి లేపడం కోసం.మన తదనంతర తరాల కోసం. ఇంకా, మనందరి కోసం. మానవీయ పరంపర కోసం.

మూడు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చి చరిత్ర క్రమాన్ని తమవంతు ప్రభావం చేసిన ముగ్గురు మహనీయుల స్ఫూర్తిని దేశమంతటా యుద్ధవాతావరణం నింపు

తున్న ఈ సమయంలో గుర్తు చేసుకోవడం నా వరకు నాకో బలం. ఈ దేశపు మానవీయ సౌందర్య సారం ఇంకా పూర్తిగా ద్వేషంతో నిండి కలుషితం కాలేదనే ధైర్యం. హిందూ గా పుట్టి మత సామరస్యం కోసం జీవితాన్ని పణంగాపెట్టి ప్రాణాలిచ్చిన విద్యార్థి,ముస్లింగా ఉంటూ కూడా కృష్ణుడిపై కవిత్వం రాయడమే కాక జీవితాంతం మనిషి పక్షాన నినదించిన హజ్రత్ మొహాని, అగ్ర కులంలో పుట్టి క్రైస్తవం నుండి స్ఫూర్తిని పొంది బౌద్ధునిగా మారి అట్టడుగు ప్రజాశ్రేణులతోబతికి జీవితాంతం బ్రాహ్మణత్వం పై సాక్షాత్తూ యుద్ధం చేసిన బిక్కు బోధానంద ల సజీవ భావధారని తాదాత్మ్యం చెందుతూ తరించడం వారి ఆశయాల సాధనలో సాగే మహా ప్రయత్నాన్ని మనిషిగా ధరించడమే. కాకోరీ మహోజ్వల స్మృతిలో ప్రవహించిన ఈ ప్రయాణం నాకు నేను మరోసారి హృదయంతో చేసుకున్న జీవితకాల ప్రమాణం.

(ఈ ఏడాది హజ్రత్ మొహాని 150 వ జయంతి, 74 వ వర్ధంతి సందర్భంగా, ఇంకా వివిధ సంస్థల శతజయంతుత్సవాల్ని పురస్కరించుకుని,ఏ ప్రణాళికా లేని, అసలు ముందుగా అనుకోని ఈ ప్రయాణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రకాలుగా సహకరించిన అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతూ ఈ చిన్న రైటప్.)

సమాజ హితమే సత్యాన్వేషణకి అర్థం !!!
సత్యాన్వేషణకు సరిహద్దులు ఉండవు !!
సత్యానంద్ స్టాక్స్: ఒక అన్వేషి జీవితం !





హిమాచల్ రాష్ట్రంలో మారుమూల తానేదార్ అనే గ్రామంలో చుట్టూ ఆపిల్ తోటల మధ్యన ఒక చిన్న కొండ మీద ఉన్న ఓ వందేళ్ళ క్రితం స్థాపించబడిన గుడికి నేను వెతుక్కుంటూ వెళ్ళాను. నిజానికి అది పేరుకు దేవాలయమే కానీ అందులో ఏ దేవుడూ ఉండడు. అసలలాంటి ఆలయం మరే దేశంలోనూ ఉన్నట్టు నాకు తెలియదు. భారత దేశానికి క్రైస్తవ మత ప్రచారానికని వొచ్చి తత్వజ్ఞానం పై వ్యామోహంతో ఆర్య సమాజ సాహిత్యాన్ని, వేదవేదాంగాల్ని అధ్యయనం చేసి సకల మతాల సారాన్ని గ్రహించి హిందూ మతం స్వీకరించి, విశ్వ మానవ మతం అదేదైన ఒక్కటేనని ప్రకటించి ఒక విశ్వనరుడు నిర్మించిన " పరంజ్యోతి ఆలయం " అది. విప్లవాత్మక ' క్వేకర్ ' క్రైస్తవ శాఖకు చెందిన ఒక బడా వ్యాపారవేత్త కుమారుడు, యవ్వనంలో ఏదో అన్వేషిస్తూ పరదేశం లోకి ప్రవేశించిన నవ యువకుడు అక్కడి పరిస్థితులు, పేద ప్రజల మీద జరుగుతున్న దోపిడీ, పీడనలకి వ్యతిరేకంగా నిలిచి తన వేష భాషలు మార్చుకుని స్థానిక యువతిని వివాహం చేసుకుని భారతీయతలోకి ప్రవేశించిన ఒక మహావ్యక్తి చరిత్ర ఆ ఆలయం నేపథ్యం.

ఎక్కడి అమెరికా, ఎక్కడి హిమాచల్ ప్రదేశ్. ఎందుకోసం వొచ్చాడు. ఈ దేశానికి ఎన్నెన్ని అరుదైన విశిష్ట సంపద ఇచ్చాడు.ఇక్కడి ప్రజల జీవితాల్లో పాలుపంచుకున్నాడు. ఈ సంస్కృతిలో భాగమయ్యాడు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నాడు. ఆలిండియా కాంగ్రెస్ నాగపూర్ సెషన్ లో పాల్గొని భారత స్వాతంత్ర్య ప్రకటన మీద సంతకం చేసిన ఏకైక విదేశీయుడు. ఒకే ఒక్క అమెరికన్. ఆనాటి వరకూ ఒక స్థిరమైన ఆదాయవనరు లేని హిమాచల్ ప్రదేశ్ ప్రాంతానికి తియ్యటి యాపిల్ పండ్లని సాగు చేసి చూపి ఏకంగా, " యాపిల్ రాజ్యం " చేశాడు. సిమ్లా ఆపిల్ అంటే ప్రపంచం అంతా నోరూరేలా ప్రసిద్ధి చెందేలా చేశాడు. స్టాక్స్, సత్యానంద్ స్టాక్స్. తిరుగు లేని సత్యాన్వేషణకి మరో రూపం. తిరోగమనం తెలీని ఆత్మగౌరవానికి అతడొక స్వరం. అందుకే ఈనాటికి హిమాచల్ యాపిల్ రైతాంగానికి, అక్కడి ప్రజా నీకానికి ఆయన పేరు విన బడగానే అప్రయత్నంగానే శిరస్సు వంగుతుంది, చేతులు రెండు గౌరవసూచకంగా ఒక్కటై నమస్కరిస్తాయి.

ఇంతకీ ఎవరీ స్టాక్స్.

క్రైస్తవ సంప్రదాయంలో క్వేకర్ ఉద్యమానిది విశిష్టమైన స్థానం. ఛాందస మత వైషమ్యం కాకుండా ప్రజా స్వామ్యం, శాంతియుత వైఖరిని పాటించే లక్షణాన్ని పెంపొందించుకున్న మార్గం.

అలాంటి కుటుంబంలో ఆగస్టు 16, 1882 అమెరికాలోని పెనిస్లేవియాలో గల ఫిలడెల్ఫియా లో శామ్యూల్ ఇవాన్ స్టాక్స్ గా పుట్టాడు. చదువు, మత సంబంధిత విషయాలు ఎలాగూ ఉన్నాయి. అంతకు మించిన ఆసక్తి, కొత్త మనుషులు ప్రాంతాల పై చింతనతో సిమ్లా దగ్గర ఉన్న కుష్ట వ్యాధిగ్రస్తుల కాలనీలో సేవ



చేయడానికి గాను 1904 లో 22 ఏళ్ల వయసులో మొదటిసారిగా ఇండియా వొచ్చాడు. తల్లిదండ్రుల ఇష్టానికి విరుద్ధంగా అప్పటికే భారతీయ తాత్విక ధోరణి పట్ల సానుకూల దృక్పథం కలిగిన స్టాక్స్ క్రైస్తవ సన్యాసిగా నిరాడంబరంగా ఆ పర్వత ప్రాంతాల్లో ఉండే ప్రజలతో జీవించాడు. వాళ్ల కోసం స్కూల్ ప్రారంభించాడు. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్థానికంగా ఎన్నో కార్యక్రమాలు రూపొందించాడు. స్వయంగా స్థానిక భాష నేర్చుకున్నాడు. భూస్వాములు, పెత్తందార్ల దోపిడీని వ్యతిరేకించాడు. స్వాతంత్ర పోరాటంలో కూడా భాగమయ్యాడు. స్వయంగా మహాత్మాగాంధీజీ ప్రశంసలకు పాత్రుడయ్యాడు.

హిమాచల్ లోని కోటగర్ ప్రాంతంలో ఆనాటి ప్రజల స్థితిగతులు దయనీయంగా ఉండేవి. వారికంటూ నిర్దిష్టమైన నంవద ఉండేది కాదు.వ్యవసాయం అంతంత మాత్రంగా ఉండేది. ప్రకృతి మీద ఆధారపడి బతుకుబండి వెల్లదీసే వారు. అలాంటి సమయంలో అమెరికా నుండి స్టాక్స్ యాపిల్ విత్తనాల్ని తీసుకొచ్చి ఎన్నో ప్రయోగాలు చేసి అక్కడి నేలకు అనువైన రకాలని సాగు చేయడం ప్రారంభించాడు. అంతే, ఈ రోజు ఒక్క సిమ్లా మాత్రమే కాదు, అటు కాశ్మీర్ నుండి ఇటు సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ వరకూ ప్రతి ఏటా కొన్ని లక్షల ఎకరాల్లో కోట్ల రాబడితో పండుతున్న యాపిల్ పండ్లకు మూలం సుమారు వందేళ్ల క్రితం స్టాక్స్ చేసిన పరిచయం ఆ మొదటి యాపిల్ పంట మాత్రమే. బైబిల్ ఆదిమ కాండంలో నిషేధిత ఫలాన్ని తినడం మనిషి చేసిన పాపం అని ప్రతీతి. కానీ అదే బైబిల్ ను నమ్మిన ఒక విదేశీయుడు నాటిన ఫలం ఈరోజు కొన్ని లక్షల ఎకరాలకు విస్తరించి కోట్లాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధిని అందిస్తోంది.

యాపిల్ ఆధారంగా భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్న న్యూటన్ లోకానికి ఎంత గొప్పో, యాపిల్ పంటతో భూమిని సద్వినియోగం చేయడం నేర్పి రైతాంగానికి సాధికారతను కూర్చిన స్టాక్స్ కూడా ఈ దేశానికి అంతే గొప్ప.కానీ, దురదృష్టవశాత్తూ ఈ రోజు స్టాక్స్ ఈ దేశంలో అపరిచితుడు. దేశం స్వాతంత్రం పొందడానికి కొద్దిరోజుల ముందు మే 14, 1946 న మరణించిన స్టాక్స్ కి

ఒకట్రెండు విగ్రహాలు, విద్యాసంస్థలకు ఆయన పేర్లు తప్పా ఆయన గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయన భార్యా, పిల్లలు, తర్వాత మనుమలు మనువరాళ్ల తరాలు కూడా ఈ దేశంతో కలగలిసిపోయారు. లాలా లజపతి రాయ్ వంటి దేశ నేతలతో పాటు ఆలిండియా కాంగ్రెస్ లో ప్రాతినిధ్యం వహించి, ఈ దేశ స్వాతంత్రం కోసం కారాగార శిక్ష అనుభవించిన స్టాక్స్, చివరివరకు భారతీయుడిగానే జీవించాడు. మత మార్పిల్లంటూ నాటకాలు ఆడే ఈనాటి మతోన్మాదులకు చంపపెట్టుగా సుమారు వందేళ్ల క్రితం హిందూ మతం స్వీకరించి తన పేరును సత్యానంద్ గా మార్చుకున్న మహావ్యక్తి స్టాక్స్. నిజానికి స్థానిక ప్రజల



ఒత్తిడి మేరకు ఒక విధంగా కులాన్ని కూడా పాటించిన స్టాక్స్ ' శుద్ధి' చేసు కుని స్వీకరించింది మరో మతాన్ని కాదు, మానవత్వాన్ని.

అందుకే, ఆనాటి వరకు ఎన్నడూ జరగని విధంగా ఒక విదేశీయుడై ఉండి ఈ దేశం మూల తత్వాన్ని అర్థం చేసుకుని, ఏ మతానికి చెందని విధంగా చరిత్రలో మొట్టమొదటి సారిగా మనిషి వైపు నిలిచే దైవం కోసమంటూ ఒక గుడిని ధైర్యంగా నిర్మించగలిగాడు. ఒక విదేశీయుడిగా ఈ దేశంలో స్టాక్స్ భౌతికంగా నిర్మించింది అసమానతలు లేని బడి, తారతమ్యాలు లేని గుడి ఐతే, భావజాల పరంగా నిర్మించింది అరమరికలు లేని ఒక ప్రేమస్పద వసుధైక కుటుంబ వ్యవస్థ గురించిన ఆచరణాత్మక ఆకాంక్షని. దానిని అమలు చేసే క్రియాశీలక చేతనాత్మక పాత్రే సత్యానంద స్టాక్స్ మొత్తం జీవితాంతం సాగించిన అవిరామ యాత్ర. ' సత్యకామ ' పేరుతో ఉద్గ్రంధం రచించిన స్టాక్స్ జైల్లో ఉండగానూ, బయటా కూడా అనేక రచనలు చేశాడు. సత్యానంద్ స్టాక్స్ అపురూప జీవితం, కృషి కోసం కూడా పరిశోధించి రాసిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వ్యక్తిగతంగా ఆశా శర్మ ఎన్నడో రాసిన An American in Gandhi's India / An American in Khadi ఎంతో హృద్యంగా రాసిన సత్యానంద్ స్టాక్స్ జీవిత కథ.ఆమె తల్లికి అంకితం ఇస్తూ ఆ పుస్తకంలో అన్న మాటలు, "Dedicated to my mother Champavathi, Quaker by Heritage, Christian by Spirit, Karmayogi in Life" మొత్తం స్టాక్స్ కుటుంబ స్ఫూర్తికి, ఆయన వ్యక్తిగతంగా చేసిన అద్భుతమైన అన్వేషణా ధాత్రికి తిరుగులేని నిదర్శనం.

ఆగస్టు 16, 1982 న స్టాక్స్ శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కురుస్తున్న వర్షంలో సైతం వందలాది మంది అభిమానులు సుదూర ప్రాంతాల నుండి కాలినడకన " సాబ్ జీ " కి నివాళులు అర్పించడానికి ఉవ్వెత్తున పరుగులు తీస్తూ రావడం చూసిన నాటి హిమాచల్ ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్టాక్స్ ని, " పర్వత ప్రాంత యేసు ప్రభువు " (Messiah Of The Hills) గా వర్ణించాడంటే స్టాక్స్ కి ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధం ఏమిటో అర్థమౌతుంది. స్టాక్స్ జీవితం గురించిన ప్రజలు స్వయంగా అల్లుకు సృష్టించుకుని పాడుకునే గీతాలు కూడా

ఈనాటికి వినిపిస్తాయి. ఆయన భార్య కూడా అక్కడే జీవించి చనిపోయింది. స్టాక్స్ స్మృతి చిహ్నంగా నిర్మించాలని చివరి వరకు తపించిన స్టాక్స్ సమాధి కానీ, గ్రంథాలయం కానీ, ఈనాటి దాకా కనీస నిర్మాణానికి నోచుకోలేదు. ఆయన సంతతి రాష్ట్ర రాజకీయాల్లో నాయకత్వ స్థానంలో ఉన్నప్పటికీ స్టాక్స్ స్మృతి చిహ్నాల పై ఎందుకో దృష్టి పెట్టలేదు. ఈ రోజు ఎవరు పట్టించుకోని పరంజ్యోతి దేవాలయం మాత్రం స్టాక్స్ ఫార్మ్ దగ్గర్లో మిగిలి ఉంది. నర్కుంద అనే చిన్న పట్టణం దగ్గర్లో ఉన్న గ్రామంలోని ఈ ఆలయం అచంచలమైన దైవాతీత మానవతావాద మహాసంకల్పానికి మరో రూపం. ఒక్క హిమాచల్ ప్రదేశ్ లో

మాత్రమే కాదు, ప్రపంచంలో ఒక విదేశీయుడు మనిషి ఆంతరిక ఆధ్యాత్మిక అన్వేషణకు దర్పణంగా, తన అంతర్గత చింతనకు ఆలవాలంగా నిలిపిన, మరెక్కడా లేని అద్వితీయమైన మహోన్నతమైన నిలయం అది. వ్యాపారాలకు వైషమ్యాలకు అతీతంగా ఈనాటికీ నిలిచిన ఆ చిన్న సౌధం, సాటి మనుషుల్ని ప్రేమించడం, తోటి వారి మంచిని కాంక్షించడమే, మతాలకు అతీతంగా మానవాళికి అందించే మహా సందేశం.

(ఎన్నిసార్లు హిమాచల్ వెళ్ళినా ఎప్పుడూ ఎందుకనో కుదరలేదు. చాలాకాలం నుండి అనుకుంటున్నా కానీ ఇన్నాళ్ళకిలా సాధ్యమైన పయనం ఇది. ముఖ్యంగా సత్యానంద్ స్టాక్స్ జీవిత చరిత్ర చదివిన నాటి నుండి వెళ్ళొద్దామని అనుకున్న చోటు ఇది. ఈ మధ్య జనించిన శారీరక బలహీనతలు, ఇతరేతర పని ఒత్తిళ్ల వల్ల ఒకందుకు వెనకడుగు వేసినా, మొత్తానికి మొన్న అకస్మాత్తుగా అనుకోని ప్రయాణంలో మిత్రుడు సతీష్ తో కలిసి స్టాక్స్ ఫామ్, పరంజ్యోతి ఆలయంతో పాటు సిమ్లా, కాజా, ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రాంతం కామిక్, హిక్కిం...వంటి చోట్లు చుట్టేశాను. లోతైన సంస్కృత తాత్విక వాక్యాలతో నిండిన ఈ వింత నిర్మాణాన్ని దర్శించడంలో ఆంతర్యం నా మనసులో చిరకాలంగా దాగున్న నిగూఢ మానవీయ సౌందర్య చింతనను సంతృప్తి పరుచుకోవడం మాత్రమే. అందులో భాగంగా ఇప్పటికైనా సత్యానంద్ స్టాక్స్ అపురూప జీవితం ఈ దేశ స్వాతంత్రం కోసం ఇక్కడి ప్రజల కోసం అహర్నిశలు చేసిన ఆయన కృషి రాబోయే తరాలకు తెలియాలని, అందుకోసం ఆలోచనాపరులు, పాలకులు నిజాయితీగా ప్రయత్నించాలని ఆశిస్తూ ఆయన గురించిన చిరు పరిచయంతో ఈ చిన్న రైటప్.)

ముగింపు

నాన్నకి నాకూ మధ్య ఆయన ఉండగా వీలవని ఖాళీని తర్వాత కాలంలో తడారని మనసుతో మనస్ఫూర్తిగా భర్తీ చేసే ప్రయత్నం ఇది. నాకు తెలిసిన హృదయ స్పందనే గీటురాయిగా మానవ సంబంధాల్లో ఏర్పడాల్సిన మానవతకు నా వంతుగా నిలుపుతున్న హార్దిక ఆర్ద్రత. అక్షరాలతో అలుముకున్న అనుబంధానికి పెనవేసుకున్న గాఢతను గుర్తు చేసుకున్నప్పుడల్లా ఎన్ని దుఃఖాలు గుండె తలుపు తడతాయో. ఎంత కన్నీరు గతంలోకి గాయాలమీదుగా ప్రవహిస్తుందో.

అలవాటైన నాన్న హుందాతనం, డాంబికం, కంగాలీతనం అద్భుతమైన ఆయన వ్యక్తిత్వం అన్నీ ఎంత అరుదైనవో తెలిసేలా కాలం చేస్తోంది. తప్పొప్పుల సంఘర్షణలో తప్పిపోయిన ఆప్యాయతలు, అనురాగాలను ఇప్పుడు మా బుడ్డోడిలో, కుటుంబంలో, మిత్రులలో, మనుషులందరిలోనూ ఆబగా వెతుకుతున్నాను. అభిమానం నిండిన గుండె గొంతుకతో ఆర్తిగా వెళుతున్నాను. అంతకు ముందు అలవాటు లేని మార్గం. అయినా, ప్రయాణం చేయడం తప్పదు. వెను దిరగడానికి మనసు సుతరామూ ఒప్పదు.

ఐహికమైనా,ఆధ్యాత్మికమైనా,మధ్యే మార్గమైనా మనిషి జీవితానికి మౌలిక స్పృహ కల్పించడం కోసం పుట్టినవే. ఏదోక ఉక్కపోతో సతమతమయ్యే ఉనికికి గట్టున పడేసి స్వేచ్ఛను ప్రసాదించడం కోసం వచ్చినవే. ఉత్పత్తి శక్తుల ప్రస్తావన లేకుండా జరిగే ఏ సత్యాన్వేషణైనా ఆ మేరకు సంపూర్ణం కాదనేది నా అభిప్రాయం. అందుకే, ఆలోచనల్లో ఉన్న ఉన్నతి ఆచరణలో కానరాదు. తాపీగా సాగే తాత్విక చర్చలు ఏవీ కూడా సగటు వ్యక్తిని కేంద్రం చేసుకోవు. ఈ దేశంలో అభివ్యక్తికి కూడా కులం ఉంది. మతం ఉంది. వివక్షత ఉంది.

అందుకు విరుద్ధంగా మానవాళి ప్రస్థానంలో సమానత కోసం నినదించిన స్వరాలు ప్రతితరంలోనూ, ప్రతి వ్యవస్థలోనూ ఉన్నాయి. నాకున్న పరిమితుల్లో అలాంటి వ్యక్తుల్ని గురించి తెలుసుకుని, మనమున్న సమాజానికి వారి కృషిని నామమాత్రంగా పరిచయం చేయాలనే పని స్వచ్ఛందంగా కల్పించుకుని చేస్తున్నాను. అందులో భాగంగా ఈసరికే పలు రంగాలకు సంబంధించి, పదుల సంఖ్యలో మహానుభావుల్ని వివిధ పుస్తకాల్లో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో పరిచయం చేస్తున్న సంగతి తెలిసిందే.

అలా, అనేక సందర్భాల్లో రాసిన ఈ వ్యాసాలు ఇప్పటికి ఇలా ఒక్కదరికి చేర్చి కూర్చడం జరిగింది.అనేక సంక్షోభాల సుడిగుండాలలో చిక్కుకున్న సమాజం ముఖ్యంగా యువత ఆలోచనలు నిర్మాణాత్మకంగా క్రియాశీలకంగా మల్చేందుకు ఉన్న మార్గాలు అన్నింటినీ అధ్యయనం చేయడం, పరిశోధించడం అవసరమని నా భావన. అందులో భాగమే ఈ రచన. సార్ధక జీవుల్ని గురించి అర్ధవంతంగా అక్షరీకరించిన వచన. ఇందులోని లోపాలకు, దోషాలకు పూర్తి భాధ్యత నాదే. విమర్శలకు ఆహ్వానం. ‘ అప్పామదేనా సంపాదేత్ ‘.

– *గౌరవ్*